@vaartanews @mvnewstv

మన మీ.. వార్త

ప్రతి అక్షరం... ప్రజల కోసం

తెలుగు దిన పత్రిక

www.mivaartanews.com

TGBIL/25/A0512

సోమవారం
19 అక్టోబర్ 2026

సూర్యపేట, హైదరాబాద్

MANA MI VARTA NEWS

సంపుటి : 02
సంచిక :107
పేజీలు : 12 వెల : 5/-






PUBLISHED AT SURYAPETA | HYDERABAD | KHAMMAM | KARIMNAGAR | MAHABOOBNAGAR | NALGONDA | NIZAMABAD | WARANGAL | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KURNOOL | MANGALAGIRI | NELLORE |


## యూనివర్సిటీల్లో ఖాళీల భర్తీకి

# అడుగు

- తొలి విడతలో ప్రత్యక్ష నియామకాలకు ప్రభుత్వం అనుమతి
- ఉస్మానియా యూనివర్సిటీలో అత్యధికంగా 252 పోస్టులు
- కాకతీయ, శాతవాహన వర్సిటీల్లో చెరో 49 పోస్టులు
- పాలమూరు యూనివర్సిటీలో 45 పోస్టుల భర్తీ
- అంబేద్కర్ ఓపెన్, తెలుగు వర్సిటీల్లో చెరో 16 పోస్టులు
- తెలంగాణ యూనివర్సిటీలో రెండు పోస్టులు
- నియామక ప్రకటనల జారీకి తక్షణ చర్యలు



హైదరాబాద్

తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మొత్తం 429 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను ప్రత్యక్ష నియామకాల ద్వారా భర్తీ చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. తొలి విడతలో భాగంగా చేపట్టనున్న ఈ నియామకాలతో ఉన్నత విద్యారంగంలో ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయనే ఆశాభావం - మిగతా12లో



## ఓట్ల చోరీకి పాల్పడుతున్న వారికి శిక్ష తప్పదు

- ఓటు చోరీకి మోదీ ప్లాన్.. అమిత్ షా అమలు
- సీఈసీ ద్వారా కార్యరూపం
- గోవాలోని మర్గావ్‌లో జరిగిన కాంగ్రెస్ గోయ్ రక్షోన్ యాత్రలో రాహుల్ గాంధీ
- కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ రాజ్యాంగాన్ని పరిరక్షించే శక్తి
- ఎట్టి పరిస్థితుల్లోనూ మోదీ, షా, జ్ఞానేశ్ కుమార్‌లను వదిలిపెట్టేది లేదు

# ఫ్యూచర్‌సిటీకి సీఎం రేవంత్

- ఫ్యూచర్‌సిటీ పోలీస్ కమిషనరేట్‌ను ప్రారంభించనున్న సీఎం
- ఇబ్రహీంపట్నంలో మధ్యాహ్నం 3.30 గంటలకు కార్యక్రమం
- యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని సందర్శించనున్న రేవంత్‌రెడ్డి
- ఎన్ఐయూఎం క్యాంపస్ నిర్మాణానికి శంకుస్థాపన
- ఫ్యూచర్‌సిటీ అభివృద్ధి ప్రణాళికలపై అధికారులతో సమీక్ష
- శాంతిభద్రతల బలోపేతానికి కొత్త కమిషనరేట్



హైదరాబాద్

తెలంగాణలో భవిష్యత్ నగర నిర్మాణం, శాంతిభద్రతల పరిరక్షణ, యువతకు నైపుణ్యాభివృద్ధి అవకాశాల కల్పనపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి సోమవారం (అక్టోబరు 19) ఫ్యూచర్‌సిటీలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఫ్యూచర్‌సిటీ పోలీస్ కమిషనరేట్‌ను ప్రారంభించడంతో పాటు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని సందర్శించనున్నారు. అలాగే, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐయూఎం) క్యాంపస్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం ఫ్యూచర్‌సిటీ అభివృద్ధికి సంబంధించి అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక, సాంకేతిక, విద్యా రంగాల అభివృద్ధికి - మిగతా12లో



## సౌదీ అరేబియాలోని భారతీయులకు అలర్ట్

- భద్రతా నిబంధనలు పాటించాలంటూ ఆదేశం
- హౌతీ తిరుగుబాటుదారుల దాడులతో సౌదీలోని భారతీయ కార్యాలయం అడ్వైజరీ జారీ
- అత్యవసర హెచ్చరికలు వస్తే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించి

## టామ్‌కామ్ వ్యవహారంపై సీఐడీ విచారణ జరిపించాలి

- జర్మనీలో ఉద్యోగాల పేరుతో 75 మంది యువతకు మోసం చేశారని ఆరోపణ..
- ఒక్కొక్కరి నుంచి రూ.4.5 లక్షలు వసూలు చేశారని విమర్శ
- వసూలు చేసిన డబ్బులు తిరిగి చెల్లించాలి..
- బాధితులకు నష్టపరిహారం అందించాలి..
- ప్రత్యామ్నాయ ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు



హైదరాబాద్

జర్మనీలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ టామ్‌కామ్ ద్వారా నిరుద్యోగ యువతను మోసం చేశారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ఆరోపించారు. రాష్ట్రానికి చెందిన 75 మంది యువత నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.4.5 లక్షల చొప్పున వసూలు చేసి రెండేళ్లుగా ఉద్యోగాలు కల్పించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. కొందరు యువత తమ పుస్తెలతాళ్లు సైతం తాకట్టుపెట్టి డబ్బులు చెల్లించినా, ఇప్పటివరకు కనీసం ఒక్క ఇంటర్వ్యూ కూడా నిర్వహించలేదని ఆరోపించారు. ఈ వ్యవహారంపై ఆయన ఎక్స్ వేదికగా ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. టామ్‌కామ్ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. బాధితుల నుంచి వసూలు చేసిన ప్రతి పైసాను వెంటనే తిరిగి చెల్లించాలని, ఉద్యోగాల కోసం ఎదురుచూస్తూ విలువైన సమయాన్ని కోల్పోయిన యువతకు నష్టపరిహారం అందించాలని కోరారు. మోసపోయిన వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఉద్యోగాలు కల్పించి ఆదుకోవాలని అన్నారు. - మిగతా12లో



## సీఈసీని ఎవరూ కాపాడలేరు

- వెంటనే సరను నిలిపివేయాలి
- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాల్సిందే
- ఎన్నికల సంఘం వ్యవస్థలో సమూల మార్పులు చేపట్టాలని కాంగ్రెస్ మరోసారి డిమాండ్

# అంబరాన్నంటిన సంబురాలు

### ఆడపడుచుల ఆటపాటలతో మార్మోగిన తెలంగాణ!

### తెలంగాణ వ్యాప్తంగా ఘనంగా సద్దుల బతుకమ్మ సంబురాలు!

- పూల పండుగకు పల్లెపల్లెనా పండుగ శోభ..
- ఆటపాటలతో మార్మోగిన తెలంగాణ
- ట్యాంక్‌బండ్‌పై మహా బతుకమ్మ ర్యాలీ..
- 700 మంది కళాకారులు, 600 మందికిపైగా మహిళల సందడి
- పూల సోయగాలు.. జానపద గీతాలు.. తెలంగాణ అంతటా పండుగ కోలాహలం!



హైదరాబాద్

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజిస్తూ మహిళలు జరుపుకునే ఈ పండుగలో భాగంగా సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ మహిళలు, యువతులు, చిన్నారులు చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, వలయాకారంలో నృత్యాలు చేస్తూ సందడి చేశారు. గ్రామాలు, పట్టణాలు పూల సోయగాలతో కళకళలాడగా, ఎక్కడ చూసినా పండుగ వాతావరణం కనిపించింది. తెలంగాణ అస్తిత్వాన్ని, ఆడపడుచుల ఆత్మీయతను, ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధాన్ని చాటిచెప్పే బతుకమ్మ సంబురాలు - మిగతా12లో

## ముంచుకొస్తున్న ఎల్‌నినో ముప్పు

- నీటి వృథాను అరికడితేనే సంక్షోభానికి కళ్లెం!
- ఎల్‌నినో పరిస్థితుల్లో రానున్న రోజుల్లో నీటి కొరత తలెత్తే అవకాశం ఉంది
- ఈ నేపథ్యంలో నిపుణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచిస్తున్నారు





## మా తీర్పు కాగితాలకే పరిమితం కావాలా?

- రుతుక్రమ ఆరోగ్యంపై రాష్ట్రాల నిర్లక్ష్యం
- సుప్రీం కోర్టు సీరియస్
- రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కింద రుతుక్రమ ఆరోగ్యాన్ని ప్రాథమిక హక్కుగా గుర్తించిన చారిత్రాత్మక తీర్పు అమలుపై రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నిర్లక్ష్యంపై సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహం

# సంపాదకీయం

## అమెరికా చలిమంటలకు ఏ చమురు అనర్హం!

అవకాశవాదం... అమెరికా.. ఈ రెండిటినీ విడదీసి చూడటం అసాధ్యం. ప్రపంచానికి ఎన్ని ఆదర్శాలను అమెరికా చెప్పిందో అంతకుమించి అవకాశవాదాలనూ ప్రదర్శించింది. స్వేచ్ఛా జీవితాన్ని గడపటానికీ, ఆనందాన్ని అనుభవించటానికీ పుట్టుకతోనే మనిషికి కొన్ని హక్కులు ఉంటాయని చాలా గొప్పగా తన స్వాతంత్ర్య ప్రకటనలో చెప్పిన అమెరికా దాన్ని ఏనాడూ పాటించలేదు. ఆఫ్రికా నుంచి కొనుగోలు చేసి అమెరికాకు తెచ్చిన లక్షలాది నల్లజాతీయులకు ఆ హక్కులను ఇవ్వాలన్న ఆలోచన రాలేదు. బానిసత్వాన్ని సహజసిద్ధమైన వ్యవస్థగా ఆమోదించి దశాబ్దాలపాటు దాన్ని అమలుచేసింది. 1965 వరకూ నల్లజాతీయులకు సమానహక్కులను ఇవ్వలేదు. అట్లాంటిక్ తీరం నుంచి పసిఫిక్ తీరం వరకూ దేశాధికారాన్ని విస్తరించే క్రమంలో వందలాది ఆదిమ తెగలను హరించివేసింది. ప్రజాస్వామ్య రాజకీయాలనూ, వ్యక్తి స్వేచ్ఛనూ, ప్రైవేటు వ్యాపారాలనూ ప్రపంచమంతా విస్తరించటమే తన లక్ష్యాలని చెబుతూ అనేక దేశాల్లో నియంతృత్వ ప్రభుత్వాలకు వెన్నుదన్నుగా నిలిచింది. మత, ఛాందసవాద సమూహాలను ప్రోత్సహించింది. ప్రపంచ ప్రయోజనాల పేరుతో నిన్నటి దాకా తప్పు.. తప్పు.. అని చెప్పి.. ఒక్కరోజులోనే దాన్ని ఒప్పు.. ఒప్పు అనగలిగిన అవకాశవాద నేర్పరితనం అమెరికాకు వెన్నతో పెట్టిన విద్య. రష్యా నుంచి పెద్దఎత్తున చమురు కొనుగోలు చేయనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ఘనంగా చేసిన ప్రకటనే ఇందుకు నిదర్శనం. నాలుగేళ్లకు పైగా సాగుతోన్న రష్యా--ఉక్రెయిన్ యుద్ధంతో ప్రపంచమే అట్టుడికిపోతోంది. రష్యాది దురాక్రమణగా భావించిన అమెరికా ఎన్ని ఆంక్షలు విధించాలో అన్నీ విధించింది. ఆ దేశం నుంచి చమురు కొంటున్న దేశాలను అదిరించి బెదిరించి లొంగదీసుకుంది. భారత్ కూడా ఒకదశలో రష్యా నుంచి కొనుగోళ్లను దాదాపుగా ఆపివేసింది. రష్యాతో లావాదేవీలను నడిపే దేశాలపై దిగుమతి సుంకాలనూ అమెరికా పెద్దఎత్తున విధించింది. ఉక్రెయిన్ సార్వభౌమత్వాన్ని కాపాడే పేరుతో విదేశాల్లో ఉన్న రష్యా ఆస్తులనూ స్తంభింపచేసింది. ఇంతటి శత్రుపూరిత వైఖరిని అతి తేలికగా మార్చుకుని అవకాశవాదంలో తనకు సాటిలేదనే విషయాన్ని అమెరికా మరోమారు స్పష్టంచేసింది. ఇలాంటి అవకాశవాదాన్ని దృష్టిలో ఉంచుకుని అమెరికా నిర్వాకాలపై గతంలో లోతైన విశ్లేషణలూ, కవిత్వాలూ చాలానే వచ్చాయి. 1961లో మహాకవి శ్రీశ్రీ కూడా ఆనాటి అమెరికా అధ్యక్షుడు కెన్నడీని ఉద్దేశిస్తూ కవిత రాశారు. 'అరువులిచ్చి కరువు తెచ్చి.. రుణంపెట్టి రణం తెచ్చి.. జనంధనం ఇంధనమై.. చరణ కరాబంధనమై.. జనన జరా మరణ దురాక్రమణల సంగ్రంథనమై.. ఒకనాడోహో అనిపించుక తిరిగిన.. ధనికవాద మికపై వెగటై జిగటై..' అంటూ ఆనాడు శ్రీశ్రీ రాసిన కవితలో కొన్ని పంక్తులు ఇప్పటికీ బాగా సరిపోతాయి. ట్రంప్ హయాంలో అమెరికా ధనికవాదం వెగటై.. జిగటై గతంలో ఎన్నడూ లేనంతగా అసహ్యం పుట్టిస్తోంది. ఒకప్పటి అమెరికా అధ్యక్షులైన అబ్రహం లింకన్, జాన్.ఎఫ్.కెన్నడీ లాంటి వారు వ్యక్తంచేసిన ఆదర్శ అభిప్రాయాలకు ప్రభావితమైన ప్రజాస్వామ్య ప్రియులు చాలామందే ఉండేవారు. ట్రంప్ లాంటి వాళ్లకు అట్లాంటివేవీ లేవు కనుక ప్రతి విధానమూ, ప్రతి ప్రకటనా ఇప్పుడు వెగటుగానే అనిపిస్తోంది. అన్నింట్లోనూ అమెరికా ప్రయోజనాలకే పెద్దపీట వేస్తామనీ, అందుకు అడ్డుగా ఉన్న అంతర్జాతీయ చట్టాలనూ, సంస్థలనూ, ఒప్పందాలనూ కాలరాస్తామని స్వయంగా అమెరికా అధ్యక్షుడే చెబుతుంటే నాగరిక మనుషులు సహించలేరు. వేల సంవత్సరాల సంస్కృతులు కలిగి, సుదీర్ఘ చరిత్రలో మానవాళి అభివృద్ధికి ఎంతో దోహదం చేసిన చైనా, భారత్ లాంటి దేశాల్లో గతం గురించి సమగ్ర అవగాహన పెరుగుతున్న కొద్దీ అమెరికాపై అసహనం ఎక్కువవుతుందే తప్ప తగ్గదు.

అమెరికా మద్దతు లేకపోతే రష్యా--ఉక్రెయిన్ యుద్ధం ఇంతకాలం కొనసాగి ఉండేది కాదు. రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రజాస్వామ్యవాది కాదు. ఆ దేశంలో ప్రజాస్వామ్య రాజకీయాలూ లేవు. నియంతల మనుగడకూ కొన్ని అంశాలు.. ముఖ్యంగా జాతి ప్రయోజనం, గౌరవం, భద్రత పేరుతో కూడినవి.. చాలా బాగా ఉపయోగపడతాయి. అమెరికా సారథ్యంలోని నాటో కూటమి స్వార్థం, అహంకారంతో వేసిన తప్పటడుగులు రష్యాను ఉక్రెయిన్ మీదకు ఉసిగొల్పేలా చేయగలిగాయి. జర్మనీ ఏకీకరణ (1990) సందర్భంగా నాటో విస్తరణ ఒక్క అంగుళం కూడా అదనంగా ఉండదని ఆనాటి సోవియట్ యూనియన్ అధ్యక్షుడైన మిఖాయిల్ గోర్బచెవ్‌కు అమెరికా హామీ ఇచ్చింది. ఈ హామీ మేరకే జర్మనీ ఏకీకరణ సాఫీగా సాగటానికి సోవియట్ యూనియన్ సహకరించింది. ఆ తర్వాత కొద్దికాలానికే సోవియట్ యూనియన్ (1991 డిసెంబర్ 26) పతనమైంది. రష్యా సహా 15 దేశాలు విడివిడిగా ఏర్పాటయ్యాయి. వీటిల్లో 9 దేశాలు క్రమంగా నాటోలో చేరిపోయాయి. ఒక్క అంగుళం హామీ అలా గాల్లో కలిసిపోయింది. రష్యాలో 2000 సంవత్సరం వరకూ ఆర్థికంగా అల్లకల్లోల పరిస్థితులే ఉన్నాయి. వీటికీ ఒక రకంగా అమెరికాయే కారణం. దశాబ్దాల పాటు కొనసాగిన ప్రభుత్వ నియంత్రిత ఆర్థిక వ్యవస్థను ఒక్కపెట్టున ప్రైవేటుపరం చేయటంతో పరిస్థితులు గాడితప్పాయి. ప్రభుత్వ సంస్థలనూ, కంపెనీలనూ కారుచౌకగా ప్రైవేటు రంగానికి కట్టబెట్టారు. అన్నిటినీ మార్కెట్‌కే వదలివేయటంతో ధరలూ, నిరుద్యోగమూ విజృంభించాయి. బ్లాక్‌మార్కెట్ సర్వసాధారణమైంది. విద్య, వైద్యరంగం, ప్రాథమిక సౌకర్యాల్లో ప్రభుత్వ పెట్టుబడులు తగ్గిపోవటంతో జీవన ప్రమాణాలు క్షీణించాయి. ప్రైవేటురంగంతో పోటీ పెరిగి రష్యా అభివృద్ధి పథంలో పరుగులు పెడుతుందన్న జోస్యాలు ఏ రకంగానూ నిజంకాలేదు. ఒకరకంగా అరాచకమే ప్రబలిపోయింది. అట్లా అమెరికా ప్రభుత్వమూ, ఆ దేశ మేధావులూ సూచించిన విధానాలు అస్తవ్యస్త పరిస్థితులకే దారితీశాయి. పుతిన్ అధికారాన్ని చేజిక్కించుకోటానికి అవే కారణమయ్యాయి. ఆ నేపథ్యంలోనే రష్యాకు మళ్లీ ఒకనాటి వైభవాన్ని తీసుకువస్తానన్న పుతిన్ వాగ్దానాలు ప్రజలపై ప్రభావాన్ని కలగచేశాయి. ఒక భాష, ఒక మతం, ఒక జాతి (జ్ష్ట్రఅఊఎ జశీఎఎబఅఊఎ) దేశ అస్తిత్వానికి పునాదిగా ఉన్నచోట భావోద్వేగాలను రెచ్చగొట్టటం తేలిక. రష్యాకు చుట్టూ ప్రమాదం ముంచుకొస్తోందన్న పుతిన్ ప్రచారానికి ఆ ఉద్వేగాలు తోడ్పడ్డాయి. ఉక్రెయిన్, జార్జియాలు కూడా భవిష్యత్తులో నాటోలో చేరతాయన్న ప్రకటనతో (2008) రష్యాలో భయాలు మరింత తీవ్రమయ్యాయి. ఇక అక్కడి నుంచి ఉక్రెయిన్‌పై రష్యా బాగా దృష్టి పెట్టింది. రష్యాకు అనుకూలంగా ఉండే ఉక్రెయిన్ అధ్యక్షుడు విక్టర్ యూనుకోవిట్ అధికారాన్ని కోల్పోవటంలో అమెరికా, పశ్చిమ యూరప్ దేశాల పాత్ర చాలా ఉంది. మైదాన్ విప్లవం పేరుతో ఉక్రెయిన్‌లో జరిగిన రాజకీయ పరిణామాలకు అమెరికా పూర్తిగా సహకరించింది. ఆ వెంటనే క్రిమియాను రష్యా ఆక్రమించింది. ఉక్రెయిన్‌లోని రష్యా సరిహద్దు ప్రాంతాల్లో తిరుగుబాట్లను పోత్సహించింది. చివరికి 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై ప్రత్యక్ష యుద్ధానికి దిగింది. ఉక్రెయిన్‌కు యుద్ధ సహాయం కింద అమెరికా ఈ ఏడాది మార్చివరకూ రూ.12 లక్షల కోట్లను ఖర్చుపెట్టింది. మొత్తంగా రూ.17 లక్షల కోట్లు వ్యయం అవుతాయని లెక్కలుకట్టింది. ఇవిగాక ప్రపంచ బ్యాంకు నుంచి ఉక్రెయిన్‌కు రూ.1.90 లక్షల కోట్లను రుణంగా ఇప్పించింది. యూరోపియన్ యూనియన్ (ఈయూ) మరో రూ.22 లక్షల కోట్లను ఉక్రెయిన్ యుద్ధానికి ఖర్చు చేస్తోంది. అంటే అమెరికా, ఈయూ కలిసి దాదాపు రూ.40 లక్షల కోట్లను వెచ్చిస్తున్నాయి. ఉక్రెయిన్ తటస్థ దేశంగా ఉంటుందనీ, నాటో కూటమిలో చేర్చుకునేది లేదనీ స్పష్టంచేయకుండా, నాలుగున్నర ఏళ్ల నుంచీ దౌత్యపరమైన చొరవను ప్రదర్శించకుండా, లక్షల మరణాలకూ, భౌతిక ఆస్తుల విధ్వంసానికి అమెరికాయే ప్రధానంగా ప్రత్యక్ష, పరోక్ష కారణమైంది. ఇంతగా కకావికలు చేసి మధ్యంతర ఎన్నికల్లో గెలవటానికి రష్యా చమురు కొనుగోలునే అస్త్రంగా చేసుకుని రాజకీయంగా దిగజారిపోతున్న ప్రతిష్ఠను కాపాడుకోటానికి ట్రంప్ ప్రయత్నిస్తున్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం అవసరమైతే మళ్లీ రష్యా చమురు అమ్మకాలపై నిషేధాన్ని విధించొచ్చు. యుద్ధం వల్ల ఇప్పటికే జరిగిన ప్రాణనష్టం లక్షల్లో ఉంది. అనధికార అంచనాల ప్రకారమే ఇరు దేశాలకు చెందిన 6 లక్షల మంది సైనికులు మరణించారు. ఇందులో రష్యను సైనికులే నాలుగున్నర లక్షల దాకా ఉండొచ్చు. పౌరులు 20 వేల మంది చనిపోయి ఉంటారన్నది అంచనా. గాయపడిన వాళ్లు 15 లక్షల దాకా ఉండొచ్చు. ఆస్తుల విధ్వంసం, ఆర్థిక వ్యవస్థకు ఇతరత్రా జరిగిన నష్టం ఉక్రెయిన్‌లోనే రూ.82 లక్షల కోట్లు ఉంటుంది. యుద్ధం ముగిస్తే ఆ దేశంలో పునర్ నిర్మాణానికి రూ.56 లక్షల కోట్లు ఖర్చుపెట్టాల్సి వస్తుంది. ఇక రష్యాలో జరిగిన నష్టం గురించి అంచనాలు బయటకు రావటం లేదు. ఉక్రెయిన్‌తో పోల్చితే అది నాలుగో వంతే ఉండొచ్చు. ఈ శతాబ్దంలో అమెరికా ప్రత్యక్షంగా యుద్ధాలు చేసిన చోటా (ఆఫ్ఘనిస్థాన్, ఇరాక్), పరోక్షంగా యుద్ధాలను రగిల్చిన చోటా ఎక్కడా శాంతిని నెలకొల్పిన దాఖలాల్లేవు.

# ఇకనైనా ఇథనాల్, కోకాకోలా, డేటా సెంటర్లకు నీళ్లు ఆపండి!



రాష్ట్రంలో ఈ ఏడాది ఖరీఫ్ వ్యవసాయాన్ని ఎల్‌నినో తీవ్రంగా దెబ్బతీసింది. వర్షాభావం, అడుగంటిపోతున్న భూగర్భ జలాలు, ఖాళీ అవుతున్న రిజర్వాయర్లు రాష్ట్రంలో తీవ్ర కరువు పరిస్థితులను సృష్టిస్తున్నాయి. ఇప్పటికే పెసర, మినుము, సోయాబీన్ వంటి పంటలు కోతకు వస్తుండగా, మిగిలిన పంటలు నీరందక ఎండిపోతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో బావులు, బోర్లు ఎండిపోవడంతో పాటు విద్యుత్ కోతలు సర్వసాధారణమయ్యాయి. యూనిట్‌కు పది రూపాయలు చెల్లించి కొందామన్నా మార్కెట్‌లో విద్యుత్ లభించని పరిస్థితి ఉందని ప్రభుత్వమే ప్రకటించడం పరిస్థితుల తీవ్రతకు అద్దం పడుతోంది. రాష్ట్ర వ్యవసాయానికి ఆధారమైన నైరుతి రుతుపవనాల కాలంలో వర్షపాతం తీవ్రంగా పడిపోయింది. ఈ రుతుపవనాల సాధారణ వర్షపాతం 740.6 మిల్లీమీటర్లు కాగా, గత సంవత్సరం జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు 988.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కానీ ఈ ఏడాది అదే కాలంలో 615.5 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 16 జిల్లాలు మాత్రమే సాధారణ వర్షపాతాన్ని నమోదు చేయగా, ఏకంగా 17 జిల్లాల్లో 20శాతం నుంచి 59 శాతం వరకు లోటు వర్షపాతం నమోదైంది. గతేడాది సెప్టెంబర్ 30 నాటికి రాష్ట్రంలోని ప్రధాన రిజర్వాయర్లలో 848.77 టీఎంసీల నీరు ఉండగా, ఈ ఏడాది అది 475.57 టీఎంసీలకు పడిపోయింది.

ఉపరితల నీటి లభ్యత తగ్గడంతో రైతులు బోర్లపై విపరీతంగా ఆధారపడ్డారు. దీనికి తోడు నీటి వినియోగం ఎక్కువగా ఉండే వరి, పత్తి పంటలను విస్తృతంగా సాగు చేయడంతో భూగర్భ జలాలు పాతాళానికి పడిపోయాయి. రాష్ట్రవ్యాప్తంగా సగటు భూగర్భ జలమట్టం గత ఏడాది ఆగస్టులో 5.78 మీటర్లు ఉండగా, ఈ ఏడాది ఆగస్టు నాటికి 7.87 మీటర్లకు పడిపోయింది. ఈ ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగు విస్తీర్ణం కూడా తగ్గింది. రాష్ట్ర సాధారణ సాగు విస్తీర్ణం 1,32,38,446 ఎకరాలు కాగా, ఈసారి 1,25,85,426 ఎకరాలకు పరిమితమైంది. వరి సాధారణ సాగు విస్తీర్ణం 65,95,645 ఎకరాలు కాగా, గతేడాది ఖరీఫ్‌లో 67,33,484 ఎకరాల్లో సాగై, ఈసారి 56,79,969 ఎకరాలకు అంటే దాదాపు 9 లక్షల ఎకరాలకు పైగా తగ్గింది. ధాన్యాల మొత్తం సాగు విస్తీర్ణం 72,48,771 ఎకరాలకు గాను 63,12,526 ఎకరాల్లో (87శాతం) మాత్రమే సాగైంది. నూనెగింజల సాగు 4,47,585 ఎకరాల సాధారణ విస్తీర్ణానికి గాను 3,96,597 ఎకరాలకు పరిమితమైంది.

రాబోయే యాసంగి (రబీ) సీజన్‌లో వరి వంటి నీరు ఎక్కువగా అవసరమయ్యే పంటలను సాగు చేయడం తీవ్ర ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. నీటి లభ్యతను బట్టి డ్రిప్, స్ప్రింక్లర్ పద్ధతుల ద్వారా తక్కువ నీటితో పండే జొన్న, సజ్జ, రాగి వంటి చిరుధాన్యాలు, శనగ, పెసర వంటి పప్పుధాన్యాలు, ఆముదం, వేరుశనగ వంటి నూనెగింజల ఆరుతడి పంటలను మాత్రమే వేయాలి. మరోవైపు ప్రభుత్వం శాస్త్రీయ అవగాహన లేకుండా ప్రోత్సహిస్తున్న ఆయిల్ పామ్ సాగు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి. ఒక ఆయిల్ పామ్ చెట్టుకు రోజుకు 250 నుంచి 300 లీటర్ల నీరు, ఏటా 1500 నుంచి 1800 మి.మీ వర్షపాతం అవసరం. కరువు సమయంలో కొత్తగా ఆయిల్ పామ్ నాటితే 90శాతానికి పైగా లేత మొక్కలు ఎండిపోయే ప్రమాదం ఉంది. ఈ క్లిష్ట సమయంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కరువు మండలాలను ప్రకటించి, కేంద్రానికి నివేదికలు పంపి ఎన్‌డీఆర్‌ఎఫ్ నిధులతో పాటు రాష్ట్ర బడ్జెట్ నుంచి నిధులు కేటాయించాలి. ఇతర మౌలిక వసతుల కాంట్రాక్టర్లకు ఇచ్చే నిధులను కరువు పీడిత గ్రామాలకు మళ్లించాలి. రాష్ట్రంలో పంటల బీమా పథకాన్ని వెంటనే అమలులోకి తేవాలి. ఖరీఫ్‌లో సగటు దిగుబడులు పడిపోయిన రైతులందరికీ బీమా పథకం కింద నష్ట పరిహారం అందించాలి. గత ఆరు సీజన్లుగా పంటల బీమా పథకం లేక రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ పథకం ప్రయోజనాలను పొందడానికి వీలుగా కౌలు రైతులను కూడా ప్రభుత్వం తక్షణమే గుర్తించాలి. ఈ సీజన్‌లో పంటల సగటు దిగుబడులు బాగా తగ్గిన రైతులతో పాటు కూరగాయల రైతులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలి. కౌలు రైతులతో సహా, పంటలు ఎండిపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి. వరి, పత్తి లాంటి ప్రధాన పంటలకు 2026లో స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం నిర్ణయించిన రుణ పరిమితిలో 50శాతం వరకూ రైతులకు పరిహారంగా అందించాలి. కౌలు రైతుల గుర్తింపు కోసం 2011 అధీకృత సాగుదారుల చట్టాన్ని అమలు చేయాలి. వ్యవసాయంలో కీలకపాత్ర పోషిస్తున్న మహిళా రైతులను గుర్తించడానికి మహారాష్ట్ర తరహాలో ప్రత్యేక చట్టాన్ని తేవాలి. పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనెగింజలకు మద్దతు ధర దక్కేలా ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి. యాసంగికి ఆరుతడి విత్తనాలను ఉచితంగా సరఫరా చేయాలి. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడడంతో పాటు పశువుల మేతను సరఫరా చేయాలి. వలసలను నివారించడానికి ఉపాధి హామీ పనులను తక్షణమే విస్తృతంగా ప్రారంభించాలి. ఎక్కువ మందికి పనులు కల్పించడానికి వీలుగా చిన్న, సన్నకారు రైతులకు, గ్రామీణ మౌలిక వసతులైన గిడ్డంగులు, డ్రయ్యింగ్ యార్డులు, స్కూల్ భవనాలు, లాంటి మౌలిక వసతుల మేలు జరిగేలా ఈ సీజన్‌లో ఉన్న ప్రత్యేక పరిస్థితి దృష్ట్యా కొత్త పనులను ఉపాధి హామీ పథకానికి జోడించాలి. రైతుల, స్వయం సహాయక బృందాల బ్యాంకు అప్పుల వాయిదాలను ప్రభుత్వం ఒక ఏడాది పాటు వాయిదా వేసి, వడ్డీలను మాఫీ చేయాలి. ఇప్పటికీ మిషన్ భగీరథ పథకం గ్రామీణ, ఆదివాసీ ప్రాంతాలలో పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు. చాలా చోట్ల ఈ ప్రాంతాల ప్రజలకు తాగునీరు అందడం లేదు. మిషన్ భగీరథ పూర్తి స్థాయి మంచి నీటి పథకం. ఈ పథకం అమలులోని సమస్యలను పరిష్కరించడానికి, తగిన స్థాయిలో తాగునీటిని ప్రజలకు సరఫరా చేయడానికి ప్రభుత్వం పూనుకోకపోవడం వల్ల, ప్రజలు ఎంతో డబ్బు వెచ్చించి నీటిని కొనుగోలు చేస్తున్నారు. ఇది ఆయా కుటుంబాలపై పెద్ద ఆర్థిక భారాన్ని మోపుతున్నది. అన్నింటికంటే ముఖ్యంగా, ప్రాజెక్టులలో నీటి కొరత ఉన్నందున మిషన్ భగీరథ నీటిని ఇథనాల్, కోకాకోలా, డేటా సెంటర్లు వంటి పరిశ్రమలకు మళ్లించకుండా, కేవలం ప్రజల తాగునీటికి, ఆరుతడి పంటలకు మాత్రమే వినియోగించాలి

# కక్షసాధింపులో 'బతుకమ్మ' బలి!



తెలంగాణ ఉద్యమంలో అస్తిత్వ పతాకగా నిలిచిన బతుకమ్మపై ఉద్యమ ద్వేషులైన కాంగ్రెస్ పాలకులు వారి సహజ రీతిలోనే వివక్ష చూపిస్తున్నారు. ఈ పండుగకు సిరిసిల్ల నేతన్నలకు కనీసం చీరల ఆర్డర్లు కూడా సరిగా ఇవ్వకపోవడంతో కార్మిక కుటుంబాలు ఆకలికేకలతో అల్లాడుతున్నాయి. కనిపించిన దేవుళ్ల పేర్లన్నీ వాడుకొని రాజకీయం చేసే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, తెలంగాణ ఆడబిడ్డల ఘనమైన పండుగ బతుకమ్మకు సరైన ఏర్పాట్లు చేయడం చేతకావడం లేదా? లేదం టే, బతుకమ్మ ఆటపాటల్లో కూడా వినాయకచవితి పండుగలాగే ఊరూరా కేసీఆర్ గానమే వినిపిస్తుందనే భయమా? అని ప్రజల్లో చర్చ జరుగుతున్నది. స్వరాష్ట్ర కల సాకారమైన ఆత్మగౌరవ ప్రతీక. పరాయి పాలకుల గడ్డపై, ఆంధ్రా వలస పాలనలో అణచివేతకు గురైనా మన అస్తిత్వాన్ని చాటుకోవడానికి, ఉద్యమకాలంలో ఇదే బతుకమ్మ తెలంగాణ అస్తిత్వ పతాకమై నిలిచింది. ఆనాడు ఉద్యమంలో వీధివీధినా పూల సింగిడిలై కదిలిన ఆడబిడ్డలు, స్వయంపాలన కాంక్షను ఈ పండుగ ద్వారానే చాటారు. కేసీఆర్ నాయకత్వంలోని గులాబీ సైన్యం ఈ పండుగకు బ్రాండ్ అంబాసిడర్‌గా ముందుండి నిలిచింది. తెలంగాణ సంస్కృతి, బతుకమ్మ విశిష్టతను గల్లీ నుంచి ఢిల్లీ దాటించి లండన్, అమెరికా మీదుగా దుబాయ్ బుర్జు ఖలీఫా స్క్రీన్ల వరకు చేర్చి, అంతర్జాతీయ స్థాయిలో బతుకమ్మకు ఒక సగర్వమైన గుర్తింపును తెచ్చింది బీఆర్‌ఎస్ శ్రేణులే. స్వరాష్ట్రంలో అధికారం మార్పిడి జరిగి, కాంగ్రెస్ పాలకులు గద్దెనెక్కిన తర్వాత నుంచి కనిపిస్తున్న దృశ్యాలు ప్రతీ తెలంగాణవాసి గుండెను రగిలిస్తున్నాయి. అధికార పార్టీకి తెలంగాణ సంస్కృతి అన్నా, ఇక్కడి సంప్రదాయాలన్నా ఎంతటి చులకన భావమున్నదో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వైఖరి చూస్తే స్పష్టమవుతున్నది. బతుకమ్మ పండుగను తాము ఎంత ఘనంగా నిర్వహించినా, అది తెలంగాణ వాదానికి, బీఆర్‌ఎస్‌కు, కేసీఆర్‌కు లబ్ధి చేకూరుస్తుందనే అక్కసుతో, తీవ్రమైన రాజకీయ ద్వేషంతోనే రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోవడం లేదనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. బీఆర్‌ఎస్ తొమ్మిదిన్నరేండ్ల పాలనలో కోటి మందికిపైగా ఆడబిడ్డల ఇంటికి 'బతుకమ్మ కానుక'గా రేషన్ షాపుల ద్వారా వారం రోజుల ముందే చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టి, పూర్తి చేసేవారు. వందలాది రంగులు, అద్భుతమైన డిజైన్లతో ఒక కుటుంబంలో అన్నగా, తమ్ముడిగా ముఖ్యమంత్రి కేసీఆర్ పంపే ఆ చీరల కోసం మహిళలు ఎంతగానో ఎదురుచూసేవారు. కానీ నేడు, ఇందిరమ్మ రాజ్యం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో బతుకమ్మ కానుకలపై కక్షసాధింపు చర్యలు మొదలయ్యాయి. ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని బజారుకీడుస్తూ, చీరల పంపిణీని నిలిపివేసి, బతుకమ్మపై తమకున్న వివక్షను బట్టబయలు చేసుకున్నారు. నాడు బతుకమ్మ చీరల ఆర్డర్ల వల్ల సిరిసిల్ల పవర్‌లూమ్ రంగానికి, పోచంపల్లి చేనేత కార్మికులకు రూ.350 కోట్లకు పైగా బడ్జెట్‌తో నిరంతరాయంగా ఉపాధి లభించేది. ఆ మగ్గాల చప్పుడు నేతన్నల ఇండ్లల్లో సంక్రాంతి సంబురాన్ని నింపేది. కానీ నేడు కాంగ్రెస్ సర్కార్ నేతన్నలకు పాత బకాయిలు చెల్లించకుండా, కొత్త ఆర్డర్లు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నది. సిరిసిల్ల నేతన్నలను బతుకమ్మ చీరల నెపంతో రోడ్డున పడేసి, సూరత్ కంపెనీలకు మేలు చేసేలా కాంగ్రెస్ నాయకులు వ్యవహరించడం వెనుక ఉన్న కుట్రలేమిటో ప్రజలంతా గమనిస్తున్నారు. బీఆర్‌ఎస్ హయాంలో బతుకమ్మను రాష్ట్ర పండుగగా ప్రకటించి, సాంస్కృతిక శాఖ ద్వారా ప్రతి ఏటా కోట్ల రూపాయల నిధులను నేరుగా జిల్లాలకు, గ్రామ పంచాయతీలకు కేటాయించేవారు. హైదరాబాద్ నగరంలోని ప్రధాన చెరువులు, రాష్ట్రంలోనే వేలాది నిమజ్జన ప్రాంతాలన్నీ విద్యుత్తు వెలుగులతో, అద్భుతమైన మౌలిక వసతులతో, క్యూలైన్లతో వైభవంగా వెలిగిపోయేవి. బీఆర్ఎస్ హయాంలో బతుకమ్మను రాష్ట్ర పండుగగా ప్రకటించి, సాంస్కృతిక శాఖ ద్వారా ప్రతి ఏటా కోట్ల రూపాయల నిధులను నేరుగా జిల్లాలకు, గ్రామ పంచాయతీలకు కేటాయించేవారు. హైదరాబాద్ నగరంలోని ప్రధాన చెరువులు, రాష్ట్రంలోనే వేలాది నిమజ్జన ప్రాంతాలన్నీ విద్యుత్తు వెలుగులతో, అద్భుతమైన మౌలిక వసతులతో, క్యూలైన్లతో వైభవంగా వెలిగిపోయేవి. కానీ నేడు ఆ చెరువుల్లో కనీసం గుర్రపుడెక్కను తీయడానికి, వీధి దీపాలు ఏర్పాటు చేయడానికి కూడా స్థానిక సంస్థల వద్ద నిధులు లేకపోవడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి. అనవసరమైన పనులకు వేల కోట్లాది రూపాయలను కేటాయిస్తున్న కాంగ్రెస్ సర్కార్, బతుకమ్మ పండుగ నిర్వహణకు బడ్జెట్ విడుదల చేయకుండా చేతులెత్తేసి, తెలంగాణ పరువు తీసింది. ఢిల్లీ పాలకుల కనుసన్నల్లో నడిచే కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలంగాణ మట్టి వాసన, ఇక్కడి అస్తిత్వ పండుగల విలువ తెలియకపోవడంలో ఆశ్చర్యం లేదు. కానీ, కేసీఆర్‌పై ఉన్న రాజకీయ కక్షను తెలంగాణ పౌరుల ఆత్మగౌరవమైన బతుకమ్మ పండుగపై చూపించడం అత్యంత దుర్మా ర్గం. ఈ వివక్షను తెలంగాణ సమాజం అంతా గమనిస్తున్నది. మన సంస్కృతిని గౌరవించని రాష్ట్ర పాలకులకు, మన పండుగలను అవమానించే ఈ శక్తులకు ఈ గడ్డపై పుట్టిన ప్రతి ఆడబిడ్డ, ప్రతి నేతన్న రాబోయే రోజుల్లో తమ ఓ టుహక్కు రూపంలో బుద్ధి చెప్పడం ఖాయం.

# ఓల్డ్ రామంతపూర్ మహాకాళి అమ్మవారి ఆలయ అర్చకులకు నూతన వస్త్రాల పంపిణీ







**రామంతాపూర్, అక్టోబర్ 18 ( మన మీ వార్త):**

ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని ఓల్డ్ రామంతపూర్‌లో కొలువుదీరిన శ్రీ మహాకాళి అమ్మవారి ఆలయంలో అర్చకులకు నూతన వస్త్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గత ఐదు రోజులుగా అమ్మవారిని వివిధ రకాలుగా అలంకరిస్తూ, భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులకు ఆవులగడ్డ వంశీ యాదవ్, కాంగ్రెస్ నాయకులు ఆవుల గడ్డ శ్రీనివాస్ యాదవ్ లు నూతన వస్త్రాలను అందజేసి తన ఆధ్యాత్మిక సేవాభావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా గత ఐదు రోజులుగా అహర్నిశలు శ్రమిస్తూ అమ్మవారికి అలంకరణలు చేసి, పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్న పురోహితులను ఆదుకోవడం ధర్మబద్ధమైన కార్యక్రమమని పేర్కొన్నారు. దైవ సేవలో నిమగ్నమై భక్తులకు ఆధ్యాత్మిక సేవలు అందిస్తున్న అర్చకులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఆలయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి సైతం నూతన దుస్తులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆలయ అర్చకులు, సిబ్బంది అందిస్తున్న సేవలను గుర్తించి వారికి వస్త్రాలను అందజేయడం సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. పండుగలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల సందర్భంగా ఆలయాల్లో సేవలందించే వారిని ప్రోత్సహించడం ద్వారా సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడుకోవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గంధం నాగేశ్వరరావు చేతుల మీదుగా అర్చకులకు, ఆలయ సిబ్బందికి నూతన వస్త్రాలను అందజేశారు. ఆలయ పరిసరాల్లో భక్తిభావ వాతావరణం నెలకొనగా, ఈ సేవా కార్యక్రమం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

# పలు అమ్మవారి మండపాలను సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్







**బీరప్పగడ్డ, అక్టోబర్ 18 ( మన మీ వార్త):**

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని బీరప్పగడ్డ డివిజన్ పరిధిలోని పలు అమ్మవారి మండపాలను జీహెచ్ఎంసీ మాజీ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఉప్పల్ మహంకాళి ఆలయం, బ్యాంక్ కాలనీలోని దుర్గామాత ఆలయం, రాఘవేంద్ర నగర్ కాలనీలో ప్రవీణ్ ఏర్పాటు చేసిన అమ్మవారి మండపం, బీరప్పగడ్డలో బాలు ముదిరాజ్ ఏర్పాటు చేసిన మండపం, ఇంద్రానగర్ కాలనీలో ముత్యం శ్రీనివాస్ యాదవ్ ఏర్పాటు చేసిన మండపం, అన్నపూర్ణ కాలనీలో అజయ్ గుప్తా ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాలను ఆమె సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ మాట్లాడుతూ.. నవరాత్రి ఉత్సవాల్లో మండపాల నిర్వాహకులు ఎంతో భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. యువత సైతం ఆధ్యాత్మికత వైపు ఆకర్షితులవుతుండటం సంతోషకరమన్నారు. ఈ ఏడాది చిన్నారుల నుంచి పెద్దల వరకు అనేకమంది నవరాత్రి దీక్షలు చేపట్టి అమ్మవారి పట్ల తమ భక్తిని చాటుకుంటున్నారని పేర్కొన్నారు. అనంతరం పలు అమ్మవారి మండపాల వద్ద నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాల్లో ముఖ్య అతిథులుగా పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కొండల్ రెడ్డి, కొక్కొండ జగన్, ముద్దం శ్రీనివాస్ యాదవ్, బాలకృష్ణ గౌడ్, శ్యామ్, బంటి గౌడ్, బాలు, ఆయా మండపాల నిర్వాహకులు, స్థానిక నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్ డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ జన్మదినం సందర్భంగా పేద ముస్లిం కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ





**బోడుప్పల్ సర్కిల్ అక్టోబర్18( మనమీ వార్త):-**

మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకుని, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్, చెంగిచర్ల డివిజన్ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ అధ్యక్షులు మొహమ్మద్ యాకూబ్ ఆధ్వర్యంలో తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ చేతుల మీదుగా పేద ముస్లిం కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

**ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ..**

"నా జన్మదినాన్ని పురస్కరించుకుని పేద ముస్లిం కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసి, సేవా కార్యక్రమం నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉంది. ఈ కార్యక్రమానికి ముందుకు వచ్చి పేద కుటుంబాలకు అండగా నిలిచిన మొహమ్మద్ యాకూబ్ మరియు పాల్గొన్న నాయకులందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు.

జన్మదిన వేడుకలు కేవలం సంబరాలకే పరిమితం కాకుండా, పేదలకు సహాయం చేయడం, అవసరంలో ఉన్నవారికి అండగా నిలవడం వంటి సేవా కార్యక్రమాల ద్వారా నిర్వహించడం అభినందనీయం. సమాజంలోని ప్రతి ఒక్కరూ తమకు చేతనైన సహాయం అందిస్తూ మానవత్వాన్ని చాటుకోవాలని భవిష్యత్తులోనూ ప్రజాసేవా కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షిస్తున్నాను" అని తెలిపారు.

ఈ సందర్భంగా మొహమ్మద్ యాకూబ్ మాట్లాడుతూ తోటకూర వజ్రేష్ యాదవ్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, మరిన్ని ఉన్నత స్థానాలను అధిరోహిస్తూ ప్రజలకు మరింత సేవ చేయాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో బోడుప్పల్ మాజీ అధ్యక్షులు పోగుల నరసింహా రెడ్డి, చెంగిచర్ల డివిజన్ అధ్యక్షులు పోగుల దిలీప్ రెడ్డి, బోడుప్పల్ డివిజన్ అధ్యక్షులు బొమ్మక్ కళ్యాణ్, చెంగిచర్ల డివిజన్ ప్రధాన కార్యదర్శులు కుర్రి మహేష్, ఆసర్ల బీరప్ప, మేకల శ్రీనివాస్ గౌడ్, సింగిరెడ్డి రాజు రెడ్డి, కార్యదర్శి గడ్డం యాదగిరి, మేడ్చల్ నియోజకవర్గ మైనారిటీ ప్రధాన కార్యదర్శి ముస్తాక్, చెంగిచర్ల డివిజన్ మైనారిటీ వైస్ ప్రెసిడెంట్ ఇంతియాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

## అరుంధతి నగర్ సాయిబాబా దేవాలయంలో వైభవంగా అన్నదానం - ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ ఈటల రాజేందర్

**జవహర్ నగర్, అక్టోబర్ 18:(వార్త ప్రతినిధి)**

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 2వ డివిజన్ చంద్రపురి కాలనీ, అరుంధతి నగర్ (CRPF) లోని శ్రీ సాయిబాబా దేవాలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అన్నదాన కార్యక్రమం వైభవంగా జరిగింది.



ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ కమిటీ, బీజేపీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. సాయిబాబా, దుర్గామాత అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించారు.

అనంతరం ఈటల రాజేందర్ మాట్లాడుతూ దుర్గామాత ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. నవరాత్రుల్లో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం గొప్ప విషయమని, ఇవి సమాజంలో ఐక్యతను పెంచుతాయన్నారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏనుగు సుదర్శన్ రెడ్డి, 2వ డివిజన్ అధ్యక్షుడు కర్లపూడి జోగారావు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మహేందర్ యాదవ్, నాయకులు సన్నీ, రఘురాం చారి, మల్లికార్జున గౌడ్, మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## చిలుకానగర్‌లో అంబరాన్నంటిన సద్దుల బతుకమ్మ సంబరాలు

**చిలుకానగర్, అక్టోబర్ 18 ( మన మీ వార్త):**



చిలుకానగర్‌లో సద్దుల బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా, అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. మహిళలు, చిన్నారులు, యువతులు, వృద్ధులు అనే తేడా లేకుండా పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకున్నారు. సంప్రదాయ దుస్తులు ధరించి, రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో వేడుకలకు హాజరైన మహిళలు పండుగకు ప్రత్యేక శోభను తీసుకొచ్చారు.

వివిధ రకాల పూలతో సంప్రదాయబద్ధంగా పేర్చిన బతుకమ్మలను ఒకచోట అందంగా అమర్చి, వాటి చుట్టూ చేరిన మహిళలు బతుకమ్మ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ, నృత్యాలు చేస్తూ సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పాటలు, మహిళల కోలాటాలు, ఆటపాటలతో వేడుకల ప్రాంగణం సందడిగా మారింది. పూల సోయగాలు, మహిళల ఉత్సాహం, సంప్రదాయ పాటలతో చిలుకానగర్ ప్రాంతమంతా పండుగ వాతావరణం నెలకొంది.

చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ ఉత్సాహంగా పాల్గొనడంతో సద్దుల బతుకమ్మ వేడుకలు మరింత ప్రత్యేకంగా నిలిచాయి. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు, ప్రకృతిని ఆరాధించే సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో నిర్వహించారు.

ఈ వేడుకల్లో చిలుకానగర్ డివిజన్‌కు చెందిన గుడి సహస్ర, సుష్మ, స్ఫూర్తి, అనూష, అద్వైతతో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని సద్దుల బతుకమ్మ సంబరాలను విజయవంతం చేశారు.

## బాబాయ్ హోటల్ పార్కింగ్ నుండి డివైడర్ ను ఢీ కొట్టిన కారు

**బోడుప్పల్ సర్కిల్ అక్టోబర్ 18(మన మీ వార్త) :**



మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ ప్రధాన రహదారి లో బాబాయ్ హోటల్ పార్కింగ్ నుండి ఎదురుగా ఉన్న డివైడర్ ను ఢీ కొట్టి డివైడర్ పై కూర్చున్న "మారుతి సుజుకి ఇ విటారా" కారు ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది.

ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోయినా కారు భారీగా దెబ్బతింది. పార్కింగ్ నుంచి అతివేగంగా వచ్చిన కారు ఇతర వాహనాలను ఢీ కొట్టి ఉంటే ప్రాణ నష్టం జరిగేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇంత నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం ప్రమాదాలకు దారితీస్తుందని ఈ హోటల్ దగ్గర యూటర్న్ ఉండడం వలన భారీగా ట్రాఫిక్ జామ్ అవుతుందని ప్రజలు అనుకుంటున్నారు.

ఉదయం,సాయంత్రం స్కూల్ టైంలో బాబాయ్ హోటల్ ఎదురు రోడ్డు ప్రధాన రహదారి దగ్గర వాహనాలు యూటర్న్ తీసుకోవడం వల్ల బాబాయ్ హోటల్ కు వచ్చిన మోటార్ సైకిల్, కారు వాహనాల పార్కింగ్ చిన్నగా ఉండడం వల్ల రోడ్లు ట్రాఫిక్ జామ్ తో ప్రజలు మరియు వాహనాలు వెళ్లేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

**కారు ఘోర రోడ్డు ప్రమాదం**

సమాచారం తెలుసుకున్న మేడిపల్లి పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. కారు యజమానిని పోలీసులు విచారిస్తున్నారు.

క్రేన్ సహాయంతో కారును తొలగించిన మేడిపల్లి పోలీసులు ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు అని తెలిసింది.

## హనుమకొండ నేటి( సోమవారం) ప్రజావాణి కార్యక్రమం రద్దు

**మన మీ వార్త అక్టోబర్ 18 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :**



హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో సోమవారం (19/10/2026) నాటి ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రజావాణి కార్యక్రమాన్ని పరిపాలనపరమైన కారణాల వల్ల రద్దు చేసినట్లు పేర్కొన్నారు. వచ్చే సోమవారం యధావిధిగా ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రకటనలో తెలిపారు.

## సోమవారం జీడబ్ల్యూఎంసీ ప్రజావాణి కార్యక్రమం రద్దు

**మన మీ వార్త అక్టోబర్ 18 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :**



**జీడబ్ల్యూఎంసీ, అక్టోబర్ 18:** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో సోమవారం (ఈ నెల 19న ) నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని పరిపాలనాపరమైన కారణాల వల్ల రద్దు చేసినట్లు జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కమిషనర్ కోరారు. తదుపరివచ్చే సోమవారం ప్రజావాణి కార్యక్రమం యథావిధిగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

## జనగామ సోమవారం జిల్లా స్థాయి ప్రజావాణి కార్యక్రమం రద్దు

**- ప్రజలు తమ వినతులతో కలెక్టరేట్‌కు రావద్దు**

**- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**మన మీ వార్త అక్టోబర్ 18 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :**




దసరా పండుగ నేపథ్యంలో ప్రభుత్వ సెలవు దృష్ట్యా జిల్లా స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ సోమవారం (అక్టోబర్ 19)న రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రజలు ఈ విషయాన్ని గమనించి తమ వినతులు, ఫిర్యాదులతో సోమవారం కలెక్టరేట్‌కు రావద్దని కలెక్టర్ కోరారు.

## శ్రీ భద్రకాళి దేవస్థానంలో దేవీశరన్నవరాత్రులు ఎనిమిదవ రోజుకు చేరుకున్నాయి.





**మన మీ వార్త అక్టోబర్ 18 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :**

ఉదయం గం॥ 04-00లకు నిత్యాహ్నికం నిర్వర్తించిన పిమ్మట అర్చకులు అమ్మవారిని దుర్గగా అలంకరించి పూజానాధలు నిర్వహించారు. ఉదయం భద్రపీఠ సేవ, సాయంకాలం అశ్వవాహన సేవ లు నిర్వహించారు. ఈ రోజు భద్రకాళి అమ్మవారి జన్మోత్సవం. కృష్ణాష్టమి వలనే ఈ రోజు రాత్రి కూడా అమ్మవారికి విశేష అభిషేక అర్చనాదులు, జపహోమార్చనలు జరుపుతారు. దేవీ భాగవతంలో తృతీయ స్కంధంలో 27 అధ్యాయం 9వ శ్లోకం అనుసరిస్రంచి పురాష్ట్రమ్యామ్ భద్రకాళి దక్షయజ్ఞ వినాశినీ ప్రాదుర్భూతా మహాఘోరా యోగినీ కోటి బిస్సహ దీని అర్థం దుర్గాష్టమి అనబడే మహాష్టమీ రోజున దుర్గ కోటి యోగినీ గణములతో ప్రాదుర్భావం చెందిన రోజు ఈ మహాష్టమి. యావద్భారత దేశంలోనే కాదు ప్రపంచంలో ఏ దేశంలో ఎక్కడైనా దేవీ నవరాత్ర వ్రతం చేసే నకల జనులకు శాస్త్ర వచనం మేరకు ఈ రోజు అందరూ అమ్మవారిని భద్రకాళి గానే పూజిస్తారు. భద్రకాళీ విశ్వమంతా వ్యాపించి వున్నా భూమండలం మీద కాకతీయుల రాజధాని ఏకశిలానగరంగా ప్రసిద్ధిగాంచిన తెలంగాణాలోనే వరంగల్ మహానగరంలో దుర్గాష్టమినాడు కోటి యోగినీ గణములతో అవ తరించడం వల్ల ఈ వరంగల్ మహానగరం ఒక పవిత్రతను సంతరింపజేసుకున్నది. అందుకే ఈ రోజు స్త్రీలందరూ అమ్మవారికి చద్దులు చేసి నివేదించడంలోని నేపథ్యం. ఇదే చద్దుల బతుకమ్మ పండుగ అయింది. ఈ బతుకమ్మ పండగ కేవలం తెలంగాణాలో మాతమే ఎందుకు ఉందంటే తెలంగాణాలో స్వయం వ్యక్తమైన దేవాలయం భద్రకాళి దేవాలయం కావున ఆ విశ్వవ్యాప్తమైన జగన్మాత దుర్గాష్టమినాడు ఈ భూమండలం మీద కోటి యోగినీ గణములతో భద్రకాళిగా అవతరించిన ప్రదేశం తెలంగాణాలోని నాటి ఏకశిలా నగరం నేటి వరంగల్ మహానగరం అయినందున భద్రమ్మ, బతుకమ్మ, భద్రేశ్వరి, భద్రకాళి పేర్లతో విశేషంగా తెలంగాణా మొత్తం ఆరాధింపబడుతుంది. కాకతీయుల కాలం నుండి కూడా ఈ బతుకమ్మ స్త్రీలు చేసే దుర్గారాధన మనకు చరిత్ర చెబుతుంది. కాబట్టి దుర్గాష్టమినాడు లక్షలాది స్త్రీలు ఆబాల గోపాలం బతుకమ్మకు చద్దులు చేస్తారు. బతుకమ్మ భద్రమ్మ వేరే కాదు ఒక్కటే. ఈ రోజు వేలాది మంది స్త్రీలు దేవాలయ ప్రాంగణంలో బతుకమ్మ ఆడారు. ఈ రోజు కార్యక్రమాలకు ఉభయదాతలుగా భారతీ డిగ్రీ కాలేజ్ అధినేతలు శ్రీ ఇరుకుళ్ళ సంజయ్ కుమార్ జయశ్రీ దంపతులు మరియు డా॥ పోతాని రాజేశ్వరప్రసాద్- డా॥ లలితాదేవి దంపతులు వ్యవహరించారు.

ఈ రోజు అమ్మవారిని ఎం.ఎల్సీ శ్రీబస్వరాజు సాయర్య ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. సారయ్య వెంట ప్రముఖ వ్యాపారవేత్త దేవాలయ ఉభయదాత శ్రీ అప్పావారి లక్ష్మీనారాయణ తదితరులున్నారు. అనంతరం రాజ్యసభ సభ్యులు శ్రీ వద్దిరాజు రవిచంద్ర ఆలయాన్ని సందర్శించారు. ఆయన వెంట మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ శ్రీ దాన్యం వినయభాస్కర్, మాజీ ఎం.ఎల్.ఏ శ్రీ నన్నపునేని నరేందర్ తదితరులున్నారు. ఆలయానికి విచ్చేసిన ప్రముఖులకు ఆలయ ధర్మకర్తలు శ్రీ కమటం వేణుగోపాల్, శ్రీ రమేష్ చంద్ భంగ్, ఈవో శ్రీమతిరామల సునీత, అర్చకులు ఘనస్వాగతం పలికారు. పూజానంతరం మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందజేశారు.

సాయంకాలం దేవాలయ ప్రాంగణంలో వేలాదిగా మహిళలు బతుకమ్మ ఆడారు.రామల సునీత కార్యనిర్వహణాధికారి.

## తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ పండుగ.

**-బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్.**






**మన మీ వార్త అక్టోబర్ 18 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :**

పోతన నగర్ సంస్కార భారతీ ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొని ఆడపడుచులకు సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.
తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు మరియు ప్రకృతి ఆరాధనకు నిలువెత్తు ప్రతీక బతుకమ్మ పండుగ అని బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ అన్నారు. ఆదివారం సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని పోతన నగర్ సంస్కార భారతి ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ ఆట స్థలానికి ఆయన హాజరయ్యారు.
ఈ సందర్భంగా ఆట స్థలంలో రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మల మధ్య సంప్రదాయబద్ధంగా ఆటపాటలతో సందడి చేస్తున్న ఆడపడుచులను ఆయన కలుసుకుని, వారికి సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శ్రీ దుర్గదేవి అమ్మవారి ఆశీస్సులతో, బతుకమ్మ తల్లి కరుణతో జిల్లాలోని ప్రతి ఇల్లూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో విరసిల్లాలని ఆకాంక్షించారు.

ఒసనాతన ధర్మంలో మహిళలకు ఇచ్చే గౌరవానికి, నారీశక్తికి ఈ పండుగ ఒక నిదర్శనమని ఆయన కొనియాడారు. తెలంగాణ ఆడబిడ్డల జీవితాల్లో బతుకమ్మ పండుగ సరికొత్త వెలుగులు నింపాలని కోరుకుంటూ, ఈ వేడుకలను ఇంత ఘనంగా నిర్వహిస్తున్న నిర్వాహకులకు గంట రవికుమార్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# జవహర్‌నగర్ పోలీసుల తక్షణ స్పందన
# 90 నిమిషాల్లోనే తప్పిపోయిన ఇద్దరు చిన్నారుల ఆచూకీ

**జవహర్‌నగర్, అక్టోబర్ 18: (వార్త ప్రతినిధి):**

జవహర్‌నగర్ పోలీసులు మరోసారి తమ మానవతా దృక్పథాన్ని, తక్షణ స్పందనను చాటుకున్నారు. తప్పిపోయిన ఇద్దరు మైనర్ బాలురను కేవలం 90 నిమిషాల్లోనే సురక్షితంగా గుర్తించి తల్లికి అప్పగించి ప్రశంసలు అందుకున్నారు.

**ఘటన వివరాలు:**

తేదీ 18.10.2026న మధ్యాహ్నం సుమారు 13:10 గంటలకు కాప్రా మండలం, గబ్బిలాల్‌పేట్, కెసిఆర్ నగర్, ప్లాట్ నం. 299 నివాసి, కూలీ పని చేసుకుని జీవనం సాగిస్తున్న శ్రీమతి పులికంటి అనురాధ (30 సం., భర్త దివంగత యాదయ్య) తన ఇద్దరు కుమారులు ఈశ్వర్ (15 సం.), మహేందర్ (7 సం.) ఇంటి నుంచి బయటకు వెళ్లి కనిపించడం లేదని ఆందోళనతో డయల్ 100 ద్వారా జవహర్‌నగర్ పోలీసులకు సమాచారం అందించారు.

**పోలీసుల గాలింపు:**

సమాచారం అందుకున్న వెంటనే జవహర్‌నగర్



పోలీస్ సిబ్బంది అప్రమత్తమయ్యారు. వెంటనే డయల్ 100 కాల్‌ను ట్రేస్ చేసి, బాధితురాలి ఇంటికి చేరుకుని వివరాలు సేకరించారు. చిన్నారుల ఫోటోలు, ఆనవాళ్లు తెలుసుకుని ప్రత్యేక బృందాలుగా ఏర్పడి కెసిఆర్ నగర్, గబ్బిలాల్‌పేట్, చుట్టుపక్కల ప్రాంతాల్లో ముమ్మరంగా గాలింపు చేపట్టారు. స్థానికులను, చిన్నారుల స్నేహితులను విచారిస్తూ, సీసీ కెమెరాల ఆధారంగా గాలింపును వేగవంతం చేశారు.

పోలీసుల నిరంతర శ్రమ ఫలితంగా కేవలం 90 నిమిషాల్లోనే ఇద్దరు బాలురను సురక్షితంగా గుర్తించారు.

**తల్లికి అప్పగింత:**

ఇద్దరు చిన్నారులను సురక్షితంగా పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి, కౌన్సెలింగ్ ఇచ్చి అనంతరం వారి తల్లి పులికంటి అనురాధకు అప్పగించారు. తప్పిపోయిన తన పిల్లలు క్షేమంగా తిరిగి రావడంతో తల్లి కన్నీళ్లతో ఆనందం వ్యక్తం చేస్తూ, జవహర్‌నగర్ పోలీసులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

పిల్లలు తప్పిపోయిన వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వడం, పోలీసులు సత్వరమే స్పందించడం వల్లే ఈ సురక్షిత పునరేకీకరణ సాధ్యమైందని పోలీసులు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో వెంటనే 100కు డయల్ చేయాలని జవహర్‌నగర్ పోలీసులు సూచించారు.

ఈ ఘటనలో చాకచక్యంగా వ్యవహరించి చిన్నారులను త్వరగా గుర్తించిన జవహర్‌నగర్ పోలీస్ సిబ్బందిని ఉన్నతాధికారులు, స్థానిక ప్రజలు అభినందిస్తున్నారు.

# రైతు కష్టానికి గౌరవం...పొలానికి
# వెళ్లి పూల కొనుగోలు చేసిన మాజీ మంత్రి !

- మాటల్లో కాదు,చేతల్లో రైతుపై అభిమానం! బంతిపూల తోటకు మాజీ మంత్రి
- దసరా వేళ రైతుకు అండగా నిలిచిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి
- బంతిపూల తోటను సందర్శించి రైతు శాంతయ్యను సన్మానించిన మాజీ మంత్రి

**వనపర్తి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 18 మీ వార్త :**

**వనపర్తి టౌన్ న్యూస్ :** రైతు కష్టాన్ని గుర్తించడం.. వారి శ్రమకు తగిన గౌరవాన్ని అందించడం.. అన్నదాతకు అండగా నిలవడం.. ఇవే నిజమైన రైతు సంక్షేమానికి నిదర్శనాలు. దసరా పండుగ వేళ మాజీ మంత్రి, వనపర్తి మాజీ ఎమ్మెల్యే శ్రీ సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి గారు రైతు పొలానికి స్వయంగా వెళ్లి బంతిపూలను కొనుగోలు చేయడం ప్రత్యేకంగా నిలిచింది.వనపర్తి పట్టణంలోని 9వ వార్డు మారికుంటకు చెందిన రైతు, రైతు సమాఖ్య మాజీ అధ్యక్షుడు చీర్ల శాంతయ్య గారు సాగు చేస్తున్న బంతిపూల తోటను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సందర్శించారు. ఈ



సందర్భంగా తోటను పరిశీలించి, శాంతయ్య గారిని సన్మానించి అభినందించారు.దసరా పండుగకు అవసరమైన బంతిపూలను స్వయంగా కొనుగోలు చేసి, వాటికి సంబంధించిన నగదును రైతు శాంతయ్య గారికి అందజేశారు. పండుగ సమయంలో రైతు పొలానికి వెళ్లి పూలను కొనుగోలు చేయడం ద్వారా రైతు శ్రమకు గౌరవం ఇవ్వడమే కాకుండా, స్థానిక రైతుల పట్ల తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు.

**రైతు శ్రమకు గుర్తింపు.. అన్నదాతకు ఆత్మీయ భరోసా!**

పండుగల సమయంలో రైతులు పండించిన పూలకు గిరాకీ పెరుగుతుంది. ఇలాంటి సందర్భాల్లో రైతుల వద్దకు నేరుగా వెళ్లి పూలను కొనుగోలు చేయడం వారికి



ప్రోత్సాహాన్నిస్తుంది. ఈ నేపథ్యంలో నిరంజన్ రెడ్డి గారి పర్యటన, రైతు శాంతయ్య గారి కుటుంబానికి ఆత్మీయతను పంచడంతో పాటు రైతు కష్టానికి గౌరవం తెలిపిన సందర్భంగా నిలిచింది.రైతు కష్టాన్ని గుర్తించి, వారి శ్రమను గౌరవిస్తూ పండుగ వేళ రైతుకు అండగా నిలవడం అభినందనీయమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి తో పాటు చీర్ల శ్రీనివాసులు, కుమార్ భేదడి, వాకిటి శ్రీధర్, ప్రేమ్ నాథ్ రెడ్డి, నందిమల్ల అశోక్, సునీల్ వాల్మీకి తదితరులు పాల్గొన్నారు...

# ఆయుధ పూజలో పాల్గొన్న జిల్లా ఎస్పీ డి. సునీత రెడ్డి, ఐపీఎస్



- ప్రజల రక్షణే పోలీసుల ప్రథమ కర్తవ్యం
- విధి నిర్వహణలో అప్రమత్తత, క్రమశిక్షణ తప్పనిసరి
- పోలీసు ఆయుధాలు, వాహనాలకు సంప్రదాయబద్ధంగా పూజలు
- వనపర్తి జిల్లా ఎస్పీ డి. సునీత రెడ్డి, ఐపీఎస్

**వనపర్తి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 18 మీ వార్త :**

**వనపర్తి టౌన్ న్యూస్ :** విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని వనపర్తి జిల్లా డిఎఆర్ హెడ్‌క్వార్టర్స్‌లోని జిల్లా సాయుధ దళ కార్యాలయంలో ఆదివారం ఉదయం 9:30 గంటలకు ఆయుధ పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డి. సునీత రెడ్డి, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. ఆయుధ పూజకు విశిష్టమైన ప్రాధాన్యత,ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ,







హిందూ సంప్రదాయంలో ఆయుధ పూజకు విశిష్టమైన ప్రాముఖ్యత ఉందని తెలిపారు. దైవాన్ని స్మరించుకోవడంతో పాటు విధి నిర్వహణలో నిత్యం ఉపయోగించే ఆయుధాలు, పరికరాల పట్ల కృతజ్ఞతాభావాన్ని చాటుకోవడం ఆయుధ పూజ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఆయుధాలు రాజ్య రక్షణకు, ప్రజల శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతీకలని వివరించారు.

**పోలీసు వాహనాలకు, పెట్రోల్ పంపు వద్ద ప్రత్యేక పూజలు..**

ఆయుధ పూజ కార్యక్రమంలో భాగంగా పోలీసు ఆయుధాలతో పాటు పోలీసు వాహనాలకు పూజలు నిర్వహించారు. అనంతరం రాజపేట శివారులో ఉన్న పోలీసు పెట్రోల్ పంపు వద్ద కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలకు మెరుగైన సేవలందించాలి, అనంతరం ఎస్పీ డి. సునీత రెడ్డి మాట్లాడుతూ, దుర్గామాత ఆశీస్సులు ప్రజలకు, పోలీసు అధికారులు, సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులందరికీ ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు, పోలీసు అధికారులు, సిబ్బందికి ముందస్తుగా విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది విధి నిర్వహణలో వృత్తి పట్ల నిబద్ధతతో వ్యవహరిస్తూ, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. క్రమశిక్షణకు ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, శాంతిభద్రతల పరిరక్షణలో అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ వీరారెడ్డి, డీఎస్పీ గిరిబాబు, సీఐలు ఓడీ రమేష్, సుగంధ రత్నం, నరేష్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు అప్పలనాయుడు, శ్రీనివాస్ కుమార్, ఎస్సైలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు...

## దుర్గామాత మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల

**(మన మీ వార్త న్యూస్) : అక్టోబర్ 18, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-**

నిజామాబాద్ నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాలను మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయక్ నగర్‌లో ఆదివారం భారీ విద్యుత్ దీపాల అలంకరణతో అద్భుతంగా ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాన్ని ఆయన సందర్శించారు. మండపాన్ని అందంగా, ఆకట్టుకునే విధంగా విద్యుత్ దీపాలతో అలంకరించడం పట్ల నిర్వాహకులను అభినందించారు. నగరంలో ఇంత అద్భుతంగా దుర్గామాత మండపాన్ని ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం హనుమాన్ నగర్‌లో బీఆర్ఎస్ పార్టీ 23వ డివిజన్ అధ్యక్షులు జక్క మహేష్ ఆహ్వానం మేరకు అక్కడ ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాన్ని సందర్శించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పండుగ వాతావరణంలో భక్తిశ్రద్ధలతో అమ్మవారి ఉత్సవాలను నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు.



printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS.
published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512

## హబ్సిగూడ రెడ్డి సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు





**హబ్సిగూడ, అక్టోబర్ 18 ( మన మీ వార్త):**

హబ్సిగూడ రెడ్డి సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో రోడ్ నంబర్ 4లోని ప్రభుత్వ హోమియో వైద్యశాల ఎదురుగా సద్దుల బతుకమ్మ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పూల పండుగ బతుకమ్మ వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో సంబరాలు జరుపుకున్నారు.వివిధ రకాల రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను ఏర్పాటు చేసి, సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. మహిళలు బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు వయోభేదం లేకుండా అందరూ కలిసిమెలిసి పాల్గొని పండుగకు ప్రత్యేక శోభను తీసుకొచ్చారు.

ఈ వేడుకల ద్వారా మహిళల్లో ఐకమత్యం, సోదరభావం మరింత బలపడటంతో పాటు తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాల పట్ల యువతరానికి అవగాహన కలుగుతుందని పేర్కొన్నారు. సద్దుల బతుకమ్మ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ రెడ్డి సంఘం మహిళా విభాగం నిర్వాహకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## మహబూబాబాద్ జిల్లా
## నేటి( సోమవారం) ప్రజావాణి కార్యక్రమం రద్దు

**మన మీ వార్త అక్టోబర్ 18 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :**



మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ లో సోమవారం (19/10/2026) నాటి ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రజావాణి కార్యక్రమాన్ని దసరా పండుగ సందర్భంగా వరుస సెలవుల నేపథ్యంలో పరిపాలనపరమైన కారణాల వల్ల రద్దు చేసినట్లు పేర్కొన్నారు. వచ్చే సోమవారం యధావిధిగా ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రకటనలో తెలిపారు.

కావున ప్రజలు ప్రజావాణి దరఖాస్తు లతో కార్యాలయంకు రావద్దని కలెక్టర్ కోరారు.

## రైల్వే బ్రిడ్జి ట్రాఫిక్ డైవర్షన్‌ను దీపావళి వరకు వాయిదా వేయాలి




**(మన మీ వార్త న్యూస్) : అక్టోబర్ 18, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-**

నిజామాబాద్ నగరంలోని విజయ టాకీస్ పక్కన ఉన్న రైల్వే బ్రిడ్జి విస్తరణ పనుల్లో భాగంగా ఆదివారం నుంచి అమలు చేస్తున్న ట్రాఫిక్ డైవర్షన్‌ను దీపావళి పండుగ వరకు వాయిదా వేయాలని నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల పోలీసు అధికారులను డిమాండ్ చేశారు. దసరా పండుగకు కేవలం మూడు రోజుల ముందు ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. దసరా పండుగ సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి, నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో నిజామాబాద్‌కు వచ్చి పండుగ కొనుగోళ్లు చేస్తుంటారని తెలిపారు. ఇప్పటికే నగరంలో ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉన్న నేపథ్యంలో కొత్తగా ట్రాఫిక్ ఆంక్షలు విధించడం ప్రజలకు మరింత ఇబ్బందికరంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ డైవర్షన్ కారణంగా వ్యాపారులు, చిరు వ్యాపారులు, వాహనదారులు, పండుగ కొనుగోళ్ల కోసం వచ్చే కుటుంబాలు ఇబ్బందులు పడే పరిస్థితి ఉందన్నారు. పండుగల సమయంలో ప్రజలకు సౌకర్యాలు కల్పించాల్సిన అధికారులు, వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. అభివృద్ధి పనులకు మేము వ్యతిరేకం కాదని, కానీ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులు చేపట్టాలి అని గణేష్ బిగాల స్పష్టం చేశారు. పోలీసు అధికారులు, రైల్వే శాఖ అధికారులు సమన్వయంతో చర్చించి, దసరా మరియు దీపావళి పండుగలు పూర్తయ్యే వరకు ట్రాఫిక్ డైవర్షన్‌ను వాయిదా వేయడంతో పాటు, బ్రిడ్జి విస్తరణ పనుల విషయంలో తగిన ప్రణాళిక రూపొందించాలని కోరారు. ప్రజల సౌకర్యమే ప్రథమ ప్రాధాన్యతగా ఉండాలని, పండుగల సమయంలో ప్రజలను ట్రాఫిక్ సమస్యలతో ఇబ్బందులకు గురిచేయకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని గణేష్ బిగాల డిమాండ్ చేశారు.

# కందిరీగ తండాలో బీజేపీకి భారీ షాక్
# కాంగ్రెస్‌లోకి సర్పంచ్ సహా 150 మంది!

- గ్రామస్థాయి నేతల చేరికతో కాంగ్రెస్‌కు కొత్త బలం...కందిరీగ తండాలో రాజకీయ వేడి!
- కందిరీగ తండాలో కాంగ్రెస్ జోష్...ఎమ్మెల్యే సమక్షంలో భారీగా చేరికలు
- ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్న నాయకులు, కార్యకర్తలు

**వనపర్తి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 18 మీ వార్త :**

**వనపర్తి రూరల్ న్యూస్ :** కందిరీగ తండాలో భారతీయ జనతా పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. వనపర్తి మండలం కందిరీగ తండాకు చెందిన బీజేపీ సర్పంచ్ రాజు నాయక్, ఉపసర్పంచ్ సరోజ, హీరా సింగ్‌తో పాటు పలువురు వార్డు సభ్యులు, గ్రామానికి చెందిన సుమారు 150 మంది నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు,వనపర్తి పట్టణంలోని నంది హిల్స్‌లో ఉన్న



ఎమ్మెల్యే నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీరంతా కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

**పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ అండగా ఉంటాం ఎమ్మెల్యే...**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువతకు సముచిత గౌరవం కల్పిస్తామని తెలిపారు. వారి సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

గ్రామాల అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేయాలి,ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సమన్వయంతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, మాజీ ఎంపీటీసీ నాగరాజు, మాజీ సర్పంచులు రాములు, మురళి, గ్రామ యువకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు...

# పటేల్ కుంట చెరువులోకి మురుగునీరు రాకుండా శాశ్వత చర్యలు

- నిలిచిపోయిన సివరేజ్ డైవర్షన్ పనులను వెంటనే పూర్తి చేయాలి: ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**నాచారం, అక్టోబర్ 18 ( మన మీ వార్త):**

నాచారం డివిజన్ పరిధిలోని పటేల్ కుంట చెరువులోకి మురుగునీరు ప్రవేశించకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. చెరువులోకి మురుగునీరు, వ్యర్థ రసాయనాలతో కూడిన జలాలు చేరకుండా పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు.

సుమారు నాలుగు సంవత్సరాల క్రితం అప్పటి నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ ప్రత్యేక చొరవతో రూ.1.80 కోట్ల వ్యయంతో చెరువులోకి చేరుతున్న మురుగునీటిని మళ్లించేందుకు సివరేజ్ డైవర్షన్ లైన్ నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే సుమారు 95 శాతం పనులు పూర్తయినప్పటికీ, చెరువులోకి వచ్చే మురుగునీటిని డైవర్షన్ లైన్‌లోకి మళ్లించే కీలకమైన పనులు పూర్తికాకపోవడంతో ప్రాజెక్టు అసంపూర్తిగా నిలిచిపోయింది. ఈ సమస్య పరిష్కారం కోసం అప్పటి కార్పొరేటర్ పలుమార్లు అధికారుల



దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అప్పటి జీహెచ్ఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. పనుల్లో జరిగిన జాప్యం, ప్రజాధనం దుర్వినియోగంపై విచారణ జరిపించాలని జీహెచ్ఎంసీ విజిలెన్స్ అధికారి నర్సింహారెడ్డికి ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన అధికారులు నిలిచిపోయిన పనులను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు.

ఇందులో భాగంగా వారం రోజుల క్రితం చెరువులోకి ప్రవేశిస్తున్న మురుగునీటిని తాత్కాలికంగా కొత్తగా నిర్మించిన సివరేజ్ డైవర్షన్ లైన్‌లోకి మళ్లించారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పటేల్ కుంట చెరువును సందర్శించి, డైవర్షన్ పనుల పురోగతిని పరిశీలించారు. మురుగునీటి మళ్లింపు వ్యవస్థ పూర్తిస్థాయిలో పనిచేసేలా మిగిలిన నిర్మాణ పనులను తక్షణమే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పటేల్ కుంట చెరువులోకి మురుగునీరు, వ్యర్థ రసాయనాలతో కూడిన జలాలు చేరకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చెరువు సమీపంలో నిర్మించిన రోజుకు 2.5 మిలియన్ లీటర్ల (2.5 ఎంఎల్‌డీ) సామర్థ్యం కలిగిన మురుగునీటి శుద్ధి కేంద్రం ద్వారా శుద్ధి చేసిన నీటిని మాత్రమే చెరువులోకి పంపించేలా చర్యలు చేపడుతున్నామని వివరించారు.హెచ్ఎంటీ నగర్ పెద్ద చెరువు సుందరీకరణ పనులు పూర్తయిన వెంటనే పటేల్ కుంట చెరువును కూడా సుందరీకరించి, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందుబాటులోకి తీసుకువస్తామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్, మేడల మల్లికార్జున్ గౌడ్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాలం తెచ్చిన కరువు కాదు...
# పంట చేతికొచ్చే వేళ కరెంటు కరువుతో రైతుల ఆవేదన

- పాన్‌గల్‌లో ఎండిన వరి పంటలను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే బీరం
- సాగునీరు, విద్యుత్, రైతుబంధు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
- మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి

**వనపర్తి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 18 మీ వార్త :**

**పాన్‌గల్ మండలం న్యూస్ :** కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు.. కాంగ్రెస్ అంటేనే కరువు అంటూ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పంట చేతికొచ్చే కీలక సమయంలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేక వరి పంటలు ఎండిపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.కరెంటు లేక ఎండిన వరి పంట,రైతులకు తీరని నష్టం,పాన్‌గల్ మండల కేంద్రంలోని డీ8 కాల్వ, ఎంజే3 సమీపంలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేక ఎండిపోయిన వరి పంటలను మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి పరిశీలించారు. పంట చేతికొచ్చే కీలక సమయంలో సాగునీరు అందక, విద్యుత్ సరఫరాలో అంతరాయాల కారణంగా వరి పంటలు






ఎండిపోయాయని రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.రైతులు ఎంతో కష్టపడి సాగు చేసిన పంటలు చివరి దశలో ఎండిపోవడం వారి కుటుంబాలను ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు.

**సాగునీరు ఇవ్వరు,కరెంటు కూడా సరిగ్గా ఇవ్వరు...**

ఈ సందర్భంగా బీరం హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు సాగునీరు అందించడంలో విఫలమైందని విమర్శించారు. కనీసం వ్యవసాయానికి అవసరమైన విద్యుత్‌ను కూడా సక్రమంగా సరఫరా చేయలేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై, కేసీఆర్‌పై విమర్శలు చేయడానికే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, కానీ రైతులకు సాగునీరు, నాణ్యమైన విద్యుత్ సరఫరా, రైతుబంధు వంటి అంశాల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు.

**రైతుల కష్టాలను పట్టించుకోవాలి...**

రైతులు పంటల సాగు కోసం పెట్టుబడులు పెట్టి, ఎన్నో ఆశలతో పంటను కాపాడుకుంటున్న సమయంలో విద్యుత్ సమస్యలతో పంటలు ఎండిపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని ఆయన అన్నారు. ప్రభుత్వం రైతుల సమస్యలను గుర్తించి, వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ సరఫరాను మెరుగుపరచడంతో పాటు సాగునీటి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెబ్బేటి వీరసాగర్, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు...

## వ్యాపార రంగంలో రాణించాలంటే కృషి, ఓర్పు ఎంతో ముఖ్యం!

- కష్టపడి పనిచేస్తే విజయానికి మార్గం సుగమం
- జగత్‌పల్లిలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఇండస్ట్రీస్ రైస్ మిల్లును ప్రారంభించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 18 మీ వార్త :**





**వనపర్తి రూరల్ న్యూస్ :** వ్యాపార రంగంలో రాణించాలంటే నిరంతర కృషి, ఓర్పు, నిబద్ధత ఎంతో అవసరమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. కష్టపడి పనిచేస్తూ, చేసే పనిని దైవంగా భావించి ముందుకు సాగితే ఏ రంగంలోనైనా విజయం సాధించవచ్చని పేర్కొన్నారు.

**నూతన రైస్ మిల్లును ప్రారంభించిన ఎమ్మెల్యే...**

పెద్దమందడి మండలం జగత్‌పల్లి గ్రామానికి చెందిన లక్ష్మారెడ్డి నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఇండస్ట్రీస్ రైస్ మిల్లును ఆదివారం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మిల్లు నిర్వాహకుడు లక్ష్మారెడ్డికి శుభాకాంక్షలు తెలియజేసి, వ్యాపార రంగంలో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.కృషి, నిబద్ధతతోనే విజయాలు,ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, జీవితంలో ఆర్థికంగా స్థిరపడేందుకు వ్యాపార రంగం అనేక అవకాశాలను కల్పిస్తుందని తెలిపారు. ఏ వ్యాపారంలోనైనా విజయాన్ని సాధించాలంటే కష్టపడి పనిచేయడంతో పాటు ఓర్పు, పట్టుదల, నిబద్ధతతో ముందుకు సాగాలని సూచించారు.నూతనంగా రైస్ మిల్లును ఏర్పాటు చేసి వ్యాపార రంగంలోకి అడుగుపెట్టిన లక్ష్మారెడ్డిని అభినందించారు. భవిష్యత్తులో ఆయన వ్యాపారం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

**స్థానిక వ్యాపారాలతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలం...**

గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు, వ్యాపార సంస్థలు ఏర్పాటుకావడం వల్ల స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడంతో పాటు స్థానిక ప్రజలకు ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశాలు లభిస్తాయని తెలిపారు.యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడటమే కాకుండా, తమకు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ వ్యాపార రంగంలోనూ రాణించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కౌన్సిలర్లు, సర్పంచులు, మండల అధ్యక్షులు, యువకులు తదితరులు పాల్గొన్నారు...

# వనపర్తి జిల్లా అభివృద్ధికి రాజావారి అండ!





- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కృషిపై రాజా శ్రీకృష్ణదేవరావు ప్రశంసలు
- పట్టణ అభివృద్ధిపై ఇరువురి మధ్య కీలక చర్చ...సహకారం అందిస్తానన్న రాజావారు

**వనపర్తి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 18 మీ వార్త :**

వనపర్తి పట్టణాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి చేస్తున్న కృషికి రాజా శ్రీకృష్ణదేవరావు ప్రశంసలు తెలిపారు. పట్టణ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

**రాజా శ్రీకృష్ణదేవరావుతో ఎమ్మెల్యే మేఘారెడ్డి భేటీ..**

వనపర్తి సంస్థాన వారసుడు రాజా శ్రీకృష్ణదేవరావును ఆదివారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వనపర్తి పట్టణ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై ఇరువురూ చర్చించారు. పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేయడంతో పాటు వనపర్తిని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు సహకరించాలని ఎమ్మెల్యే రాజావారిని కోరారు. వనపర్తి అభివృద్ధికి సంపూర్ణ సహకారం,ఎమ్మెల్యే మేఘారెడ్డి విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన రాజా శ్రీకృష్ణదేవరావు వనపర్తి అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. పట్టణ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే చేస్తున్న కృషి అభినందనీయమని ప్రశంసించారు. వనపర్తి అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, ప్రజలు సమన్వయంతో ముందుకు సాగడం అవసరమని ఈ భేటీ ప్రాధాన్యతను చాటిచెప్పింది.

**అభివృద్ధే లక్ష్యంగా ముందడుగు...**

వనపర్తి పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసి, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే మేఘారెడ్డి వివిధ వర్గాల ప్రముఖులతో చర్చలు జరుపుతున్నారు. ఈ క్రమంలో రాజా శ్రీకృష్ణదేవరావుతో జరిగిన భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. పట్టణ అభివృద్ధికి రాజావారు సహకారం అందించేందుకు ముందుకు రావడం పట్ల స్థానికంగా ఆసక్తి నెలకొంది.

ఈ కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, ఎస్ఎల్ఎన్ రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కదిరె రాములు, మార్కెట్ యార్డు మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మాజీ జెడ్పీటీసీ గొల్ల వెంకటయ్య, కౌన్సిలర్లు, పెబ్బేరు మండల అధ్యక్షుడు వ్యాపార రామిరెడ్డి, శ్రీరంగాపురం మండల అధ్యక్షుడు విష్ణు, విజయవర్ధన్ రెడ్డి, రంజిత్ కుమార్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు...

# దాండియా వేడుకల్లో విషాదం...వనపర్తి బిడ్డ మృతి!

- హైదరాబాద్‌లో కుప్పకూలిన భారీ లైటింగ్ ట్రస్... బీటెక్ విద్యార్థిని సోనా దుర్మరణం
- కవల సోదరి మీనాకు తీవ్ర గాయాలు... ఆసుపత్రిలో చికిత్స
- అక్క మృతితో చెల్లెలి పరిస్థితిపై ఆందోళనతో కన్నీరు మున్నీరవుతున్న కుటుంబ సభ్యులు

**వనపర్తి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 18 మీ వార్త :**

హైదరాబాద్ లో సంతోషంగా సాగాల్సిన దాండియా వేడుకలు ఓ కుటుంబంలో తీరని విషాదాన్ని నింపాయి. స్నేహితులతో కలిసి పండుగ సంబరాల్లో పాల్గొన్న వనపర్తికి చెందిన బీటెక్ విద్యార్థిని ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయింది. ఆమె కవల సోదరి తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఒకే ప్రమాదంలో అక్కాచెల్లెళ్లలో ఒకరు మృతిచెందడం, మరొకరు ఆసుపత్రి పాలవడంతో వనపర్తి పట్టణంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

**దాండియా వేడుకల్లో కూలిన లైటింగ్ ట్రస్...విద్యార్థిని మృతి!**

రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం నాదర్‌గుల్‌లోని ఎంవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం 'సంగమం-2026' పేరుతో దాండియా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వెయ్యి మందికి పైగా విద్యార్థులు హాజరైనట్లు సమాచారం. వేడుకలు ఉత్సాహంగా సాగుతున్న సమయంలో ఈదురుగాలులు వీయడంతో అమ్మాయిల వైపు ఏర్పాటు చేసిన భారీ లైటింగ్ ట్రస్ ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో పలువురు విద్యార్థులు దాని కింద చిక్కుకుని గాయపడ్డారు. వెంటనే స్పందించిన నిర్వాహకులు, ఇతరులు క్షతగాత్రులను బయటకు తీసి సమీప ఆసుపత్రులకు తరలించారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వనపర్తికి చెందిన బీటెక్ విద్యార్థిని సోనా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సమాచారం.

**వనపర్తికి చెందిన కవల అక్కాచెల్లెళ్లు**

...

వనపర్తి పట్టణంలోని సుభాష్‌వాడకు చెందిన నారాయణదాసు అశోకచారి, నాగలక్ష్మి దంపతుల కుమార్తెలు సోనా (18), మీనా (17) నాదర్‌గుల్‌లోని ఎంవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. కవల సోదరీమణులైన వీరిద్దరూ దాండియా వేడుకల్లో పాల్గొన్న సమయంలో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో సోనా ప్రాణాలు కోల్పోగా, మీనాకు తలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మీనాకు చికిత్స అందిస్తున్నట్లు సమాచారం.

**ఒకరు దూరమై...మరొకరి కోసం ఎదురుచూపులు!**

కళ్లముందే పెరిగి పెద్దవారవుతున్న ఇద్దరు కూతుళ్లలో ఒకరు విగతజీవిగా మారడం, మరొకరు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతుండటంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఒకే ప్రమాదం ఆ కుటుంబాన్ని కన్నీరుమున్నీరు చేసింది. ఈ ఘటన గురించి తెలిసిన



విద్యార్థి : మీనా (17) ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది



విద్యార్థి : సోనా (18) మృతి

వనపర్తి పట్టణ ప్రజలు దిగ్భ్రాంతికి గురయ్యారు. విద్యార్థిని సోనా మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

**భద్రతా ఏర్పాట్లపై ప్రశ్నలు!**

వేలాది మంది విద్యార్థులు పాల్గొన్న వేడుకల్లో భారీ లైటింగ్ ట్రస్ కూలిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈదురుగాలులు వీచిన సమయంలో ఇలాంటి భారీ నిర్మాణాలు కూలకుండా తగిన భద్రతా చర్యలు తీసుకున్నారా? లైటింగ్ ట్రస్ ఏర్పాటు, దాని స్థిరత్వం, ప్రమాద నివారణ చర్యల విషయంలో ఏమైనా లోపాలు ఉన్నాయా? అనే అంశాలపై విచారణ జరపాల్సిన అవసరం ఉంది. వేడుకల సంబరాలు విషాదంగా మారిన ఈ ఘటన విద్యార్థుల భద్రత, బహిరంగ కార్యక్రమాల్లో పటిష్టమైన ఏర్పాట్ల ప్రాధాన్యతను మరోసారి గుర్తుచేస్తోంది...

# సద్దుల బతుకమ్మ విజయదశమి శుభాకాంక్షలు బ్యానర్లతో కళకళలాడిన చిట్యాల

- రాజకీయ వైవిధ్యంలో ఐక్యత సామాజిక సామరస్యాన్ని ఆదర్శంగా నిలుస్తున్న చిట్యాల

**చిట్యాల అక్టోబర్ 18 మీ వార్త :**

గ్రామపంచాయతీలోని సద్దుల బతుకమ్మ విజయదశమి దసరా పండుగల సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల నాయకులు ప్రజా ప్రతినిధులుఏర్పాటు చేసిన శుభాకాంక్షలు ఫ్లెక్సీలు బ్యానర్లు గ్రామంలోని పండుగ శోభను పంచాయి విభిన్న రాజకీయ అభిప్రాయాలు సామాజిక నేపద్యాల మత విశ్వాసాలు కలిగిన ప్రజలు తామద్దైన శైలిలో పండుగ శుభాకాంక్షలు తెలియజేయడం గ్రామంలోని సంతోషకరమైన వాతావరణాన్ని నెలకొల్పింది గ్రామంలోని బిఆర్ఎస్ పార్టీ సర్పంచి 12 వార్డులు ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు టిఆర్ఎస్ నాయకులు భారతీయ జనతా పార్టీ నాయకులు వివిధ పార్టీల నాయకులు తదితరులు పండుగ శు భాకాంక్షలు ప్రచారంలో భాగస్వాములు అయ్యారు అదేవిధంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు పండుగల సందర్భంగా బ్యానర్ ఏర్పాటు చేయడం రాజకీయ పోటీకి మాత్రమే పరిమితం కాకుండా ప్రజల మధ్య పరస్పర గౌరవం సామాజిక గుర్తింపు ప్రజాస్వామ్య వైవిధ్యానికి కూడా పరిస్థితిగా నిలుస్తుంది అయితే నిజమైన రాజకీయ ఆదర్శం కేవలం ఫ్లెక్సీలతోనే కాకుండా ప్రజల సమస్యల పరిష్కార పారదర్శక పాలన గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషితో నిరూపించబడాలి.

బతుకమ్మ తెలంగాణ మహిళల సాంస్కృతిక వైభవాన్ని ప్రకృతిలో మనిషికి ఉన్న అనుబంధాన్ని చాటే పండుగ విజయ దశమి చెడుపై మంచి సాధించిన విజయాన్ని ధర్మం ధైర్యం న్యాయం వంటి విలువలను గుర్తు చేసే పండుగ ఈ రెండు పండుగలు సందర్భంలో వివిధ సామాజిక వర్గాల తమ తమ విశ్వాసాలు సంప్రదాయాలను గౌరవించుకుంటూ శుభాకాంక్షలు పంచుకోవడం సామరస్వర పూర్వక సమాజా నిర్మాణానికి సానుకూల సంకేతం అని ఫ్లెక్సీలకే పరిమితం కాకుండా అభివృద్ధికి బాటలు వెయ్యాలి గ్రామంలోని పండుగ శు భాకాంక్షలు బ్యానర్లు కనిపించడం ప్రజల్లో ఉత్సాహం పెంచినప్పటికీ వాటి సందేశం







గ్రామ అభివృద్ధికి దిశగా ఆచరణలు రావడం మరింత ముఖ్యమైన విషయం తాగునీరు పారిశుద్ధం అంతర్గత రహదారులు దీపాలు ప్రభుత్వ పాఠశాల బలోపేతం వైద్య సేవలు యువతకు ఉపాధి అవకాశాలు మహిళ సాధికారక సామాజిక సామాన్య కమిటీ అంశాలు అన్ని వర్గాల ప్రజలు భాగ్యసములు కావాలి రాజకీయ పార్టీ వేరు అయినా గ్రామ ప్రజల సమస్యలు ఉమ్మడి పండుగలా సందర్భంగా ఏర్పడే సానుకూల వాతావరణాన్ని గ్రామసభలు అభివృద్ధి చర్చ సమస్య పరిష్కారం ప్రభుత్వ పథకాల అర్హులను గుర్తింపు చేసి పారదర్శకత సామాజిక బాధ్యత వైపు మలించగలిగితే చిట్యాల గ్రామం మరింత అభివృద్ధి సాధించగలరు సద్దుల బతుకమ్మ ఉత్సవాన్ని పెంచిన సర్పంచి తవటం లక్ష్మి అంతయ్య 12 వార్డు సభ్యులకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు యువ సంఘాల. ప్రజా సంఘాల. గ్రామ ప్రజలందరికీ సద్దుల దసరా పండుగ శు భాకాంక్షలు తెలిపారు.

## తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ పండుగ.

- గ్రామ సర్పంచ్ తవుటమ్ లక్ష్మీ అత్తయ్య



**చిట్యాల అక్టోబర్ 18 మీ వార్త :**



తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు మరియు ప్రకృతి ఆరాధనకు నిలువెత్తు ప్రతీక బతుకమ్మ పండుగ అని చిట్యాల సర్పంచి తవుటం లక్ష్మి అత్తయ్య అన్నారు ఆదివారం సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని సద్దుల బతుకమ్మ ఆట స్థలానికి సర్పంచ్ ఉప సర్పంచ్ బుర్ర వెంకటేష్ గౌడ్ మరియు బిఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షులు నాలుగో వార్డ్ సభ్యుడు నవీన్ . వార్డ్ నెంబర్లు అల్లం అనూష రాజు. జెట్టి కుమార్ మైదం స్రావ్య శ్రీకాంత్. పంచాయతీ సెక్రెటరీ దేవేందర్ రెడ్డి తో కలిసి హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆట స్థలంలో రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మల మధ్య సంప్రదాయబద్ధంగా ఆటపాటలతో సందడి చేసి వారికి సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సర్పంచ్ తవుటము లక్ష్మి అంతయ్య మాట్లాడుతూ.. శ్రీ దుర్గదేవి అమ్మవారి ఆశీస్సులతో, బతుకమ్మ తల్లి కరుణతో గ్రామంలోని ప్రతి ఇల్లూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో విరసిల్లాలని ఆకాంక్షించారు.

సనాతన ధర్మంలో మహిళలకు ఇచ్చే గౌరవానికి, నారీశక్తికి ఈ పండుగ ఒక నిదర్శనమని ఆయన కొనియాడారు. తెలంగాణ ఆడబిడ్డల జీవితాల్లో బతుకమ్మ పండుగ సరికొత్త వెలుగులు నింపాలని కోరుకుంటూ, గ్రామ ప్రజలందరికీ సద్దుల బతుకమ్మ దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఎన్ హెచ్ఎం ఉద్యోగుల నిరవధిక సమ్మెకు మాజీ ఎమ్మెల్యే బిగాల మద్దతు.



**(మన మీ వార్త న్యూస్) : అక్టోబర్ 18, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-**

నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు తమ న్యాయమైన హక్కుల సాధన కోసం చేస్తున్న పోరాటానికి నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల మద్దతు ప్రకటించారు. ఆదివారం ధర్నాచౌక్ లో ఎన్ హెచ్ఎం ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మెలో బిగాల కూర్చొని వారి సమస్యల పరిష్కారానికి మద్దతు తెలిపారు. ఎన్ హెచ్ఎం ఉద్యోగులు ప్రజారోగ్య వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, వారి సేవలకు తగిన గుర్తింపు, ఉద్యోగ భద్రత, వేతనాలు, ఇతర సౌకర్యాల విషయంలో సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి పరిష్కరించాలని కోరారు. ఎన్ హెచ్ఎం ఉద్యోగులకు గౌరవప్రదమైన వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని, స్టేట్ హెల్త్ సొసైటీ ద్వారా స్పార్ష్ విధానంలో వేతనాలు చెల్లించాలని, 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న 5% ఇంక్రిమెంట్, 8% వార్షిక వేతన పెంపును అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇతర ప్రభుత్వ శాఖల ఉద్యోగుల మాదిరిగా సెలవుల సదుపాయాలు కల్పించాలని, ఉద్యోగులకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలని, ఈహెచ్ఎస్, ఈఎస్ఐ వైద్య సదుపాయాలు అందించాలని, గర్భిణీ ఉద్యోగులకు ప్రసూతి సెలవులు, ఇతర అర్హత కలిగిన సిబ్బందికి తగిన సెలవుల సౌకర్యాలు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న పీఆర్ సీ, ఏరియర్స్ బకాయిలను చెల్లించాలని, జీవో నంబర్ 60, 1195 ప్రకారం అర్హత కలిగిన ఉద్యోగులకు వేతన సవరణ ప్రయోజనాలు కల్పించాలన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఎన్ హెచ్ఎం ఉద్యోగుల కృషి ఎంతో కీలకమని, వారి సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యత అని గణేష్ బిగాల పేర్కొన్నారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ దండు నీతు కిరణ్ శేఖర్,నగర అధ్యక్షులు సిర్ప రాజు,మాజీ నుడా చైర్మెన్ ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆడబిడ్డలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

**అక్టోబర్ 19,10,2026 పరకాల ప్రతినిధి మన మీ వార్త :**



హనంకొండ జిల్లాపరకాల పట్టణంలోని అంగడి మైదానంలో నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొని ఆడబిడ్డలకు సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అంతకముందు ఆత్మకూరు,గుడెప్పాడ్ గ్రామాల్లో నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. అలాగే దామర చెరువు వద్ద బతుకమ్మ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ మహిళల ఆత్మగౌరవానికి, ప్రకృతిపై ప్రేమకు ప్రతిబింబమని అన్నారు. తెలంగాణ ఆడపడుచులు ఎంతో భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకునే బతుకమ్మ పండుగ మన సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందిస్తుందని అన్నారు.ఆడబిడ్డలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, ప్రతి ఇంట్లో ఆనందం, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.

## వాటర్ ప్లాంట్ పనిచేయక తాగునీటికి ఇబ్బందులు

**– సర్పంచ్ అందుబాటులో ఉండటం లేదని గ్రామస్తుల ఆరోపణలు**



త్రాగునీటి సమస్య పరిష్కరించాలని సర్పంచ్ భర్తను నిలదీస్తున్న గ్రామస్తులు



ఉసిరికపల్లి లో ట్యాంక్ నుండి రోజంతా వృధాగా పోతున్న నీరు

**శివ్వంపేట మీ వార్త ప్రతినిధి అక్టోబర్(18):**

మండల పరిధిలోని ఉసిరికపల్లి గ్రామంలో తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు ఆదివారం ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో వాటర్ ప్లాంట్ గత మూడు రోజులుగా పనిచేయకపోవడంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాల్సిన సర్పంచ్ ఎన్నికైన మర్రి సుజాతారెడ్డి స్థానికంగా అందుబాటులో ఉండటం లేదని ఆరోపించారు.మరోవైపు వాటర్ ట్యాంకు నిండిపోయి నీరు పొంగిపొర్లుతూ వృథాగా పోతున్నా పట్టించుకునే వారు కరువయ్యారని వాపోయారు.సంబంధిత అధికారులు స్పందించి వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు చేయించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు



**అక్టోబర్ 19,10,2026 పరకాల ప్రతినిధి మన మీ వార్త :**

హనంకొండ జిల్లా శాయంపేట మండలం పత్తిపాక గ్రామంలో సద్దుల బతుకమ్మ వేడుకలను మహిళలు, యువతులు ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తుల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ చుట్టూ తిరుగుతూ పాటలు పాడారు.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. మహిళలు ఒకరికొకరు బతుకమ్మ శుభాకాంక్షలు తెలుపుకుంటూ, సద్దుల బతుకమ్మను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొనగా, చిన్నారులు, యువతులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

సద్దుల బతుకమ్మ సందర్భంగా పత్తిపాకలో నిర్వహించిన వేడుకలు తెలంగాణ పల్లె సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా ఆకట్టుకున్నాయి.

## దుర్గా మాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన

**అక్టోబర్ 19,10,2026 పరకాల ప్రతినిధి మన మీ వార్త :**



హనంకొండ జిల్లా పరకాల మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ మడికొండ. సంపత్ కుమార్.

దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తి భావాన్ని, ఆధ్యాత్మిక చింతనను పెంపొందిస్తా యని, ప్రజలందరిపై అమ్మవారి ఆశీస్సులు ఉండాలని, ప్రజలంతా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించినారు ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యతను, భక్తి భావాన్ని పెంపొందించడంతోపాటు మన సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు.

## 20 ఏళ్లుగా పండుగలకు చీరల పంపిణీ

**– మున్సిపల్ మహిళా సిబ్బందికి డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ చీరలు అందజేత**

**అక్టోబర్19,10, 2026 పరకాల ప్రతినిధి మన మీ వార్త :**



హనంకొండ జిల్లా పరకాల: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని బీజేపీ రాష్ట్ర నాయకుడు, పరకాల పట్టణ ప్రముఖ వైద్యుడు డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ ఆదివారం మున్సిపల్ మహిళా సిబ్బందికి చీరలు పంపిణీ చేశారు. గత 20 ఏళ్లుగా ప్రతి పండుగ సందర్భంగా మహిళలకు చీరలు పంపిణీ చేస్తూ వస్తున్నారు.

ఈ సందర్భంగా డాక్టర్ సంతోష్ కుమార్ మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న మున్సిపల్ సిబ్బంది సేవలు అభినందనీయమన్నారు. ప్రజలకు సేవలందించే సిబ్బందికి తన వంతుగా సహాయం చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. మున్సిపల్ సిబ్బందికి ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఎదురైనా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పరకాల పట్టణ బీజేపీ అధ్యక్షుడు గాజుల నిరంజన్‌తో పాటు బీజేపీ నాయకులు మిడిదొడ్డి నరేష్, ఆకుల శ్రీధర్, ముత్యాల దేవేందర్, సాదా మధుకర్, పిట్ట కిషోర్, మెంతుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాషాయ జెండా గెలుపు ఓర్చుకోలేక నిధులు విడుదల చేయడం లేదు

**(మన మీ వార్త న్యూస్) : అక్టోబర్ 18, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-**

ఇందూరులో కాషాయ జెండా గెలుపును ఓర్చుకోలేక కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేయడం లేదని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ అన్నారు. ఆదివారం నగరంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే ధన్ పాల్ మాట్లాడుతూ అర్బన్ కు స్పెషల్ ఫండ్ కోసం ప్రభుత్వానికి అనేకసార్లు లేఖలు రాసిన స్పందించలేదని, చివరికి పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినా లాభం లేకుండా పోయిందన్నారు. స్పెషల్ ఫండ్ కేటాయిస్తే నియోజకవర్గ అభివృద్ధి సులువుగా అవుతుందని తెలిపారు. గత ప్రభుత్వంలో నిలిచిపోయిన పనులపై కూడా అనేకసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు గుర్తు చేశారు. రాష్ట్రంలో డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఒక్కటి కూడా రాని నియోజకవర్గం ఇందూరు ఒకటేనని చెప్పారు. సమస్యను మంత్రి పొంగిలేటి దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. దీంతో ఇటీవల అర్బన్ లోని సౌత్ మండల అర్హులకు ఇళ్లను కేటాయించాలని గుర్తు చేశారు. అలాగే స్థలం లేని వారికి హైదరాబాద్ మాదిరిగా టవర్లు నిర్మించి ఇవ్వాలని చెప్పినట్లు తెలిపారు. అర్బన్ నియోజకవర్గ అభివృద్ధి తన లక్ష్యమని ధన్ పాల్ స్పష్టం చేశారు. అవసరపు మాటలు మాట్లాడటమే తప్ప అభివృద్ధి కొరకు కాంగ్రెస్ ఆలోచించడం లేదవి విమర్శించారు.

**ఖిల్లా రామాలయానికి రోప్ వే మంజూరు**

ఇందూరు ఖిల్లా రామాలయానికి రోప్ వే మంజూరైనట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు.కేంద్రమంత్రి నితిన్ గట్కారితోపాటు రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ఖిల్లా రామాలయ అభివృద్ధి పై అనేక సార్లు లేఖలు అందజేయడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రోడ్లు భవనాల శాఖ అధికారులను, రోప్ వే కంపెనీ ప్రతినిధులను పంపడం సంతోషకరమన్నారు. చత్రపతి శివాజీ గురువు సమర్థ రామదాసు నిర్మించిన చారిత్రాత్మక కట్టడం ఖిల్లా రామాలయం అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో దాశరథి కృష్ణమాచార్యులు జైలు శిక్షణ అనుభవిస్తూ "తెలంగాణ నాకోటి రతనాల వీణ " అని రాసిన గొప్ప చరిత్ర కలిగిన ఖిల్లా రామాలయానికి రోప్ వే మంజూరు కావడం సంతోషకరమన్నారు. పర్యాటక స్థలంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. సుమారు రూ.35 కోట్ల నిధులతో రోప్ వే నిర్మాణం కానుందని, ఇందుకోసం డీపీఆర్ సిద్ధం చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో పాలించిన పాలకులు రామాలయ అభివృద్ధిని మరిచారన్నారు. మోదీ ప్రభుత్వం చారిత్రక కట్టడాలపై ప్రత్యేక దృష్టి వహిస్తుందని తెలిపారు. ఇందులో భాగంగానే పర్వతమాల పథకానికి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ తో కలిసి ఖిల్లా రామాలయ అభివృద్ధి కొరకు గతంలో కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. దీంతో రోప్ వే మంజూరైనట్లు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోల్ల లక్ష్మీనారాయణ, కార్పొరేటర్లు ఎర్రం సుధీర్, జగదీష్ కులకర్ణి, మఠం పవన్, రాము, విజయ మల్లేష్ యాదవ్, ప్రసూన శ్రీనివాస్ రెడ్డి, జ్యోతి మురళి, సుమిత్ర కిషోర్, బంటు ప్రీతి ప్రవీణ్, మహిళా మోర్చ అధ్యక్షురాలు వనిత, యువ మోర్చ అధ్యక్షుడు వంశీ, యువ మోర్చ రాష్ట్ర సహ కోశాధికారి విజయ్, ఎస్సీ మోర్చ పురుషోత్తం, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.



## గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపుల నిర్వహణ

## నిబంధనలకు విరుద్ధంగా అర్ధరాత్రి వరకు మద్యం విక్రయాలు

**శివ్వంపేట మీ వార్త ప్రతినిధి క్టోబర్(19):**

మండలంలోని పలు గ్రామాల్లో మద్యం విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయని, సమయపాలన లేకుండా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.గోమారం, చండి,శభాష్‌పల్లి, పెద్దగొట్టిముక్లతో పాటు పలు గ్రామాల్లోని కిరాణా దుకాణాలు,హోటళ్లలో నిబంధనలకు విరుద్ధంగా రాత్రి 11 గంటల వరకు మద్యం విక్రయిస్తున్నారని పేర్కొంటున్నారు.

గ్రామాల్లో బెల్ట్ షాపుల నిర్వహణతో యువత, నిరుద్యోగులు మద్యానికి బానిసలవుతున్నారని, దీంతో



పలు కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ కుటుంబ ఘర్షణలకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా శభాష్‌పల్లిలోని బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయాల కారణంగా పరిశ్రమల్లో పనిచేసే ఇతర రాష్ట్రాల కార్మికులు మద్యానికి ఖర్చు చేస్తూ ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారని,ఈ క్రమంలో కుటుంబాల్లో గొడవలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు.

గ్రామాల్లో యథేచ్ఛగా మద్యం విక్రయాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ మద్యం విక్రయాలపై తనిఖీలు నిర్వహించాలని, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న బెల్ట్ షాపులపై చర్యలు తీసుకొని గ్రామాల్లో మద్యం విక్రయాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

## తోటకూర వజ్రేష్ యాదవ్ జన్మదినాన

## చెంగిచర్లలో నిత్యావసర సరుకుల పంపిణీ

**– మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్,మాజీ మేయర్ అజయ్ యాదవ్ చేతుల మీదుగా పేద ముస్లిం కుటుంబాలకు సరుకులు అందజేత**

**బోడుప్పల్ సర్కిల్ అక్టోబర్ 18 (మన మీ వార్త) :**

మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకుని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్,చెంగిచర్ల డివిజన్‌లో పేద ముస్లిం కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.చెంగిచర్ల డివిజన్ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ అధ్యక్షుడు మొహమ్మద్ యాకూబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సేవా కార్యక్రమంలో మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్,మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరై పేద ముస్లిం కుటుంబాలకు స్వయంగా నిత్యావసర సరుకులు అందజేశారు.

ఈ సందర్భంగా మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. జన్మదినాన్ని పురస్కరించుకుని పేద ముస్లిం కుటుంబాలకు సహాయం అందించేలా ఇలాంటి అర్థవంతమైన సేవా కార్యక్రమం నిర్వహించడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని తెలిపారు.మానవత్వంతో ముందుకు వచ్చి పేద కుటుంబాలకు అండగా నిలిచిన మొహమ్మద్ యాకూబ్ తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులందరినీ ఆయన అభినందించారు.





సమాజంలో ప్రతి ఒక్కరూ తమకు తోచిన సహాయం చేస్తూ పేదలకు అండగా నిలవాలని,భవిష్యత్తులోనూ ప్రజాసేవా కార్యక్రమాలను ఇదే రీతిలో ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు.

కార్యక్రమ నిర్వాహకుడు,మైనారిటీ అధ్యక్షుడు మొహమ్మద్ యాకూబ్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై నిత్యం స్పందిస్తూ ప్రజల్లో ఉండే నాయకుడు తోటకూర వజ్రేష్ యాదవ్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.భవిష్యత్తులో వారు మరిన్ని ఉన్నత స్థానాలను అధిరోహిస్తూ ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

చెంగిచర్ల డివిజన్ ప్రధాన కార్యదర్శి ఆసర్ల బీరప్ప మాట్లాడుతూ.. తోటకూర వజ్రేష్ యాదవ్ ప్రజాసేవకే తొలి ప్రాధాన్యం ఇస్తూ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటారని కొనియాడారు. నిరుపేదల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ,సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఆయన జన్మదినం సందర్భంగా పేదలకు నిత్యావసరాలు అందించే మంచి కార్యక్రమాన్ని చేపట్టడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు.ఈ సేవా కార్యక్రమంలో బోడుప్పల్ మాజీ అధ్యక్షుడు పోగుల నరసింహ రెడ్డి,చెంగిచర్ల డివిజన్ అధ్యక్షుడు పోగుల దిలీప్ రెడ్డి,బోడుప్పల్ డివిజన్ అధ్యక్షుడు బొమ్మక్ కళ్యాణ్,చెంగిచర్ల డివిజన్ ప్రధాన కార్యదర్శులు కుర్రి మహేష్,మేకల శ్రీనివాస్ గౌడ్,సింగిరెడ్డి రాజు రెడ్డి,కార్యదర్శి గడ్డం యాదగిరి,మేడ్చల్ నియోజకవర్గ మైనారిటీ ప్రధాన కార్యదర్శి ముస్తాక్,చెంగిచర్ల డివిజన్ మైనారిటీ వైస్ ప్రెసిడెంట్ ఇంతియాజ్,వర్కింగ్ ప్రెసిడెంట్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

## రంగలీల మైదానంలో ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న

**మన మీ వార్త అక్టోబర్ 18 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :**

**జీడబ్ల్యూఎంసీ, అక్టోబర్ 18:** గ్రేటర్ వరంగల్ పరిధిలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు చేపట్టిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్నతో కలిసి ఆదివారం సాయంత్రం రంగలీల మైదానంలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మైదానంలోని వివిధ ప్రాంతాలను కాలినడకన సందర్శించి, వేడుకలకు హాజరయ్యే మహిళలు, భక్తులు, ప్రజలకు కల్పిస్తున్న సౌకర్యాలను సమీక్షించారు.





ఈ సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని, పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ దీపాలంకరణ, రాకపోకల నిర్వహణ తదితర అంశాల్లో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. వేడుకలు ముగిసే వరకు సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ, ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

బతుకమ్మ వేడుకలకు వచ్చే ప్రతి ఒక్కరికీ సౌకర్యవంతమైన వాతావరణం కల్పిస్తూ, పండుగను ప్రశాంతంగా, ఆనందోత్సాహాల మధ్య విజయవంతంగా నిర్వహించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్, కమిషనర్ అన్నారు.

# సంక్షేమ పథకాలతో భవన నిర్మాణ కార్మికులకు భరోసా జనసేన నాయకులు ముమ్మారెడ్డి ప్రేమ కుమార్





**కూకట్పల్లి అక్టోబర్ 18 మన మీ వార్త :**

కూకట్ పల్లి నియోజకవర్గం ఏ వి బి పురంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి ఆలయ ప్రాంగణంలో భవన నిర్మాణ కార్మికులకు సుమారు 300 మందికి లేబర్ కార్డులు మరియు ఈ - శ్రమ్ కార్డులు జనసేన రాష్ట్ర జాయినింగ్ కమిటీ కన్వీనర్ ముమ్మారెడ్డి ప్రేమకుమార్ చేతుల మీదుగా పంపిణి చెయ్యడం జరిగింది.

ఈ సందర్బంగా భవన నిర్మాణ కార్మికులకు ఆలయ ప్రాంగణంలో జనసేన నాయకుల ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చెయ్యడం జరిగింది..

ప్రేమకుమార్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు మరియు శ్రామికులకు జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారాని శ్రామికులకు జనసేన పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలియజేసారు.

ఈ కార్యక్రమం లో జనసేన నాయకులు కొల్లా శంకర్ మరియు ఏవిబి పురం జనసైనికులు ప్రసాద్ రావు, సింహాద్రి,రాజు,పేరంబరావు, లక్ష్మణరావు, శివ శంకర్,గోవింద్,దుర్యోధన ధనుంజయ్, అనంతరావు, కృషి తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపాపయ్యపల్లి గ్రామంలో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు





- తెలంగాణ సంస్కృతికి నిలువుటద్దం బతుకమ్మ..
- తెలంగాణ ఆడబిడ్డల పండుగ బతుకమ్మ..
- పువ్వులను పూజించే పండుగ బతుకమ్మ..

**మన మీ వార్త హుజూరాబాద్ ప్రతినిధి అక్టోబర్ 18:**

ప్రకృతిని ఆరాధిస్తూ పువ్వులను పూజిస్తూ, తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే బతుకమ్మ పండుగ, తెలంగాణ సంస్కృతికి సాంప్రదాయాలకు నిలువెత్తు రూపం, ఆడపడుచులు పూలను పూజిస్తూ గౌరమ్మని ఆరాధిస్తూ, ఆనంద ఉత్సవాలతో హుజురాబాద్ మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామంలో ఆదివారం చివరి సద్దుల



రోజు బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. మహిళలు పిల్లలు ఒకరోజు ముందు రంగురంగుల పూలను తెచ్చి పోటా పోటీగా బతుకమ్మను తీరొక్కపూలతో పేర్చారు, హరివిల్లు కంటే అందంగా బతుకమ్మను పేర్చి, గౌరమ్మకు ఐదు రకాల నైవేద్యాలు సమర్పించారు. తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాన్ని అద్దం పట్టే విధంగా ఆడపడుచులందరూ బతుకమ్మను ఒకచోట పెట్టి ఆటపాటలతో కోలాటాలతో ఆనందోత్సవాలతో మరింత ఉత్సాహం బతుకమ్మ పండుగను జరుపుకున్నారు. అనంతరం బతుకమ్మ తో పాటు గౌరమ్మని ఉంచి, గంగమ్మ ఒడిలో నిమజ్జనం చేసి వీడ్కోలు పలికారు, ఇస్తినమ్మ వాయనం, పుచ్చుకున్నానమ్మా వాయినం అంటూ అమ్మవారి ప్రసాదాలు ఒకరికొకరు పంచుకున్నారు.

# ఖద్దరు చొక్కా చాటున కన్నీటి వ్యధలు

- రాజకీయ ఆధిపత్య పోరులో అప్పులపాలు అవుతున్న సర్పంచ్ అభ్యర్థులు
- కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్న సర్పంచ్ పదవి, మానసిక ఒత్తిడితో జీవితాలు అతలాకుతలం

**వనపర్తి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 18 మీ వార్త :**

గ్రామ పంచాయతీలు అంటే మన భారత ప్రజాస్వామ్యానికి గుండె లాంటివి. మహాత్మా గాంధీ కలలుగన్న 'గ్రామ స్వరాజ్యం' ఆశయాన్ని అమలు చేసే శక్తివంతమైన స్థానిక ప్రభుత్వాలు ఇవి, వీటిని నడిపించే అత్యంత ముఖ్యమైన వ్యక్తి సర్పంచ్.సాధారణంగా సర్పంచ్ అంటే సేవ, గ్రామాభివృద్ధి, మరియు ప్రజల సంక్షేమం కోసం పాటుపడే వ్యక్తిగా మనం భావిస్తాం. కానీ, ఈ రోజుల్లో సర్పంచ్ కుర్చీలో కూర్చున్నవారి ముఖాల్లో ఆ సేవాభావం కంటే, తీర్చలేని అప్పుల భారం, నిస్సత్తువ, మరియు ఆర్థిక కష్టం మాత్రమే కనిపిస్తున్నాయి. ఖద్దరు చొక్కా వెనుక దాగున్న ఈ బాధాకరమైన కథ కేవలం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకే పరిమితం కాదు; ఇది దేశంలోని చాలా గ్రామీణ ప్రాంతాల్లో కనిపిస్తున్న ఒక చేదు నిజం..

**జూదంలా మారిన ఎన్నికలు - అప్పుల ఊబిల్లో అభ్యర్థులు...**

నేటి గ్రామ రాజకీయం ఎంత దారుణంగా ఉందంటే, సర్పంచ్‌గా పోటీ చేయడం అనేది ఒక పెద్ద ఆర్థిక రిస్క్ తీసుకోవడంతో సమానం.గ్రామంలో 'మనం గెలవాలి' అనే పట్టుదల, రాజకీయ పార్టీల ఒత్తిడి, మరియు కులాల లెక్కలు. ఈ కారణాల వల్ల అభ్యర్థులు లక్షలు, కోట్లు ఖర్చు చేస్తున్నారు.ఇల్లు తాకట్టు పెట్టడం,పొలాలు తాకట్టు పెట్టడం.ఎక్కువ వడ్డీకి అప్పులు తీసుకోవడం,ఇవన్నీ కేవలం ఎన్నికల్లో గెలవడం కోసం అభ్యర్థులు పడే తిప్పలు, జెండా మాత్రమే పార్టీది, కానీ ఆ అప్పుల ఊబిలో మునిగేది మాత్రం నిజంగా పోటీ చేసిన వ్యక్తి మరియు అతని కుటుంబం మాత్రమే.. నియంత్రణ చేయాల్సిన వ్యవస్థ మౌనంగా చూస్తూ ఉండిపోవడం కూడా వీటికి కారణంగా వుంది..

**గెలిచాక మొదలవుతాయి అసలు కష్టాలు...**

ఎన్నికల ఖర్చు ఒక భారం అయితే, గెలిచాక సర్పంచ్ ఎదుర్కొనే పాలనా సమస్యలు మరింత బాధ కలిగిస్తాయి. ప్రజలకు రోడ్లు కావాలి, తాగునీరు కావాలి, లైట్లు కావాలి. ప్రతి అవసరం వారికి అత్యవసరమే! కానీ పనుల కోసం డబ్బు ఎక్కడ?నిధులు రాక ఆలస్యం:లి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రామ పంచాయతీలకు రావాల్సిన గ్రాంట్లు నెలలు, ఒక్కోసారి ఏళ్లు ఆలస్యం అవుతున్నాయి.అధికారుల చుట్టూ తిరగడం:లి ప్రతి చిన్న పని ఆమోదం కోసం జిల్లా కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాలి. సంతకాలు, ఫైల్ కదలికలు. అన్నీ పెద్ద ఇబ్బందే.అప్పు చేసి పనులు చేయాల్సిరావడంలి : ప్రజల ఒత్తిడి తట్టుకోలేక, 'బిల్లులు వస్తాయిలే' అనే నమ్మకంతో సర్పంచ్‌లు సొంతంగా అప్పు చేసి పనులు ప్రారంభిస్తున్నారు. కానీ బిల్లులు సకాలంలో రాక ఆ అప్పులు వడ్డీతో పెరిగి వారిని కుంగదీస్తున్నాయి.గత కొన్నేళ్లుగా అప్పుల బాధతో ఆత్మహత్యలకు పాల్పడిన సర్పంచ్‌ల ఉదంతాలు ఎన్నో, ఇది మన గ్రామ పాలన వ్యవస్థ ఎంతటి దుర్భర స్థితిలో ఉందో చెప్పే భయంకరమైన వాస్తవాలు..







**ప్రజాస్వామ్య అసమానతే దీనికి మూల కారణం...**

అధికారాలన్నీ పై స్థాయిలో కేంద్రీకృతం కావడం.సర్పంచ్, వార్డు మెంబర్, ఎంపీటీసీ ,లాంటి స్థానిక ప్రజాప్రతినిధులను ఇప్పటికీ చాలామంది 'ఉచితంగా సేవ చేసేవాళ్లు' (స్వచ్ఛంద సేవకులు)గానే చూస్తున్నారు.ఒక ఎమ్మెల్యే లేదా ఎంపీకి మంచి జీత బత్యాలు, భద్రత, మరియు గౌరవం అన్నీ ఉంటాయి.కానీ, ప్రజలతో రోజూ నేరుగా పనిచేసే సర్పంచ్‌కు మాత్రం సక్రమంగా జీతం లేదు, పనులు చేయించే అధికారం లేదు, నిధులు లేవు.ఇది మన ప్రజాస్వామ్యం లో ఉన్న ఒక పెద్ద లోపంగా మారింది

**వ్యవస్థను ప్రక్షాళన చేయడమే పరిష్కార మార్గం..**

సర్పంచ్‌ల బాధలు తీరాలంటే కేవలం సానుభూతి సరిపోదు. వ్యవస్థలో మార్పులు రావాలి సర్పంచ్‌లకు గౌరవ వేతనం:లి సేవకు గౌరవం ఇవ్వాలి. వారికి స్థిరమైన, చట్టబద్ధమైన నెల జీతం ఇవ్వాలి. ఇది ఖర్చు కాదు, ప్రజాస్వామ్యానికి చేసే పెట్టుబడిగా చూడాలి అధికార వికేంద్రీకరణ గ్రామ పంచాయతీలకు నేరుగా నిధులు విడుదల చేయాలి. చిన్న పనుల ఆమోదం కోసం పై అధికారుల చుట్టూ తిరగకుండా, సర్పంచ్‌కే అధికారం ఇవ్వాలి.బిల్లుల చెల్లింపుకు గడువు సర్పంచ్ పంపిన పని బిల్లులు 90 రోజుల్లోగా చెల్లించకపోతే, ఆ ఆలస్యానికి కారణమైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి.ఎన్నికల సంస్కరణలు డబ్బు పంపిణీ రాజకీయాలను గ్రామాల నుంచి పూర్తిగా తొలగించాలి. నిజాయితీగా సేవ చేయాలనుకునేవారికి భయం లేకుండా పోటీ చేసే వాతావరణం కల్పించాలి



**వ్యవస్థ మారకపోతే ప్రజాస్వామ్యానికే ముప్పు...**

సర్పంచ్ పదవి కేవలం అప్పుల భారాన్ని తెచ్చిపెడితే, గ్రామానికి నిజంగా సేవ చేయాలనే తపన ఉన్న మంచి వ్యక్తులు రాజకీయాల్లోకి రావడానికి భయపడతారు. అప్పుడు ఏం జరుగుతుంది? డబ్బు ఉన్నవారు, అక్రమంగా సంపాదించగలవారు మాత్రమే స్థానిక పాలనలోకి వస్తారు.

ఇది మన ప్రజాస్వామ్యానికి, గ్రామ స్వరాజ్యం అనే ఆశయానికి చాలా పెద్ద ముప్పు.గ్రామ పాలకులు అప్పుల్లో కూరుకుపోతుంటే కేంద్ర, రాష్ట్రాలు చూస్తూ ఊరుకుంటే అది చివరికి ప్రజాస్వామ్యానికే ముప్పుగా మారే ప్రమాదం ఉంది.ఈ వ్యవస్థను బలోపేతం చేయడం ఇప్పుడు తక్షణ కర్తవ్యం. లేకపోతే రాబోయే తరాలకు గ్రామ పాలనలో సేవ చేయాలనే ఆలోచన పూర్తిగా కరువైపోయి, గ్రామాభివృద్ధి అనేది కేవలం ప్రభుత్వ ఫైళ్లకు, కాగితాలకే పరిమితం అవుతుంది. సామాజిక విశ్లేషకులు జి. అజయ్ కుమార్...

## మృతుల కుటుంబాలకు అండగా ఉంటా మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**అక్టోబర్ 19,10, 2026 హనంకొండ జిల్లా ఆత్మకూరు:**

మండలంలోని హౌస్ బుజుర్గ్, కటాక్షపూర్,ఆత్మకూరు గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన నీలం సారయ్య, వటుకుల నరసింహారెడ్డి,ఉప్పుల లింగమూర్తి కుటుంబాలను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి, మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని, కష్టకాలంలో వారికి తోడుగా నిలుస్తామని భరోసా కల్పించారు.

ఈ పరామర్శ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో చికిత్స పొందుతున్న చిలువేరు సునీతను పరామర్శించిన జీ ఎమ్మెల్యే చల్లా ధ అక్టోబర్మ రెడ్డి

**అక్టోబర్19,10,2026 పరకాల ప్రతినిధి మన మీ వార్త :**



హనంకొండ జిల్లా పరకాల పట్టణం 4వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ మహిళా నాయకురాలు చిలువేరు సునీత హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆమెను పరామర్శించారు. ఆమె ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. సునీత త్వరగా కోలుకుని తిరిగి ప్రజాక్షేత్రంలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు.

## వడ్డేపల్లి వారి ఇంట ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు



**కూకట్పల్లి అక్టోబర్ 18 మన మీ వార్త :**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు నివాసంలో సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా వడ్డేపల్లి యామిని రాజేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రకృతి సిద్ధమైన గునుగు పూలతో పాటు వివిధ రకాల పుష్పాలను ఉపయోగించి, సహజ రంగులతో సుమారు 16 అడుగుల భారీ సద్దుల బతుకమ్మను సంప్రదాయబద్ధంగా పేర్చారు.

అనంతరం వివేకానంద నగర్ నుంచి మహిళలు, కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మను సంప్రదాయబద్ధంగా ఆటపాటలతో ఊరేగింపుగా కూకట్‌పల్లి బతుకమ్మ వేదిక వద్దకు తీసుకువచ్చారు. వడ్డేపల్లి యామిని రాజేశ్వరరావు కుటుంబ సభ్యులతో పాటు స్థానిక మహిళలతో కలిసి బతుకమ్మ ఆటలు ఆడుతూ, సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. మహిళల ఆటపాటలు, బతుకమ్మ పాటలతో ఆ ప్రాంతమంతా పండుగ శోభను సంతరించుకుంది.

అనంతరం రంగధాముని చెరువు వద్ద బతుకమ్మను భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేసి, అమ్మవారికి పూజలు నిర్వహిస్తూ సద్దుల బతుకమ్మ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య ప్రశాంతంగా ముగించారు.

తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతిని ఆరాధించే సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను కుటుంబ సభ్యులు, స్థానిక మహిళలతో కలిసి ఘనంగా నిర్వహించడం ద్వారా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు వడ్డేపల్లి కుటుంబం తన వంతు భాగస్వామ్యాన్ని చాటుకుంది.

## వనపర్తి రాజా కి శాలువాతో సన్మానం

- అడ్వాన్స్ దసరా శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు



**వనపర్తి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 18 మీ వార్త :**

**వనపర్తి టౌన్ న్యూస్ :** ఈరోజు వనపర్తిలోని రాజా రామేశ్వరరావు తోట వద్ద వనపర్తి రాజా ని పలువురు కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, వార్డు కౌన్సిలర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించి, ముందస్తు దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

**ఆత్మీయ పలకరింపు... పండుగ శుభాకాంక్షలు!**

దసరా పండుగను పురస్కరించుకొని నిర్వహించిన ఈ ఆత్మీయ కలయికలో నాయకులు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. పండుగ ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతిసౌభాగ్యాలు నింపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏర్పుల వెంకటయ్య యాదవ్, మాజీ జెడ్పీటీసీ,చీర్ల జనార్ధన్ సాగర్,వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి,విభూతి నారాయణ, 8వ వార్డు మాజీ కౌన్సిలర్ ,ఏర్పుల రవి యాదవ్,25వ వార్డు కౌన్సిలర్,ఉమ్మళ్ల చంద్రయ్య నాయుడు, మాజీ విద్యుత్ లైన్‌మెన్,వనపర్తి రాజా కి ముందస్తు విజయదశమి శుభాకాంక్షలు అందరికీ దసరా శుభాకాంక్షలు...

## దేవి నవరాత్రుల ఉత్సవాలు భారీగా తరలివచ్చిన మహిళా భక్తులు..

- మనోహరాబాద్ అక్టోబర్ 18 మన మీ వార్త ప్రతినిధి

- మహా అన్న ప్రసాదానికి విశేష స్పందన..



మండలంలో కాళ్ళకల్ బంగారమ్మ దేవాలయ ప్రాంగణంలో ఘనంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు నవదుర్గా నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల్ శర్మ సమక్షంలో కుంకుమార్చన,హోమం, దుర్గామాత మాల వేసిన వారి ఆధ్వర్యంలో నిర్వహించారు.



ఎర్ర వెంకటేష్ కుటుంబ సభ్యులతో మహా అన్నప్రసాద కార్యక్రమం చేశారు.

అమ్మవారి కుంకుమార్చన కార్యక్రమంలో సుమారు 500 కు పైగా మహిళలు విచ్చేసి అమ్మవారి కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొన్నారు అమ్మవారికి అత్యంత కార్యక్రమానికి భారీగా మహిళా మూర్తులు తరలివచ్చి అమ్మవారి ప్రత్యేక పూజలు నిర్వహించి మహా అన్న ప్రసాదంలో భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమంలో ఎర్ర కృష్ణ, పెద్దింటి సత్యం, నిర్వాహకులు ,మహిళ భవానీలు అమ్మవారి భక్తులు భారీగా పాల్గొన్నారు.

## వెంకటాపురంలో బీఆర్ఎస్‌కు ఎదురుదెబ్బ!

- కాంగ్రెస్‌లోకి 122 మంది చేరిక
- మాజీ సర్పంచ్ లక్ష్మీదేవమ్మ, వెంకటయ్యతో పాటు పలువురు నాయకులు కాంగ్రెస్‌లోకి
- కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



వనపర్తి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 18 మీ వార్త :

**పెబ్బేరు మండలం న్యూస్ :** వనపర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు కొనసాగుతున్నాయి. వనపర్తి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మొత్తం 122 మంది బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.మాజీ సర్పంచ్‌తో పాటు పలువురు నాయకుల చేరిక,మాజీ సర్పంచ్ లక్ష్మీదేవమ్మ, వెంకటయ్యతో పాటు మద్దిలేటి భార్య శారద, బక్కమ్మ, వార్డు సభ్యులు శ్రీను, జయమ్మ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

**కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే!**

శనివారం వనపర్తి పట్టణంలోని నందిహిల్స్‌లో గల ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి కొత్తగా పార్టీలో చేరిన వారిని సాదరంగా ఆహ్వానించారు.ప్రజా సంక్షేమం, గ్రామాభివృద్ధే లక్ష్యం,ఈ సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, శేఖర్, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు...

## SC సెల్ మండల, పట్టణ అధ్యక్షుల నియామకం!

- నూతన అధ్యక్షులను ప్రకటించిన జిల్లా అధ్యక్షుడు రాజ్ కుమార్
- నూతన అధ్యక్షులను శాలువాలతో సన్మానించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



వనపర్తి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 18 మీ వార్త :

**వనపర్తి టౌన్ న్యూస్ :** వనపర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్‌ను మరింత బలోపేతం చేసే దిశగా నూతన మండల, పట్టణ అధ్యక్షులను జిల్లా అధ్యక్షుడు రాజ్ కుమార్ ఆదివారం ప్రకటించారు. ఈ సందర్భంగా వనపర్తి పట్టణంలోని నందిహిల్స్‌లో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి నివాసంలో నూతన అధ్యక్షులను ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించి, అభినందించారు.

నూతన అధ్యక్షుల వివరాలు,పెబ్బేరు మండల అధ్యక్షుడిగా -- డి. వెంకటేష్, శ్రీరంగాపురం మండల అధ్యక్షుడిగా -- బి. రంజిత్, గోపాల్‌పేట మండల అధ్యక్షుడిగా -- వడ్డేమాన్ శివ,ఏదుల మండల అధ్యక్షుడిగా -- పగిడాల కృష్ణయ్య,రేవల్లి మండల అధ్యక్షుడిగా -- మిద్దె రాములు,ఖిల్లా ఘణపురం మండల అధ్యక్షుడిగా -- మేదరి రాములు,పెద్దమందడి మండల అధ్యక్షుడిగా -- గట్టు మన్నెం, వనపర్తి పట్టణ అధ్యక్షుడిగా -- అనిల్ కుమార్,పెబ్బేరు పట్టణ అధ్యక్షుడిగా -- గాడిమూడి పరుశరాముడు,కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి: ఎమ్మెల్యే మేఘారెడ్డి.ఈ సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నూతన అధ్యక్షులకు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాజశేఖర్, కొంకి వెంకటేష్, పెద్దమందడి మండల అధ్యక్షుడు వెంకటస్వామి, మహేష్, జిల్లా యువజన సంఘం మాజీ అధ్యక్షుడు రంజిత్ కుమార్, కోళ్ల వెంకటేష్‌తో పాటు ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు...

# పెద్ద చెరువు వద్ద అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు!







పటాన్ చేరు అక్టోబర్ 18 మీ వార్త ప్రతినిధి :

- ఘనంగా వేడుకలు నిర్వహించిన మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి
- చిన్నారుల కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలతో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- కళా బృందాల పాటలతో మార్మోగిన చెరువు పరిసరాలు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు అమీన్‌పూర్ డివిజన్ పరిధిలోని పెద్ద చెరువు వద్ద వైభవంగా జరిగాయి. అమీన్‌పూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో తన సొంత నిధులతో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్య నృత్యాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కళా బృందాలు ఆలపించిన బతుకమ్మ పాటలు, జానపద గేయాలతో పెద్ద చెరువు పరిసరాలు సందడిగా మారాయి. తెలంగాణ సంప్రదాయాలను ప్రతిబింబించేలా నిర్వహించిన కార్యక్రమాలు పండుగ వాతావరణాన్ని మరింత ఉత్సాహభరితంగా మార్చాయి.

ఈ సందర్భంగా మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, సంస్కృతీ సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనమన్నారు. భావితరాలకు తెలంగాణ సంస్కృతిని పరిచయం చేయడంతోపాటు కళలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో తన సొంత నిధులతో వేడుకలను నిర్వహించినట్లు తెలిపారు. ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

# శిథిల విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు

- విద్యుత్ తీగల మరమ్మతులతో ప్రమాదాల ముప్పు తగ్గింపు
- 22వ వార్డు ప్రజల చిరకాల సమస్యకు పరిష్కారం
- కౌన్సిలర్ ఏరువా అరుణ, మెకానిక్ శ్రీను చొరవ

వనపర్తి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 18 మీ వార్త :

**వనపర్తి టౌన్ న్యూస్ :** వనపర్తి జిల్లా కేంద్రంలోని 22వ వార్డు గణేష్ నగర్ చెరువు కట్ట సమీపంలో శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలను ఏర్పాటు చేయించారు. కౌన్సిలర్ ఏరువా అరుణ, మెకానిక్ శీను చొరవతో వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న చిరకాల సమస్యకు పరిష్కారం లభించింది.

**దశాబ్దాల నాటి స్తంభాలతో భయాందోళనలు!**

వార్డులోని ప్రధాన వీధుల్లో దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు కాలక్రమేణా శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎప్పుడు కూలిపోతాయోననే భయంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యను గుర్తించిన కౌన్సిలర్ ఏరువా అరుణ వెంటనే స్పందించి, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య తీవ్రతను వివరించారు. దీంతో కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు.

**ప్రమాదకర స్తంభాల తొలగింపు,కొత్త స్తంభాల ఏర్పాటు...**

ఆదివారం కౌన్సిలర్ పర్యవేక్షణలో విద్యుత్ శాఖ సిబ్బంది పాత, ప్రమాదకరమైన స్తంభాలను తొలగించి, వాటి స్థానంలో కొత్త కాంక్రీట్ విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. అలాగే వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేసి, అవసరమైన చోట కొత్త లైన్లను అమర్చారు. దీంతో ప్రమాదాల ముప్పు తగ్గడంతో పాటు స్థానికులకు ఊరట లభించింది.

**ప్రజల భద్రతే ప్రథమ ప్రాధాన్యం...**



ఈ సందర్భంగా కౌన్సిలర్ ఏరువా అరుణ మాట్లాడుతూ, వార్డు ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తానని, వార్డులో ఏ చిన్న సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారానికి సహకరించిన విద్యుత్ శాఖ అధికారులకు, సిబ్బందికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు...

# పూల సింగిడిలో... బతుకమ్మ సందడి!

- వనపర్తి 21వ వార్డులో ఘనంగా బతుకమ్మ సంబరాలు
- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా పండుగ

వనపర్తి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 18 మీ వార్త :

**వనపర్తి టౌన్ న్యూస్ :** తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను వనపర్తి జిల్లా కేంద్రంలోని 21వ వార్డులో మహిళలు ఆదివారం ఘనంగా నిర్వహించారు.రంగురంగుల పూలతో బతుకమ్మలు. వివిధ రకాల రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించిన మహిళలు వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.



**బతుకమ్మ పాటలతో సందడి...**

బతుకమ్మ పాటలు పాడుతూ, బతుకమ్మల చుట్టూ ఆడిపాడుతూ మహిళలు పండుగ సంబరాలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. మహిళలంతా ఒకచోట చేరడంతో 21వ వార్డులో పండుగ వాతావరణం నెలకొంది.తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబం.ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తూ



తెలంగాణ సంస్కృతి గొప్పతనాన్ని చాటిచెప్పారు.పాల్గొన్న మహిళలు,జ్యోతి, శ్యామలమ్మ, చంద్రమ్మ, రేణుక, వైష్ణవి, స్వప్న, అక్షిత, కవిత, కావేరి, జ్యోత్స్న, అక్షర, దుర్గ, తిరుమలమ్మ, జయమ్మ, నవనీత, శ్రీ వాణితో పాటు పలువురు మహిళలు, కాలనీవాసులు పాల్గొన్నారు. బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు వనపర్తి జిల్లా ప్రజలకు !

# బతుకమ్మ ఘాట్‌లో అపరిశుభ్రత తాండవం.. మురుగునీటిలోనే నిమజ్జనం!



- కొంపల్లి అధికారుల తీరుపై స్థానికుల ఆగ్రహం.. జోనల్ కమిషనర్ ఆదేశాలకూ దిక్కులేదా?

మీ వార్త / కుత్బుల్లాపూర్ :

పూల పండుగ బతుకమ్మ వేడుకల్లో అపరిశుభ్రత మహిళా భక్తులకు తీవ్ర ఇబ్బందులు కలిగించింది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి సర్కిల్ పరిధిలోని సూరారం కట్ట మైసమ్మ బతుకమ్మ ఘాట్‌లో కనీస పరిశుభ్రత, సౌకర్యాలు కల్పించకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మురుగునీరు, దుర్వాసన, నీటిపై పేరుకుపోయిన నూనె తెట్టెల మధ్యే మహిళలు బతుకమ్మలను నిమజ్జనం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మురుగునీటితోనే నిమజ్జనం..**

బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ఘాట్‌లో పాత నీటిని తొలగించి, కొత్త నీటిని నింపడంతోపాటు పరిశు



భ్రతకు ప్రాధాన్యమివ్వాల్సి ఉంది. అయితే, ఘాట్‌లో మురుగునీరు తొలగించకపోవడం, నీటిపై నూనె పొరలు పేరుకుపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని స్థానికులు పేర్కొంటున్నారు. నీరు తక్కువగా ఉండటంతో నిమజ్జనం కోసం నీటిలోకి దిగాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఆదేశాలున్నా అమలుకాని ఏర్పాట్లు..**

పండుగకు ముందే ఘాట్‌లో సౌకర్యాలు కల్పించాలని స్థానికులు, ప్రజాప్రతినిధులు జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. దీనిపై స్పందించిన జోనల్ కమిషనర్ అవసరమైన ఏర్పాట్లు చేయాలని కొంపల్లి డిప్యూటీ కమిషనర్ (డీసీ), సంబంధిత అధికారులను ఆదేశించినప్పటికీ



క్షేత్రస్థాయిలో పరిస్థితి మారలేదని ఆరోపిస్తున్నారు. సిబ్బంది కేవలం చెత్తను ఊడ్చి వదిలేశారని, నీటి శుభ్రతపై దృష్టి సారించలేదని విమర్శిస్తున్నారు.

**బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్..**

పవిత్రమైన బతుకమ్మ పండుగ సమయంలో కనీస సౌకర్యాలు కల్పించకపోవడంపై మహిళలు, స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యానికి ఇబ్బందులు కలిగించేలా ఘాట్‌ను నిర్లక్ష్యం చేసిన అధికారులపై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. రాబోయే రోజుల్లో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ఘాట్ల వద్ద పరిశుభ్రత, తగిన సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

## సోమవారం ప్రజావాణి కార్యక్రమం రద్దు వరంగల్ జిల్లా కలెక్టర్

మన మీ వార్త అక్టోబర్ 18 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

జిల్లా కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజావాణి కార్యక్రమాన్ని పరిపాలనపరమైన కారణాల వల్ల రద్దు చేసినట్లు పేర్కొన్నారు. వచ్చే సోమవారం యధావిధిగా ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రకటనలో తెలిపారు.



# ఆడపడుచులతో కలిసి బతుకమ్మ ఆడిన కొండా సురేఖ.

- వరంగల్ రంగలీల మైదానంలో వెల్లివిరిసిన తెలంగాణ సంస్కృతి వైభవం
- తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక" -
-- మాజీ మంత్రి ఎమ్మెల్యే కొండా సురేఖ
- వరంగల్ మైదానంలో బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కొండా సురేఖ, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న దంపతులు

మన మీ వార్త అక్టోబర్ 18 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వరంగల్ రంగలీల మైదానంలో ఆనందోత్సాహాల మధ్య వైభవంగా సాగింది. వరంగల్ తూర్పు శాసనసభ్యురాలు, మాజీ మంత్రి శ్రీమతి కొండా సురేఖ, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న, ఆయన సతీమణి సౌజన్య స్థానిక ఆడపడుచులతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొని, వారితో కలిసి బతుకమ్మ ఆడుతూ పండుగ సంబరాలను పంచుకున్నారు. సంప్రదాయ బతుకమ్మ పాటలు, కోలాటాలు, మహిళల ఉత్సాహభరితమైన ఆటపాటలతో వరంగల్ మైదానం పండుగ శోభను సంతరించుకుంది.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండా సురేఖ మాట్లాడుతూ.. బతుకమ్మ అంటే కేవలం పూల పండుగ కాదు.. ప్రతి తెలంగాణ ఆడబిడ్డ గుండెల్లో కొలువైన ఆత్మీయత, అనుబంధం, ఆత్మగౌరవానికి ప్రతిరూపం అని పేర్కొన్నారు. ప్రకృతిలో లభించే రంగురంగుల పూలను అందంగా పేర్చి బతుకమ్మను కొలవడం మన సంప్రదాయ గొప్పతనానికి నిదర్శనమని అన్నారు. ఆడపడుచులంతా తమ ఇళ్లను, బాధ్యతలను పక్కనపెట్టి ఒకచోట చేరి పాటలు పాడుతూ, బతుకమ్మ ఆడుతూ ఆనందాన్ని పంచుకోవడం ఈ పండుగ ప్రత్యేకత అని తెలిపారు. బతుకమ్మ పాటల్లో మన పల్లె జీవితం, కుటుంబ బంధాలు, ప్రకృతి అందాలు, తెలంగాణ చరిత్ర ప్రతిధ్వనిస్తాయని చెప్పారు. బతుకమ్మ మన సంస్కృతి.. మన సంప్రదాయం.. మన ఆడబిడ్డల ఆత్మగౌరవం. పూలతో పేర్చిన బతుకమ్మలాగే మన జీవితాలు కూడా ప్రేమానురాగాలతో, సంతోషాలతో నిండిపోవాలి. ప్రతి ఆడబిడ్డ ముఖంలో చిరునవ్వు విరియాలి.. ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలి"అని కొండా సురేఖ ఆకాంక్షించారు. మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతూ వారి ఆనందంలో భాగస్వామి కావడం ఎంతో సంతోషంగా ఉందని ఆమె పేర్కొన్నారు. బతుకమ్మ వేడుకలు మహిళల మధ్య ఆత్మీయతను పెంపొందించడమే కాకుండా, సమాజంలో ఐక్యతను చాటిచెబుతాయని అన్నారు. మన పూర్వీకుల నుంచి వారసత్వంగా అందిన ఈ అద్భుతమైన సాంస్కృతిక సంపదను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పిలుపునిచ్చారు.





అనంతరం జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న, ఆయన సతీమణి సౌజన్య ఆడపడుచులతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొని పండుగ ఉత్సాహాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా మహిళలందరూ సంతోషంగా, సురక్షితంగా వేడుకల్లో పాల్గొనేలా అవసరమైన సదుపాయాలను కల్పించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వరంగల్ రంగలీల మైదానంలో పూల పరిమళాలు, సంప్రదాయ పాటలు, ఆడపడుచుల సందడి కలగలిసి తెలంగాణ సంస్కృతీ వైభవాన్ని చాటిచెప్పాయి. బతుకమ్మ పండుగ ప్రతి ఇంటా సిరిసంపదలు, సుఖసంతోషాలు నింపాలని, తెలంగాణ ఆడపడుచుల జీవితాల్లో ఆనందం, ఐక్యత, ఆత్మీయత మరింతగా వికసించాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.

# లింగమయ్య కాలనీలో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

- మాజీ కౌన్సిలర్ సదవు రాణి--మల్లేష్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు

పటాన్‌చేరు, అక్టోబర్ 18 (మీ వార్త ప్రతినిధి):

బీరంగూడ డివిజన్ పరిధిలోని లింగమయ్య కాలనీలో సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ఐక్యతకు, సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మాజీ కౌన్సిలర్ సదవు రాణి--మల్లేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు, మహిళల ఆటపాటలు, చిన్నారుల నృత్య ప్రదర్శనలతో కాలనీ పరిసరాలు పండుగ శోభను సంతరించుకున్నాయి. మహిళలు బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. చిన్నాపెద్దా తేడా లేకుండా అందరూ కలిసి సంబరాలు జరుపుకోవడంతో లింగమయ్య కాలనీలో పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా నిర్వహించిన సాంస్కృతిక



కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా సదవు రాణి--మల్లేష్ మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ఐక్యతకు, సంస్కృతీ సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రత్యేక సంస్కృతిని భావితరాలకు అందించడంతోపాటు చిన్నారుల్లో దాగి ఉన్న కళా ప్రతిభను ప్రోత్సహించాలనే సంకల్పంతో తన సొంత నిధులతో ఈ వేడుకలను నిర్వహించినట్లు తెలిపారు. ప్రజల మధ్య ఐక్యత, సోదరభావం పెంపొందించే ఇలాంటి పండుగలను అందరూ కలిసికట్టుగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు.




అమీన్‌పూర్ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ, మహిళల ఉత్సాహం నడుమ బతుకమ్మ వేడుకలు ఆనందోత్సాహాలతో ముగిశాయి.

# షఫాలీ సునామీ.. స్మృతి మంధాన మెరుపు ఫినిషింగ్

## 8.5 ఓవర్లలోనే జింబాబ్వేపై టీమిండియా విధ్వంసం!

జింబాబ్వేతో రెండో టీ20లో భారత మహిళల జట్టు అదరగొట్టింది. తొలుత బౌలింగ్‌లో ప్రత్యర్థిని కట్టడి చేసిన టీమిండియా.. ఆ తర్వాత బ్యాటింగ్‌లో విధ్వంసం సృష్టించింది. ఓపెనర్లు షఫాలీ వర్మ, స్మృతి మంధాన ఆకాశమే హద్దుగా చెలరేగడంతో స్వల్ప లక్ష్యాన్ని భారత్ కేవలం 8.5 ఓవర్లలోనే ఛేదించింది. షఫాలీ వర్మ 25 బంతుల్లో 55 పరుగులతో విరుచుకుపడగా.. కెప్టెన్ స్మృతి మంధాన 23 బంతుల్లో 40 పరుగులతో మెరిపించింది.

**బౌలింగ్‌లో కట్టడి.. 100 పరుగులకే జింబాబ్వే పరిమితం**

మొదట బ్యాటింగ్ చేసిన జింబాబ్వే మహిళల జట్టు భారత బౌలర్ల ధాటికి నిర్ణీత 20 ఓవర్లలో సుమారు 100 పరుగులకే పరిమితమైంది. ఆ జట్టు బ్యాటర్లలో చిపో ముగేరి-తిరిపానో 32 బంతుల్లో 34 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచింది. జోసెఫిన్ న్కోమో 29 బంతుల్లో 24 పరుగులతో పోరాడింది. అయితే మిగతా బ్యాటర్లు భారీ స్కోరు చేయడంలో విఫలమయ్యారు. భారత బౌలర్లు కీలక సమయాల్లో వికెట్లు తీస్తూ జింబాబ్వేను ఒత్తిడిలోకి నెట్టారు. దీప్తి శర్మ బెలవ్డ్ బిజాను ఔట్ చేయగా.. నందిని శర్మ కూడా వికెట్ సాధించింది. యువ క్రికెటర్ నికి ప్రసాద్ తన అంతర్జాతీయ క్రికెట్‌లో తొలి బంతికే వికెట్ తీసి ఆకట్టుకుంది. చిపో ముగేరి-తిరిపానోను రిచా ఘోష్ క్యాచ్ పట్టడంతో నికి ప్రసాద్‌కు తొలి వికెట్ దక్కింది. అనంతరం నికి ప్రసాద్ మరో వికెట్ సాధించడంతో జింబాబ్వే ఇన్నింగ్స్ మరింత ఒత్తిడిలో పడింది. భారత ఫీల్డర్లు కూడా కీలక పాత్ర పోషించారు. రనౌట్‌తో పాటు క్యాచ్‌ల ద్వారా జింబాబ్వే బ్యాటర్లను పెవిలియన్‌కు పంపారు. దీంతో జింబాబ్వే భారత్ ముందు కేవలం 103 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని మాత్రమే ఉంచగలిగింది.

**ఆరంభం నుంచే షఫాలీ దూకుడు**

స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు షఫాలీ వర్మ, స్మృతి మంధాన అదిరిపోయే ఆరంభాన్ని అందించారు. తొలి ఓవర్




నుంచే షఫాలీ బౌండరీలతో విరుచుకుపడింది. ఆరంభంలోనే ఫోర్, సిక్స్‌తో జింబాబ్వే బౌలర్లపై ఒత్తిడి పెంచింది. మరోవైపు మంధాన ఆచితూచి ఆడుతూ వీలు చిక్కినప్పుడల్లా బౌండరీలు బాదింది. రెండో ఓవర్‌లో మంధాన వరుసగా రెండు ఫోర్లు కొట్టగా.. ఆ తర్వాత షఫాలీ కూడా తనదైన శైలిలో దూకుడు కొనసాగించింది. మూడో ఓవర్‌లో సిక్స్ బాదిన షఫాలీ.. నాలుగో ఓవర్‌లోనూ బౌండరీతో సత్తా చాటింది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య భాగస్వామ్యం వేగంగా పెరిగింది. నాలుగో ఓవర్‌లో మంధాన వరుసగా నాలుగు ఫోర్లు బాదడంతో భారత స్కోరు ఒక్కసారిగా ఊపందుకుంది. ఐదో ఓవర్‌లో షఫాలీ వర్మ వరుస బౌండరీలతో విరుచుకుపడింది. ఆ ఓవర్‌లో నాలుగు ఫోర్లు సహా 21 పరుగులు రావడంతో జింబాబ్వే బౌలర్లు ఒత్తిడికి గురయ్యారు. పవర్‌ప్లే ముగిసే సమయానికి భారత్ వికెట్ నష్టపోకుండా 76 పరుగులు చేసింది. టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో తొలి ఆరు ఓవర్లలో భారత్ సాధించిన అత్యధిక స్కోర్లలో ఈ ప్రదర్శన కూడా చోటు దక్కించుకుంది. జింబాబ్వే బౌలర్లకు ఎక్కడా అవకాశం ఇవ్వకుండా షఫాలీ, మంధాన పరుగుల వరద పారించారు.

**24 బంతుల్లోనే షఫాలీ అర్ధశతకం**

షఫాలీ వర్మ తన విధ్వంసక బ్యాటింగ్‌తో ప్రేక్షకులను అలరించింది. బౌలర్ ఎవరన్నది పట్టించుకోకుండా బంతిని బౌండరీ దాటించడమే లక్ష్యంగా ఆడింది. ఏడో ఓవర్‌లో సిక్స్ బాది కేవలం 24 బంతుల్లోనే అర్ధశతకాన్ని పూర్తి చేసింది. ఆ వెంటనే మరో సిక్స్ కొట్టి జట్టును విజయానికి మరింత చేరువ చేసింది. చివరకు 25 బంతుల్లో 55 పరుగులు చేసిన షఫాలీ.. ఆరు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో ఆకట్టుకుంది. బెలవ్డ్ బిజా బౌలింగ్‌లో లాంగ్‌ఆన్‌లో క్యాచ్ ఇవ్వడంతో ఆమె ఇన్నింగ్స్ ముగిసింది. అప్పటికే భారత్ విజయం దాదాపు ఖాయమైంది. షఫాలీ ఔటైన తర్వాత క్రీజులోకి వచ్చిన అనుష్క శర్మతో కలిసి మంధాన లక్ష్యాన్ని పూర్తి చేసింది.

## జర్నలిస్టులకు సద్దుల బతుకమ్మ,దసరా కానుకగా రూ.10.000లు

- వరంగల్ తూర్పు జర్నలిస్టు పరపతి సంఘం అధ్యక్షుడు కోరుకొప్పుల నరేందర్

మన మీ వార్త అక్టోబర్ 18 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.




వరంగల్ తూర్పు జర్నలిస్ట్ పరపతి సంఘం సబ్యులు వారి కుటుంబాలతో సద్దుల బతుకమ్మ, దసరా పండుగను అత్యంత వైభవంగా నిర్వహించుకునేందుకు..పండుగ కానుకగా ప్రతీ సభ్యుడికి .10.000 వేల రూపాయల చొప్పున వంద మంది సభ్యులకు 10.00.000 లక్షల రూపాయలను అందజేయడం జరిగింది.

ప్రస్తుత కరువు పరిస్థితుల్లో పండుగ జరుపుకోవడం కోసం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని కొందరు సభ్యులు మా దృష్టి కి తీసుకురావడం జరిగింది. సబ్యులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశ్యం తో ..- ఇలాంటి సమయం లోనే సబ్యులకు సంఘం భరోసా ఇవ్వాలనే ఉద్దేశ్యంతో... పండగ కానుకగా పది వేల రూపాయల చొప్పున అందరికీ అందజేయడం జరిగింది. ఈ బృహత్తర కార్యక్రమం సంఘం అధ్యక్షుడిగా నా నేతృత్వంలో జరుగడం చాలా సంతోషంగా ఉంది. నాకు ఈ అవకాశాన్ని కల్పించిన మా సభ్యులందరికీ ఈ సందర్భంగా పేరుపేరున కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను... ఏ సంఘమైన, ఏ సంస్థ అయినా, ఏ యూనియన్ అయినా సభ్యుడి కి అభివృద్ధి, సంక్షేమం కళ్ళ ముందు కనిపించేలా,..దాన్ని వాళ్ళు ఆస్వాదిందిచేలా చేసినప్పుడే అది మనుగడ సాగుతుంది. లేదంటే అవి వాటి ఉనికిని కోల్పోయి కాలగర్భంలో కలిసి పోతాయి. సభ్యుల సహకారం తో వరంగల్ తూర్పు జర్నలిస్ట్ పరపతి సంఘం అధ్యక్షుడి గా నా నాయకత్వం లో గత పదేళ్లుగా అభివృద్ధి, సంక్షేమం రెండు జోడు గుర్రాలపై స్వారీ చేస్తూ ముందుకు సాగుతుంది. అందరికీ ఆదర్శంగా నిలుస్తుంది. అందుకు మా శక్తి మేరకు సంఘం అధ్యక్షుడిగా నేను. నాతో పాటు మా కమిటీ,సభ్యులు మేమంతా కలిసి కట్టుగా కృషి చేస్తున్నాం, ఇకపై చేస్తామని తెలియజేసుకుంటునందుకు నాకు సంతోషంగా ఉందని కోరుకొప్పుల నరేందర్ తెలిపారు.

## ఆఫీస్ అద్దెకు రూ.189 కోట్లు.. జపాన్ కంపెనీ భారీ డీల్!



భారతదేశంలో రియల్ ఎస్టేట్ మార్కెట్ గణనీయంగా అభివృద్ధి చెందుతోంది. దీంతో దేశంలోని ప్రధాన నగరాల్లో ఆఫీసులు లీజుకు తీసుకోవడానికి భారీ మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తోంది. తాజాగా.. జపాన్‌కు చెందిన ఒక కంపెనీ ఏకంగా రూ.189 కోట్ల డీల్ కుదుర్చుకుంది. జపాన్‌కు చెందిన ప్రముఖ బ్యాంకింగ్ సంస్థ సుమిటోమో మిత్సుయ్ బ్యాంకింగ్ కార్పొరేషన్ (ఎస్ఎంబీసీ) ముంబైలో ఆఫీస్ స్థలాన్ని లీజుకు తీసుకుంది. ముంబైలోని బాంద్రా-కుర్లా కాంప్లెక్స్ (బీకేసీ)లో దాదాపు 50 వేల చదరపు అడుగుల కార్యాలయ స్థలాన్ని ఐదేళ్ల కాలానికి అద్దెకు తీసుకుంది. ఈ ఒప్పందం మొత్తం విలువ సుమారు రూ.189 కోట్లు కావడం గమనార్హం. జపాన్‌కు చెందిన సుమిటోమో రియల్టీ అండ్ డెవలప్‌మెంట్ కంపెనీ భారత విభాగమైన గోయిసు రియల్టీ ప్రైవేట్ లిమిటెడ్ ఈ స్థలాన్ని లీజుకు ఇచ్చింది. బీకేసీలోని సుమిటోమో జ65 అనే వాణిజ్య భవనంలో 49,820 చదరపు అడుగుల స్థలాన్ని ఎస్ఎంబీసీ తీసుకుంది.

**ఏడాదికి రూ.41.5 కోట్లు!**

ఈ ఒప్పందం 2026 అక్టోబర్ 6న కుదిరింది. చదరపు అడుగుకు నెలకు రూ.694 చొప్పున అద్దె నిర్ణయించారు. ఈ లెక్కన నెలకు సుమారు రూ.3.46 కోట్లు, ఏడాదికి దాదాపు రూ.41.5 కోట్ల అద్దె చెల్లించాల్సి ఉంటుంది. ఒప్పందం ప్రకారం ప్రతి మూడేళ్లకు అద్దె 15 శాతం పెరుగుతుంది. కాగా.. సెక్యూరిటీ డిపాజిట్ రూ.35.11 కోట్లు. ఈ ఒప్పందంలో తొమ్మిది నెలల అద్దె మినహాయింపు కూడా ఉంది. అంటే ఆ కాలానికి అద్దె చెల్లించాల్సిన అవసరం లేదు. అద్దె చెల్లింపులు 2027 జూన్ నుంచి ప్రారంభం కానున్నాయి. జపాన్‌కు చెందిన సుమిటోమో రియల్టీ సంస్థ భారత్‌లో తన వ్యాపారాన్ని విస్తరిస్తోంది. గతంలో ఇదే సంస్థ అభివృద్ధి చేస్తున్న బీకేసీలోని మరో వాణిజ్య భవనంలో అమెరికాకు చెందిన జేపీ మోర్గాన్ ప్రైవేట్ లిమిటెడ్ 1.16 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని లీజుకు తీసుకుంది. ఇందుకు నెలకు సుమారు రూ.6.91 కోట్ల అద్దె నిర్ణయించారు. ముంబైలోని బీకేసీ దేశంలోనే అత్యంత ఖరీదైన వాణిజ్య ప్రాంతాల్లో ఒకటి. ఇక్కడ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆదాయపు పన్ను శాఖ, జీఎస్టీ కార్యాలయాలు, అమెరికా కాన్సులేట్‌తో పాటు ప్రముఖ హోటళ్లు ఉన్నాయి. గూగుల్, యాపిల్, అమెజాన్, నెట్‌ఫ్లిక్స్, టెస్లా, జియో వంటి పెద్ద కంపెనీలు కూడా ఈ ప్రాంతంలో తమ కార్యాలయాలను నిర్వహిస్తున్నాయి.

## అట్టహాసంగా పారా ఆసియాడ్ ఆరంభం

**ప్రారంభ వేడుకల్లో ర పత్యేక ఆకర్షణగా భారత బృందం**



**నగోయా (జపాన్):** ఐదో ఎడిషన్ పారా ఆసియా క్రీడలు అట్టహాసంగా మొదలయ్యాయి. ఆదివారం జరిగిన ఆరంభ వేడుకల్లో భారత క్రీడాకారులు దేశ సంస్కృతిని ప్రపంచానికి చాటారు. 5 వేల ఏండ్ల నాటి మానవ నాగరికత వారసత్వాన్ని ప్రతిబింబించే ప్రత్యేక బ్లేజర్లను ధరించి మార్చ్‌ఫాస్ట్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పారా షట్లర్ ప్రమోద్ భగత్, పారా స్ప్రింటర్ సిమ్రాన్ శర్మ త్రివర్ణ పతాకాలను చేతబూని జట్టును ముందుండి నడిపించారు. భారత పారా అథ్లెట్లు ధరించిన అధికారిక బ్లేజర్‌లపై సింధు నాగరికత ముద్రలు, ప్రాచీన లిపి నమూనాలు ముద్రించారు. అలాగే కాలర్ భాగంలో సప్తసింధు నదుల ప్రాంతాన్ని స్మరిస్తూ డిజైన్ చేయగా, జేబుపై త్రివర్ణ పతాకాన్ని అలంకరించారు. ఈ క్రీడల్లో భారత్ తరఫున 11 విభాగాల్లో మొత్తం 168 మంది అథ్లెట్లు బరిలోకి దిగారు. ఈనెల 24 వరకు జరిగే ఈ మెగా గేమ్స్‌లో 45 దేశాల నుంచి సుమారు 3వేల మంది పారా అథ్లెట్లు పోటీ పడుతున్నాడు.

## హైదరాబాద్ 275 ఆలౌట్

**విజయవాడ :** ఆంధ్రతో రంజీ ట్రోఫీ రెండో మ్యాచ్‌లో హైదరాబాద్ తక్కువ స్కోరుకే పరిమితం అయింది. ఆదివారం మొదలైన గ్రూప్-బీ మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సిరాజ్‌సేన తొలి ఇన్నింగ్స్‌లో 275 పరుగులకే ఆలౌటైంది. ఓపెనర్లు అభిరథ్ రెడ్డి (67), తన్మయ్ అగర్వాల్ (42) తొలి వికెట్‌కు 109 పరుగులు జోడించి మంచి పునాది వేసినా ఈ జోడీ విడిపోయిన తర్వాత హైదరాబాద్ వరుసగా వికెట్లు కోల్పోయింది.

# సౌదీ అరేబియాలోని భారతీయులకు అలర్ట్

సౌదీ అరేబియాలో భద్రతాపరమైన ఆందోళనలు పెరుగుతున్న నేపథ్యంలో భారత రాయబార కార్యాలయం కీలక సూచనలు జారీ చేసింది. సౌదీ ప్రభుత్వం జారీచేసే మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని భారతీయులకు సూచించింది. ప్రమాదం తొలగిపోయేవరకు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని కిటికీలు, అద్దాలు, బాల్కనీలకు దూరంగా సురక్షితమైన గదుల్లోనే ఉండాలని పేర్కొంది. మక్కా, మదీనా, రియాద్, తూర్పు ప్రావిన్సుల్లో అత్యవసర సహాయం కోసం '911' నంబర్‌కు, మిగతా ప్రాంతాల వారు '998' నంబర్‌కు కాల్ చేయాలని భారత ఎంబసీ సూచించింది. ముఖ్యంగా దాడికి సంబంధించిన ఫోటోలు, వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేయవద్దని భారత ఎంబసీ హెచ్చరించింది.

సౌదీ అధికారులు అత్యవసర హెచ్చరికల కోసం జాతీయ ముందస్తు హెచ్చరిక వేదిక ద్వారా జారీ చేస్తున్న తాజా మార్గదర్శకాలను గమనించాలని, వాటిని తప్పనిసరిగా పాటించాలని ఆదివారం సూచించింది. అత్యవసర హెచ్చరికలు అందినప్పుడు ఆందోళన చెందకుండా ప్రశాంతంగా ఉండాలని సౌదీ అధికారులు సూచించారు. ప్రమాదం తొలగిపోయే వరకు భవనంలోని సురక్షిత ప్రాంతానికి వెంటనే వెళ్లాలని, వీలైతే కిటికీలకు దూరంగా ఉన్న లోపలి గదిలో ఉండాలని తెలిపారు. ప్రమాదం ముగిసే వరకు ఇళ్లను లేదా భవనాలను విడిచి బయటకు రావద్దని, బహిరంగ ప్రదేశాలు, కిటికీలు, అద్దాలకు దూరంగా ఉండాలని సూచించారు. బాల్కనీలు, భవనాల పైకప్పులపై నిలబడకూడదని స్పష్టం చేశారు.



**బయట ఉంటే ఏం చేయాలి?**

హెచ్చరికలు వచ్చిన సమయంలో బయట ఉన్నవారు సమీపంలోని భవనంలోకి వెళ్లాలని లేదా బలమైన రక్షణ కల్పించే గోడ వంటి నిర్మాణం వెనుక ఆశ్రయం పొందాలని సూచించారు. జనసమూహాలు, ప్రమాదకర ప్రాంతాలకు దూరంగా ఉండాలని, ఘటనలకు సంబంధించిన ఫొటోలు తీయడం మానుకోవాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. వాహనం నడుపుతున్న సమయంలో అత్యవసర హెచ్చరిక అందితే వంతెనలు, ఎత్తైన భవనాలకు దూరంగా రహదారి పక్కన వాహనాన్ని నిలిపివేయాలని సూచించారు. అధికారుల నుంచి తదుపరి సమాచారం వచ్చే వరకు వారి సూచనలను పాటించాలని తెలిపారు.

**అత్యవసర నంబర్లు ఇవే**

ప్రమాదం లేదా ముప్పు ఎదురైనప్పుడు సౌదీ అరేబియాలోని మక్కా, మదీనా, రియాద్, తూర్పు ప్రావిన్స్ ప్రాంతాల్లో 911 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. మిగతా ప్రాంతాల్లో అత్యవసర సహాయం కోసం 998 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు. ప్రభుత్వ అధికారిక మార్గాల ద్వారా వెలువడే ప్రకటనలు, సూచనలను మాత్రమే అనుసరించాలని భారత రాయబార కార్యాలయం భారతీయులకు విజ్ఞప్తి చేసింది.

**రియాద్ విమానాశ్రయంపై దాడితో ఆందోళనలు**

యెమెన్‌కు చెందిన హౌతీ తిరుగుబాటుదారులు సౌదీ అరేబియాపై డ్రోన్లు, క్షిపణులతో దాడులు చేస్తున్న నేపథ్యంలో భద్రతాపరమైన ఆందోళనలు పెరిగాయి. అక్టోబర్ 10న రియాద్‌లోని కింగ్ ఖాలిద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై జరిగిన ప్రాణాంతక దాడిలో ఓ భారతీయుడు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. ఈ ఘటనతో భారత రాయబార కార్యాలయం మరోసారి భద్రతా సూచనలు జారీ చేసింది.

**హూతీలకు సౌదీ హెచ్చరిక**

మరోవైపు తమ విమానాశ్రయాలతోపాటు ఓడరేవులు, చమురుకేంద్రాలు, పౌర సదుపాయాలపై తక్షణమే దాడులు నిలిపివేయాలని హూతీ రెబల్స్‌కు సౌదీ హెచ్చరిక చేసింది. రియాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కూటమి అధికార ప్రతినిధి మేజర్ జనరల్ తుర్కీ అల్-మల్కీ ఈ మేరకు హెచ్చరిక చేశారు. అభా, నజ్రాన్, జాజాన్ విమానాశ్రయాలపై హూతీలు చేసిన దాడుల వీడియోలను మీడియా ముందు ప్రదర్శించారు. సౌదీలోని విమానాశ్రయాలపై జరిగిన వరుస దాడుల్లో 19మంది ప్రాణాలు కోల్పోగా, 364మంది గాయపడినట్లు అధికారులు వెల్లడించారు. యెమెన్ పౌరులకు హాని జరగకుండా హూతీల సైనిక స్థావరాలనే తమ బలగాలు దాడులు చేస్తున్నట్లు సౌదీ కూటమి మేజర్ జనరల్ తెలిపారు.

# ఓట్ల చోరీకి పాల్పడుతున్న వారికి శిక్ష తప్పదు

ఓట్లచోరీకి పాల్పడుతున్న ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జజుజ జ్ఞానేశ్ కుమార్ త్వరలోనే చట్టం ముందు నిలవాల్సి వస్తుందని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. వారు తమ తప్పులకు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. గోవాలోని మర్గావ్‌లో జరిగిన కాంగ్రెస్ గోయ్ రఖోన్ యాత్రలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. కాంగ్రెస్ శ్రేణులతో కలిసి 2కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించిన రాహుల్ జ్ఞానేశ్ కుమార్ ఓట్ల చోరీకి పాల్పడుతుంటే మోదీ, అమిత్ షా ఆయనకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ రాజ్యాంగాన్ని పరిరక్షించే శక్తి అని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మోదీ, షా, జ్ఞానేశ్ కుమార్‌లను వదిలిపెట్టేది లేదని రాహుల్ గాంధీ తేల్చిచెప్పారు. "ఓటు చోరీ విషయంలో ఇక ఎలాంటి సందేహాలకు తావులేదు. మోదీ తెరవెనుక ప్రణాళికలు రచిస్తే, అమిత్ షా వాటిని నిర్వహిస్తున్నారు. సీఈసీ అమలు చేస్తున్నారు. మోదీ, అమిత్ షా, జ్ఞానేశ్ కుమార్ మా నుంచి తప్పించుకోలేరు. రాజ్యాంగాన్ని పరిరక్షించే బాధ్యత కాంగ్రెస్‌పై ఉంది. నాపై 45కు పైగా పరువునష్టం కేసులు ఉన్నాయి. వాటిలో మోదీ, అమిత్ షాలకు సంబంధించిన వ్యక్తులు దాఖలు చేసిన కేసులే ఉన్నాయి. అయితే, ప్రధానమంత్రి ఓటు చోరీకి పాల్పడ్డారని నా ఆరోపణపై ఇప్పటివరకు కేసు నమోదు కాలేదు. ఈ అంశంపై కేసు పెడితే అది పూర్తిస్థాయి న్యాయపరమైన వ్యవహారంగా మారుతుందనే భయంతోనే వెనుకడుగు వేస్తున్నారు. మధ్యప్రదేశ్, హరియాణా, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, బంగాల్?, అసోంలలో ఓటు చోరీ జరిగిందని



ఆధారాలతో సహా నిరూపించాం. ప్రతిపక్షాలకు చెందిన ఓట్లను తొలగించడం, అధికార పార్టీకి అనుకూలంగా ఓట్లు చేర్చారు. ఓటర్లను ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు మార్చారు. ఇతర రాష్ట్రాల నుంచి ఓటర్లను తీసుకురావడం వంటి అక్రమాలు జరిగాయి. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత మాపై ఉంది"

**'అదానీ, అంబానీలకు ప్రయోజనాలు'**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కొందరు పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని రాహుల్ ఆరోపించారు. గౌతమ్ అదానీ, ముఖేశ్ అంబానీలకు మేలు చేకూర్చేలా మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, భూములు, ఇతర ఆర్థిక అవకాశాలను కట్టబెడుతున్నారని విమర్శించారు. ప్రతిఫలంగా ఆయా పారిశ్రామికవేత్తలు ప్రభుత్వానికి ప్రచారం కల్పిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం కొందరు బిలియనీర్లకు డబ్బు, కాంట్రాక్టులు, భూములు అందిస్తూ, వారి ద్వారా రాజకీయ ప్రచార ప్రయోజనాలు పొందుతోందని వ్యాఖ్యానించారు. దేశంలో ప్రభుత్వ వ్యవస్థ పనిచేస్తున్న తీరుపై ప్రశ్నలు లేవనెత్తారు.

**'గోవాలో భూములు లాక్కుంటున్నారు'**

గోవాలో రైతులు, పేదలకు చెందిన భూములను ప్రభుత్వం లాక్కొని బయటి వ్యక్తులకు అప్పగిస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రాంతీయ మాస్టర్ ప్లాన్ రద్దు నేపథ్యంలో ప్రభుత్వానికి సన్నిహితులైన వారికి భూములు కట్టబెట్టే పరిస్థితులు ఏర్పడ్డాయని విమర్శించారు. రాష్ట్ర సహజ సంపద, సాంస్కృతిక వారసత్వాన్ని ఆర్థిక ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. దేశంలో అత్యధిక నిరుద్యోగం ఉన్న రాష్ట్రంగా గోవా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. ఉపాధి అవకాశాలు లేక యువత విదేశాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఉద్యోగ కల్పన వ్యవస్థను బీజేపీ ప్రభుత్వం దెబ్బతీసిందని విమర్శించారు. గతంలో నరేంద్ర మోదీ హయాంలో గుజరాత్ నమూనా గురించి మాట్లాడేవారని, ఇప్పుడు గోవాలో అవినీతి నమూనా కనిపిస్తోందని వ్యాఖ్యానించారు

**'యువతను వెలివేసే వ్యవస్థ'**

దేశంలోని విద్యా వ్యవస్థపై కూడా రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. డబ్బు అధికారం లేనివారిని, ఆంగ్లంలో మాట్లాడలేని వారిని ప్రస్తుత వ్యవస్థ పక్కన పెడుతోందని విద్యార్థులతో తన సంభాషణకు సంబంధించిన వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. లక్షలాది మంది భారతీయ యువతకు విద్యా అవకాశాలు దక్కకుండా చేసే విధానాన్ని విద్యా వ్యవస్థగా పిలవలేమని వ్యాఖ్యానించారు.

# మా తీర్పు కాగితాలకే పరిమితం కావాలా?

రుతుక్రమ ఆరోగ్యాన్ని (బహిష్టు పరిశుభ్రత) ప్రాథమిక హక్కులో భాగంగా గుర్తిస్తూ ఇచ్చిన తీర్పు అమలుపై రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు స్పందించకపోవడంపై సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కేంద్ర ప్రభుత్వం కోరినప్పటికీ ఇప్పటివరకు అవసరమైన వివరాలు అందించకపోవడంపై ప్రశ్నించింది. తదుపరి విచారణ నాటికి కూడా స్పందించకపోతే, ఆయా రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించింది. జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం అక్టోబర్ 13న ఈ అంశంపై విచారించింది. బహిష్టు ఆరోగ్యానికి సంబంధించిన ప్రాథమిక హక్కు తీర్పు కేవలం కాగితాలకే పరిమితం కాకూడదని స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛకు రక్షణ కల్పిస్తుందని ధర్మాసనం గుర్తుచేసింది. రుతుక్రమ పరిశుభ్రత, ఆరోగ్యం కూడా ఈ హక్కులో భాగమని సుప్రీం కోర్టు ఇప్పటికే ప్రకటించిందని తెలిపింది. సెప్టెంబర్ 1న ఇచ్చిన ఆదేశాల్లో తీర్పులో ప్రస్తావించిన లోపాల్ని పరిశీలించి, వాటిపై తీసుకున్న చర్యల వివరాల్ని తదుపరి విచారణకు సమర్పించాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించినట్లు బెంచ్ గుర్తుచేసింది. అయినా కేంద్రం కోరిన సమాచారం ఇవ్వకపోవడంపై కోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కోర్టు తీర్పులో చెప్పిన అంశాలు కేవలం కాగితాలపైనే ఉంటే, ఈ ప్రాథమిక హక్కును కేంద్రం, రాష్ట్రాలు ఎలా అమలు చేస్తాయని ప్రశ్నించింది.



**తీర్పు ప్రాముఖ్యతను అర్థం చేసుకోండి- డిసెంబర్ 14 డెడ్‌లైన్**

కేంద్ర ప్రభుత్వం తరపున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి- ఈ అంశాన్ని కేంద్రం తీవ్రంగా పరిగణిస్తోందని, తీర్పు అమలు తీరుపై వివరాలు ఇవ్వాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్ని కోరినట్లు తెలిపారు. అయితే ఇప్పటివరకు స్పందన రాలేదని ఆమె కోర్టుకు వివరించారు. దీనిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ధర్మాసనం- కేంద్రం కోరినా రాష్ట్రాలు ఎందుకు స్పందించడం లేదో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించింది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తమ తీర్పు ప్రాముఖ్యతను గుర్తించాయని భావిస్తున్నట్లు తెలిపిన ధర్మాసనం- ఆయా రాష్ట్రాలు తీసుకున్న చర్యలకు లిఖితపూర్వక వివరాలు సేకరించాలని కేంద్రాన్ని ఆదేశించింది. తదుపరి విచారణ సమయంలోనూ కొన్ని రాష్ట్రాలైనా స్పందించలేదని కేంద్రం చెబితే, సంబంధిత రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించింది. చివరిసారిగా అవకాశం ఇస్తూ కేసు విచారణను డిసెంబర్ 14 కు వాయిదా వేసింది. 'మేం తీర్పులో చెప్పిన విషయాలు కేవలం కాగితాలకే పరిమితమైతే, కేంద్రం, రాష్ట్రాలు ఈ ప్రాథమిక హక్కును చిన్నారి బాలికలకు ఎలా అందిస్తాయి? సుదూర ప్రాంతాల్లో రుతుస్రావ పరిశుభ్రత సదుపాయాలు లేక చదువుకు దూరమవుతున్న వేలాది మంది బాలికల సంక్షేమం కోసం ఈ తీర్పు ఇచ్చామని గుర్తించాలి.' అని సుప్రీంకోర్టు తెలిపింది.

**పాఠశాలల్లో బాలికల సమస్యలపై దృష్టి**

రుతుక్రమ పరిశుభ్రత సమస్యల కారణంగా, సరైన సదుపాయాలు లేనందున ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లోని బాలికలు చదువును మధ్యలోనే మానేస్తున్నారని సుప్రీం కోర్టు పేర్కొంది. అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చూడటమే తీర్పు ప్రధాన ఉద్దేశాల్లో ఒకటని తెలిపింది. సెప్టెంబర్ 1న ఇచ్చిన ఆదేశాల్లో పాఠశాలల్లో బాలురు, బాలికలకు వేర్వేరుగా ఉండే మరుగుదొడ్లు ఎన్ని ఉన్నాయనే దానితో పాటు, అవి సరిగా ఉన్నాయా లేదా అనే అంశంపై దృష్టి పెట్టాలని స్పష్టం చేసింది. ఇంకా మరుగుదొడ్లకు నీటి సౌకర్యం సరిగా ఉందా లేదా, బాలికలకు ప్రైవసీ, సులభంగా అక్కడికి చేరుకునే సౌకర్యాలు ఉన్నాయో లేదో పరిశీలించాలని ఆదేశించింది. దేశవ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో బాలబాలికలకు విడివిడిగా నీటి సదుపాయం కలిగిన 30458 మరుగుదొడ్లను ఇప్పటికే నిర్మించామని కేంద్ర ప్రభుత్వం గతంలోనే అత్యున్నత న్యాయస్థానానికి తెలియజేసింది. ఇంకా 4236 మరుగుదొడ్ల నిర్మాణం తుది దశలో ఉందని పేర్కొంది. ఇక అంతకుముందు ఈ ఏడాది జనవరి 30న కీలక తీర్పులో కూడా సుప్రీం కోర్టు పలు ఆదేశాలు జారీ చేసింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లు అన్నింట్లోనూ నీటి సౌకర్యంతో కూడిన, వేర్వేరు మరుగుదొడ్లు ఉండాలని స్పష్టం చేసింది. అలానే ప్రతి పాఠశాలలో బాలికలకు శానిటరీ న్యాప్‌కిన్లను ఉచితంగా అందించాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. వీటి అమలు తీరుపైనే రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి వివరాలు కోరింది.

## సీఈసీని ఎవరూ కాపాడలేరు

రాజకీయ పార్టీలకు డిజిటల్, ప్రింట్ రూపాల్లో చదవగలిగే (రీడబుల్), శోధించగలిగే (సర్చబుల్) రూపాల్లో ఓటర్ల జాబితాలను అందించాలని ఎన్నికల సంఘం నిర్ణయించడంపై కాంగ్రెస్ పార్టీ స్పందించింది. ఓట్ల దొంగలకు వ్యతిరేకంగా దేశమంతా రోడ్లపైకి వచ్చి పోరాడినదానికి ఫలితంగానే ఈ విజయం దక్కిందని కాంగ్రెస్ ఆదివారం వ్యాఖ్యానించింది. ఇదే సమయంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవి నుంచి తప్పుకోవాలని, ఇంకా వివాదాస్పద ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను తక్షణమే నిలిపి వేయాలన్న తమ డిమాండ్లను పార్టీ మరోసారి గట్టిగా వినిపించింది. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జ్ జైరాం రమేశ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. గత రెండు సంవత్సరాలుగా లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ- ఎన్నికల సంఘాన్ని ఓటర్ల జాబితాలను సెర్చ్ చేయగలిగే రూపంలో అన్ని రాజకీయ పార్టీలకు అందించాలని నిరంతరం కోరుతున్నారని జైరాం రమేశ్ గుర్తుచేశారు. 2018లో మధ్యప్రదేశ్‌లో లక్షలాది బోగస్ ఓటర్లను కాంగ్రెస్ గుర్తించిన తర్వాత ఎన్నికల సంఘం సెర్చ్ చేయగలిగే ఓటర్ల జాబితాలను అందించడం పూర్తిగా నిలిపివేసిందని ఆయన ఆరోపించారు. అప్పటి నుంచి 8 ఏళ్ల పాటు తాము డిమాండ్లు చేస్తున్నా, వాటిని పట్టించుకోవడం లేదని, దీని వల్లనే ఓట్ చోరీకి అవకాశం ఏర్పడిందని విమర్శించారు.

**ఓటర్ల జాబితాలపై ఈసీ కీలక నిర్ణయం**

2026, అక్టోబర్ 15న ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు జారీ చేసిందని జైరాం రమేశ్ తెలిపారు. రెండేళ్ల విరామం తర్వాత 17 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో తిరిగి ప్రారంభమైన ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్ ప్రక్రియ కోసం రాజకీయ పార్టీలకు సెర్చ్ చేయగలిగే రూపంలో ఓటర్ల జాబితాలను అందించాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. దేశవ్యాప్తంగా ఓట్ల చోరీకి వ్యతిరేకంగా ప్రజలు నిరసనలు తెలియజేస్తున్న నేపథ్యంలోనే ఈసీ నుంచి ఈ ప్రకటన వచ్చిందని వ్యాఖ్యానించారు. ప్రతిసారీ ఓట్ల చోరీ ఆరోపణలు బయటపడినప్పుడు కేంద్ర ప్రభుత్వం ఏదో ఒక కొత్త విధానాలను అనుసరిస్తోందని జైరాం రమేశ్ విమర్శించారు. చదవగలిగే ఓటర్ల జాబితాలను నిలిపివేయడం, నకిలీ ఓటర్లను చేర్చడం, సర్ ప్రక్రియ వంటివి ఈ కోవలోకే వస్తాయని స్పష్టం చేశారు. ఈసారి మాత్రం అలా కుదరదని హెచ్చరించారు.

**రిస్క్‌లో 13 కోట్లకుపైగా ఓట్లు- సీఈసీ తప్పుకోవాల్సిందే**

ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా సూచనల మేరకు నడుచుకుంటూ జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల సంఘంపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని దెబ్బతీశారని జైరాం రమేశ్ ఈ సందర్భంగా ఆరోపించారు. ఆయన ఎట్టి పరిస్థితుల్లోనూ తన పదవి నుంచి తప్పుకోవాల్సిందేనని డిమాండ్ చేశారు. సీఈసీ రాజీనామాతోనే సమస్య పరిష్కారం కాదని, ఎన్నికల సంఘం వ్యవస్థను, దాని ఐటీ వ్యవస్థను కూడా సమూలంగా పునర్వ్యవస్థీకరించాలనేదే కాంగ్రెస్ డిమాండ్ అని వెల్లడించారు. సర్ ప్రక్రియ వల్ల సుమారు 13 కోట్ల మందికిపైగా భారతీయుల ఓటు హక్కు ప్రమాదంలో పడిందని రమేశ్ పేర్కొన్నారు. అందుకే ఈ ప్రక్రియను వెంటనే నిలిపివేయాల్సిందిగా కోరారు.

**17 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎస్ఎస్ఆర్**

మరోవైపు ఎన్నికల సంఘం ఇటీవల 17 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ప్రతి ఏటా నిర్వహించే ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (రూ=) చేపట్టాలని నిర్ణయించింది. ఎస్ఐఆర్‌తో దీనికి సంబంధం లేదు. వచ్చే ఏడాది ప్రారంభంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలు కూడా ఇందులో కొన్ని ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో ఓటరు జాబితా మార్పు చేర్పులు చేసి తుది జాబితాను జనవరి 4న ప్రచురించనున్నారు. ఎస్ఎస్ఆర్ అనేది ఎన్నికల సంఘం ఏటా నిర్వహించే సాధారణ ప్రక్రియ అని ఒక సీనియర్ అధికారి వివరించారు. ముఖ్యంగా ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో దీనిని చేపడతారని తెలిపారు. ఈ 17 రాష్ట్రాలు, యూటీల్లో సర్ ప్రకియ ఇప్పటికే పూర్తయిందని చెప్పుకొచ్చారు. ఈ ఎస్ఎస్ఆర్ ప్రక్రియలో భాగంగానే తొలిసారిగా రాజకీయ పార్టీలకు డ్రాఫ్ట్, తుది ఓటర్ల జాబితాలను చదవగలిగే రూపంలో హార్డ్ కాపీలు, సాఫ్ట్ కాపీల రూపంలో అందించనుంది ఈసీ. ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో అభ్యర్థులకు కూడా ఈ జాబితాల్ని అందించాలని నిర్ణయించింది.

## భారత్‌లో 11 లక్షలకుపైగా ఉపాధ్యాయులు కొరత

ప్రపంచవ్యాప్తంగా నాణ్యమైన విద్యను అందించడంలో ఉపాధ్యాయుల కొరత ప్రధాన అడ్డంకిగా మారుతోంది. ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల ప్రకారం 2030 నాటికి పిల్లలందరికీ ప్రాథమిక, మాధ్యమిక విద్యను అందించడం, తక్కువ ఖర్చులో ఉన్నత విద్యను కల్పించడం, ఉపాధి అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలను అందించాలి. అయితే యునెస్కో ఇటీవల విడుదల చేసిన 'గ్లోబల్ రిపోర్ట్ ఆన్ టీచర్స్' నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఉపాధ్యాయుల కొరత ఈ విద్యావ్యవస్థను కుదిపేస్తోంది. ప్రీ ప్రైమరీ నుంచి సెకండరీ స్థాయి వరకు ప్రతి చిన్నారికి మెరుగైన విద్య అందించాలంటే 2030 నాటికి మరో 5 కోట్ల మంది ఉపాధ్యాయులు అవసరం అని నివేదికలో వెల్లడించింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సుమారు 10.7 కోట్ల మంది ఉపాధ్యాయులు పనిచేస్తుండగా, ప్రతి ఇద్దరు ఉపాధ్యాయులకు అదనంగా మరో ఉపాధ్యాయుడు అవసరమయ్యే పరిస్థితి ఉందని నివేదిక పేర్కొంది.

**ఉపాధ్యాయుల నియామకానికి ఏటా రూ.10.14 లక్షల కోట్లు**

ఉపాధ్యాయుల కొరతను అధిగమించడానికి కొత్త నియామకాలు చేపట్టడం, ఖాళీలను భర్తీ చేయడం, వేతనాలు చెల్లించడం వంటి వాటికి భారీగా నిధులు అవసరం అవుతాయని యునెస్కో నివేదిక తెలిపింది. 2030 నాటికి విద్య లక్ష్యాల్ని చేరుకోవాలంటే ప్రపంచవ్యాప్తంగా ఏటా సుమారు రూ. 10.14 లక్షల కోట్ల నిధులు అవసరం అని అంచనా వేసింది. ఉపాధ్యాయుల కొరత కారణంగా ప్రస్తుతం ఆ వృత్తిలో ఉన్న వారిపై పనిభారం పెరుగుతోంది. దీని వల్ల విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ తగ్గడం, బోధనలో నాణ్యత దెబ్బతినడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. పేద దేశాలు, ముఖ్యంగా సబ్-సహారా ఆఫ్రికా ప్రాంతంలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని యునెస్కో నివేదిక వెల్లడించింది. నైజీరియా, ఘనా, కాంగో రిపబ్లిక్, కామెరూన్, కెన్యా, జింబాబ్వే, మొజాంబిక్, జాంబియా వంటి దేశాలతో కూడిన సబ్ సహారా ఆఫ్రికా ప్రాంతంలో ప్రాథమిక విద్యకు 2030 నాటికి అత్యధికంగా 43.91 లక్షల మంది ఉపాధ్యాయులు అవసరం అవుతారని అంచనా వేసింది. ఇంకా మయన్మార్, ఇండోనేసియా, మలేసియా వంటి దేశాలు ఉన్న ఆగ్నేయాసియా ప్రాంతంలో మరో 30.50 లక్షల మంది ఉపాధ్యాయులు అవసరమని పేర్కొంది.

**సెకండరీ ఎడ్యుకేషన్‌కు 3.11 కోట్ల మంది కొత్త టీచర్లు**

9, 10 తరగతుల విద్యార్థులకు మెరుగైన విద్య అందించడానికి ప్రపంచవ్యాప్తంగా 2030 నాటికి సుమారు 3.11 కోట్ల మంది కొత్త ఉపాధ్యాయులు అవసరమవుతారని నివేదిక తెలిపింది. ఈ సెకండరీ విద్యకు సంబంధించి సబ్ సహారా ఆఫ్రికా దేశాలకు 1.06 కోట్ల మందికిపైగా ఉపాధ్యాయులు అవసరం. భారత్‌తో పాటు ఇతర దేశాలు ఉన్న దక్షిణాసియాకు 67.16 లక్షల మంది, మధ్య ఆసియాకు 6.51 లక్షల మంది కొత్త ఉపాధ్యాయులు అవసరం అని అంచనా వేసింది. కొత్తగా నియమించాల్సిన ఉపాధ్యాయుల్లో 58 శాతం మంది ఇప్పటికే వృత్తిలో ఉన్న వారు ఉద్యోగాలు వదిలి వెళ్లడం వల్ల ఏర్పడే ఖాళీలను భర్తీ చేసేందుకే అవసరం అవుతాయని యునెస్కో తెలిపింది. తక్కువ వేతనాలు, అధిక పనిభారం, వృత్తిపరంగా తగినంత గౌరవం లేకపోవడం వంటి అంశాలు ఉపాధ్యాయులు ఉద్యోగాలు వదిలివెళ్లడానికి కారణాలుగా నివేదిక ప్రస్తావించింది. 2024లో ఒక సర్వే ప్రకారం ప్రపంచంలోని 75 శాతం దేశాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల్లో 40 శాతం కంటే తక్కువ మంది మాత్రమే తమ వృత్తికి సమాజంలో గౌరవం ఉందని భావిస్తున్నారు. వృత్తికి గౌరవం లభిస్తున్నప్పుడు ఉపాధ్యాయులు వచ్చే ఐదేళ్లలో ఉద్యోగాన్ని వదిలే అవకాశం 10 శాతానికిపైగా తగ్గుతుందని నివేదిక పేర్కొంది. వివిధ దేశాల్లో ఉపాధ్యాయులకు అందుతున్న నెలవారీ వేతనాల్ని కూడా యునెస్కో రిపోర్ట్ పోల్చింది. 2015 డాలర్ విలువ ఆధారంగా, 2023 గణాంకాల ప్రకారం ఖతార్‌లో ఉపాధ్యాయులకు నెల జీతం సుమారు రూ. 97,164 గా ఉంది. నేపాల్‌లో ఇది రూ. 26321 గా ఉంది. భారత్‌కు సంబంధించి 2019 డేటా ప్రకారం ఉపాధ్యాయుల సగటు నెల వేతనం రూ. 25,232 గా ఉంది. ఇక్కడ కూడా 40 శాతం దేశాల్లో ఉపాధ్యాయులకు వారి అర్హతలకు తగిన వేతనాలు అందట్లేదని నివేదిక గుర్తించింది.

**భారత్‌లో 11 లక్షలకుపైగా ఉపాధ్యాయుల కొరత**

భారత్‌లోని స్కూళ్లలో ప్రీ ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు 11 లక్షలకుపైగా ఉపాధ్యాయుల కొరత ఉందని యునెస్కో గత నివేదిక తెలిపింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉందని తెలిపింది. యూపీ, మధ్యప్రదేశ్, బిహార్, రాజస్థాన్, కర్ణాటక రాష్ట్రాల్లో టీచర్ల కొరత ఎక్కువగా ఉన్నట్లు వివరించింది.

# యూనివర్సిటీల్లో ఖాళీల భర్తీకి అడుగు

-మొదటిపేజీ తరువాయి

వ్యక్తమవుతోంది. నియామక ప్రకటనలు జారీ చేసేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించినట్లు సమాచారం.

**ఏడు విశ్వవిద్యాలయాల్లో పోస్టుల భర్తీ**

రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ క్రమంలో మొత్తం ఏడు విశ్వవిద్యాలయాలకు సంబంధించి 429 పోస్టులకు అనుమతి లభించింది. వీటిలో అత్యధికంగా హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 252 పోస్టులు ఉన్నాయి. కాకతీయ, శాతవాహన విశ్వవిద్యాలయాల్లో చెరో 49 పోస్టులు, పాలమూరు విశ్వవిద్యాలయంలో 45 పోస్టులు భర్తీ చేయనున్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయాల్లో చెరో 16 పోస్టులు, తెలంగాణ విశ్వవిద్యాలయంలో రెండు పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించారు. విశ్వవిద్యాలయాల వారీగా పోస్టుల సంఖ్యను పరిశీలిస్తే, ఉస్మానియా యూనివర్సిటీకి అత్యధిక ప్రాధాన్యం లభించినట్లు స్పష్టమవుతోంది. రాష్ట్రంలోని ఇతర ప్రధాన విశ్వవిద్యాలయాల్లోనూ నియామకాలకు అవకాశం కల్పించడం ద్వారా బోధనా సిబ్బంది కొరతను తగ్గించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

యూనివర్సిటీల వారీగా పోస్టుల వివరాలు
ఉస్మానియా విశ్వవిద్యాలయం: 252 పోస్టులు
కాకతీయ విశ్వవిద్యాలయం: 49 పోస్టులు
శాతవాహన విశ్వవిద్యాలయం: 49 పోస్టులు
పాలమూరు విశ్వవిద్యాలయం: 45 పోస్టులు
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ: 16 పోస్టులు
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం: 16 పోస్టులు
తెలంగాణ విశ్వవిద్యాలయం: 2 పోస్టులు
మొత్తం పోస్టులు: 429

ఉస్మానియా యూనివర్సిటీపై ప్రత్యేక దృష్టి

హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం రాష్ట్రంలోనే అత్యధికంగా 252 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయనుంది. మొత్తం ప్రకటించిన పోస్టుల్లో సగానికి పైగా ఈ ఒక్క విశ్వవిద్యాలయానికే కేటాయించడం గమనార్హం. దీర్ఘకాలంగా అధ్యాపక నియామకాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు ఈ నిర్ణయం ప్రాధాన్యంగా మారింది.

విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుల నియామకాలు విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. అధ్యాపకుల కొరత ఉన్న విభాగాల్లో సిబ్బంది అందుబాటులోకి వస్తే బోధన, పరిశోధన, విద్యార్థుల విద్యా ప్రగతికి మేలు జరిగే అవకాశం ఉంటుంది. అయితే, ఏ విభాగంలో ఎన్ని పోస్టులు ఉన్నాయనే పూర్తి వివరాలు సంబంధిత నియామక ప్రకటనల్లో వెల్లడయ్యే అవకాశం ఉంది.

**ఉన్నత విద్యారంగానికి ఊతం**

ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు ఉన్నత విద్యను సామాన్యులకు అందుబాటులోకి తీసుకురావడంలో కీలకమైనవి. గ్రామీణ ప్రాంతాలు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల నుంచి వచ్చే అనేక మంది విద్యార్థులకు ప్రభుత్వ విశ్వవిద్యాలయాలే ఉన్నత విద్యకు ప్రధాన ఆధారం. ఇలాంటి సంస్థల్లో బోధనా సిబ్బంది కొరత తగ్గితే విద్యార్థులకు తరగతులు సక్రమంగా నిర్వహించడంతో పాటు పరిశోధనా కార్యక్రమాలకు కూడా ప్రోత్సాహం లభించవచ్చు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు విశ్వవిద్యాలయాల్లో బోధనతో పాటు పరిశోధన, విద్యార్థులకు మార్గదర్శకత్వం, విద్యా ప్రమాణాల మెరుగుదల వంటి బాధ్యతలను నిర్వహిస్తారు. కొత్త నియామకాలతో ఈ విభాగాల్లో సానుకూల మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. ముఖ్యంగా ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఈ ప్రకటన ఆశలు కల్పిస్తోంది.

**నోటిఫికేషన్ల కోసం అభ్యర్థుల ఎదురుచూపులు**

ప్రభుత్వం పోస్టుల భర్తీకి అనుమతి ఇచ్చిన నేపథ్యంలో తదుపరి దశలో నియామక ప్రకటనల జారీ, అర్హతల నిర్ధారణ, దరఖాస్తుల స్వీకరణ, ఎంపిక ప్రక్రియ వంటి అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. ఏ విశ్వవిద్యాలయం ఎప్పుడు నోటిఫికేషన్ విడుదల చేస్తుంది? ఏయే సబ్జెక్టుల్లో ఖాళీలు ఉన్నాయి? దరఖాస్తుకు అవసరమైన విద్యార్హతలు ఏమిటి? వయోపరిమితి, రిజర్వేషన్లు, ఎంపిక విధానం ఎలా ఉంటాయి? అనే అంశాలపై అభ్యర్థులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే, ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారంలో దరఖాస్తుల ప్రారంభ తేదీ, చివరి తేదీ, పరీక్ష లేదా ఇంటర్వ్యూ విధానం, సబ్జెక్టుల వారీగా ఖాళీల పూర్తి వివరాలు వెల్లడికాలేదు. కాబట్టి అభ్యర్థులు అధికారిక నియామక ప్రకటనలు వెలువడిన తర్వాతే తుది వివరాలను పరిశీలించాలి.

**అభ్యర్థులు ఇప్పటి నుంచే సిద్ధం కావాలి**

అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు దరఖాస్తు చేయాలనుకునే అభ్యర్థులు తమ విద్యార్హతలు, సంబంధిత సబ్జెక్టులో సాధించిన మార్కులు, పరిశోధనకు సంబంధించిన పత్రాలు, ఇతర అవసరమైన ధ్రువపత్రాలను ముందుగానే సిద్ధం చేసుకోవడం మంచిది. సంబంధిత విశ్వవిద్యాలయం లేదా నియామక సంస్థ ప్రకటించే అర్హత ప్రమాణాలను జాగ్రత్తగా పరిశీలించాలి. అన్ని పోస్టులకు ఒకే అర్హతలు వర్తిస్తాయని భావించకుండా, సబ్జెక్టు మరియు పోస్టును బట్టి నిబంధనలను నిర్ధారించుకోవాలి. ప్రభుత్వ అనుమతి తర్వాత నియామక ప్రక్రియ వేగవంతమైతే ఉన్నత విద్యారంగంలో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు ప్రయోజనం కలిగే అవకాశం ఉంది. అధికారిక నోటిఫికేషన్ల విడుదల, ఎంపిక ప్రక్రియ పూర్తి కావడం వంటి తదుపరి పరిణామాలపైనే ఇప్పుడు అందరి దృష్టి నెలకొంది. మొత్తంగా, తెలంగాణలో 429 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతి ఇవ్వడం నిరుద్యోగ అభ్యర్థులకు కీలక పరిణామం. నోటిఫికేషన్లు వెలువడిన తర్వాత పూర్తి అర్హతలు, దరఖాస్తు తేదీలు, ఎంపిక విధానంపై స్పష్టత రానుంది.

# అంబరాన్నంటిన సంబురాలు..

-మొదటిపేజీ తరువాయి

రాష్ట్ర ప్రజల్లో ప్రత్యేక ఉత్సాహాన్ని నింపాయి. సంప్రదాయ వస్త్రధారణలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మలను అందంగా అలంకరించారు. పూల పరిమళాలు, జానపద గీతాలు, కోలాటాలు, సంప్రదాయ నృత్యాలతో వేడుకలు కన్నుల పండువగా సాగాయి.

**ట్యాంక్‌బండ్‌పై మహా బతుకమ్మ ర్యాలీ**

రాజధాని హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. అమరవీరుల స్మారకం నుంచి మహా బతుకమ్మ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సుమారు 700 మంది కళాకారులు, 600 మందికిపైగా మహిళలు పాల్గొని వేడుకలకు ప్రత్యేక శోభను తీసుకొచ్చారు. సంప్రదాయ బతుకమ్మ పాటలు, జానపద కళారూపాలు, రంగురంగుల పూల అలంకరణలతో ర్యాలీ ఆకట్టుకుంది. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా కళాకారులు ప్రదర్శించిన కార్యక్రమాలు సందర్శకులను అలరించాయి. మహిళలు బతుకమ్మలతో సంప్రదాయబద్ధంగా ఆటపాటల్లో పాల్గొనడంతో ట్యాంక్‌బండ్ పరిసరాలు పండుగ సందడితో నిండిపోయాయి. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు వేడుకలను ఆసక్తిగా తిలకించారు.

**ప్రముఖుల సందడి.. ప్రత్యేక ఆకర్షణగా వేడుకలు**

ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క పాల్గొన్నారు. సినీనటులు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న కూడా వేడుకలకు హాజరయ్యారు. ప్రముఖుల రాకతో కార్యక్రమానికి మరింత ప్రత్యేకత ఏర్పడింది. తెలంగాణ సంప్రదాయాలు, పండుగల వైభవాన్ని ప్రతిబింబించే ఈ వేడుకల్లో ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. రాష్ట్ర సంస్కృతి, జానపద కళలు, పూల పండుగ ప్రాధాన్యాన్ని చాటిచెప్పేలా నిర్వహించిన కార్యక్రమాలు వేడుకలకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. సంప్రదాయ పద్ధతుల్లో బతుకమ్మలను పేర్చి పూజలు నిర్వహించడం, వాటి చుట్టూ పాటలు పాడుతూ నృత్యాలు చేయడం పండుగలోని ప్రత్యేకతను చాటింది.

**ఆకట్టుకున్న ఫైర్‌వర్క్స్, లేజర్ షో**

ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఫైర్‌వర్క్స్, లేజర్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రంగురంగుల కాంతులతో పరిసరాలు మెరిసిపోగా, పండుగను తిలకించేందుకు వచ్చిన ప్రజలు వేడుకలను ఆస్వాదించారు. సంప్రదాయ సంబురాలకు ఆధునిక సాంకేతిక ప్రదర్శనలు జోడించడంతో కార్యక్రమం మరింత ఆకర్షణీయంగా మారింది. తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించేలా కళా ప్రదర్శనలు, సంగీత కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా పండుగ ప్రత్యేకతను చాటిచెప్పారు. బతుకమ్మ పండుగలోని ఆధ్యాత్మికత, ప్రకృతి ఆరాధన, సామూహిక ఐక్యత వంటి అంశాలు ఈ వేడుకల్లో ప్రతిఫలించాయి.

**మెదక్ నుంచి ఆదిలాబాద్ వరకు పండుగ కోలాహలం**

హైదరాబాద్‌తో పాటు మెదక్, ఆదిలాబాద్, జనగామ, నిజామాబాద్, వరంగల్ తదితర జిల్లాల్లోనూ సద్దుల బతుకమ్మ సంబురాలు ఘనంగా జరిగాయి. పట్టణాలు, గ్రామాల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించారు. తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర పూలతో పేర్చిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్రామాల్లోని వీధులు, పట్టణాల్లోని కూడళ్లు బతుకమ్మలతో కళకళలాడాయి. సాయంత్రం వేళ మహిళలు ఒకచోట చేరి సంప్రదాయ గీతాలు ఆలపిస్తూ, బతుకమ్మల చుట్టూ వలయాకారంలో తిరుగుతూ ఆటపాటల్లో మునిగిపోయారు. చిన్నారులు సైతం ఉత్సాహంగా పాల్గొని పెద్దలతో కలిసి పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలను కొనసాగిస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు కలసి వేడుకలు జరుపుకున్నారు.

**ప్రకృతిని ఆరాధించే పూల పండుగ**

బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల జీవన విధానంలో ప్రకృతికి ఉన్న ప్రాధాన్యాన్ని తెలియజేస్తుంది. వర్షాకాలం ముగింపు సమయంలో లభించే వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి పూజించడం ఈ పండుగలో ప్రధాన సంప్రదాయం. పూల అందం, రంగులు, సువాసనలతో బతుకమ్మలను తీర్చిదిద్దడం మహిళల సృజనాత్మకతకు నిదర్శనంగా నిలుస్తుంది. బతుకమ్మ పాటల్లో కుటుంబ బంధాలు, గ్రామీణ జీవనం, ప్రకృతి సౌందర్యం, మహిళల భావోద్వేగాలు ప్రతిబింబిస్తాయి. ఒకచోట చేరి పాటలు పాడటం, నృత్యాలు చేయడం ద్వారా మహిళల మధ్య ఆత్మీయత, సామూహిక ఐక్యత బలపడతాయి. ప్రకృతిని గౌరవించడం, స్థానిక పూల విశిష్టతను గుర్తించడం, సంప్రదాయాలను భావితరాలకు అందించడం వంటి సందేశాలను ఈ పండుగ అందిస్తుంది.

**తెలంగాణ అస్తిత్వానికి ప్రతీకగా బతుకమ్మ**

బతుకమ్మ కేవలం పూల పండుగ మాత్రమే కాదు.. తెలంగాణ సంస్కృతి, భాష, జానపద సంప్రదాయాలు, మహిళల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే వేడుక. రాష్ట్ర ప్రజలు ఎక్కడ ఉన్నా బతుకమ్మ పండుగను ఆత్మీయంగా జరుపుకోవడం ఈ పండుగకు ఉన్న విశిష్టతను తెలియజేస్తుంది. పల్లె నుంచి నగరం వరకు అన్ని వర్గాల ప్రజలను ఒకచోట చేర్చి ఐక్యతను పెంపొందించే పండుగగా బతుకమ్మ ప్రత్యేక గుర్తింపు పొందింది. సద్దుల బతుకమ్మ వేడుకలతో తెలంగాణ అంతటా పండుగ వాతావరణం నెలకొంది. సంప్రదాయ పాటలు, పూల అలంకరణలు, సాంస్కృతిక కార్యక్రమాల మధ్య ప్రజలు ఆనందోత్సాహాలతో పండుగను జరుపుకున్నారు. పూల సోయగాలతో తెలంగాణ నేల మరోసారి తన సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పింది. పూలను పూజిస్తూ.. ప్రకృతిని ఆరాధిస్తూ.. సంప్రదాయాలను కాపాడుతూ సాగిన సద్దుల బతుకమ్మ సంబురాలు తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, రాష్ట్ర సంస్కృతి గొప్పతనానికి ప్రతీకగా నిలిచాయి.

# ఫ్యూచర్‌సిటీకి సీఎం రేవంత్

-మొదటిపేజీ తరువాయి

కీలక కేంద్రంగా భారత్ ఫ్యూచర్‌సిటీని తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈ క్రమంలో మౌలిక సదుపాయాల కల్పన, పోలీసు వ్యవస్థ బలోపేతం, నైపుణ్యాభివృద్ధి సంస్థల ఏర్పాటు వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తోంది. ముఖ్యమంత్రి పర్యటనలో చేపట్టనున్న కార్యక్రమాలు ఈ లక్ష్యాలకు అనుగుణంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి

**పోలీస్ కమిషనరేట్ ప్రారంభోత్సవం**

ఫ్యూచర్‌సిటీలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడంలో కొత్త పోలీస్ కమిషనరేట్ కీలక పాత్ర పోషించనుంది. ఈ కమిషనరేట్ ప్రారంభంతో సంబంధిత ప్రాంతంలో పోలీసు పరిపాలనను మరింత సమర్థంగా నిర్వహించేందుకు అవసరమైన వ్యవస్థకు ఊతం లభించనుంది. ఫ్యూచర్‌సిటీ పరిధిలో భవిష్యత్తులో పారిశ్రామిక సంస్థలు, విద్యాసంస్థలు, వాణిజ్య కేంద్రాలు, నివాస ప్రాంతాలు అభివృద్ధి చెందనున్న నేపథ్యంలో శాంతిభద్రతలకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడుతోంది. పెట్టుబడులు పెట్టే సంస్థలకు అనుకూలమైన వాతావరణం కల్పించడంతో పాటు స్థానిక ప్రజలకు భద్రత కల్పించడం కూడా పోలీసు వ్యవస్థ ముందున్న ముఖ్యమైన బాధ్యత.

కొత్త కమిషనరేట్ ద్వారా పోలీసు సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడం, ఫిర్యాదుల పరిష్కారం, నేరాలపై పర్యవేక్షణ, అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించడం వంటి అంశాల్లో మెరుగుదల సాధించే అవకాశం ఉంది. అయితే, కమిషనరేట్ పరిధి, అధికారుల నియామకాలు, పోలీస్ స్టేషన్ల వివరాలపై అధికారిక ప్రకటన వెలువడిన తర్వాత పూర్తి స్పష్టత రానుంది.

**యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీపై దృష్టి**

ముఖ్యమంత్రి పర్యటనలో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ సందర్శన మరో కీలక అంశంగా నిలవనుంది. మారుతున్న పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ అందించడం, ఉద్యోగాలకు అవసరమైన ప్రాయోగిక పరిజ్ఞానాన్ని పెంపొందించడం ఈ తరహా విద్యాసంస్థల ప్రధాన ఉద్దేశం. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కేవలం విద్యార్హతలతో పాటు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు కూడా కీలకంగా మారాయి. సాంకేతిక పరిజ్ఞానం, పరిశ్రమల అవసరాలు, ఆధునిక ఉద్యోగ విధానాలకు అనుగుణంగా యువతను తీర్చిదిద్దితే ఉపాధి అవకాశాలు మెరుగుపడే వీలుంటుంది. ఈ నేపథ్యంలో స్కిల్స్ యూనివర్సిటీ కార్యకలాపాలు, శిక్షణా కార్యక్రమాలు, భవిష్యత్ ప్రణాళికలపై ముఖ్యమంత్రి దృష్టి సారించే అవకాశం ఉంది. ఫ్యూచర్‌సిటీని పెట్టుబడులు, సాంకేతిక రంగం, విద్య, పరిశోధనలకు ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి నైపుణ్యాభివృద్ధి కూడా ముఖ్యమైన భాగం. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు కలిగిన మానవ వనరులను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా రాష్ట్ర యువతకు కొత్త అవకాశాలు కల్పించవచ్చనే భావనతో ప్రభుత్వం ఈ రంగానికి ప్రాధాన్యం ఇస్తోంది.

**ఎన్ఐయూఎం క్యాంపస్ నిర్మాణానికి శంకుస్థాపన**

పట్టణాభివృద్ధి, నగరాల ప్రణాళిక, మౌలిక సదుపాయాల నిర్వహణకు సంబంధించిన అంశాల్లో ఎన్ఐయూఎం క్యాంపస్ ప్రాధాన్యం సంతరించుకోనుంది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ పట్టణ పరిపాలన, విధాన రూపకల్పన, నగరాభివృద్ధి నిర్వహణకు సంబంధించిన అంశాలపై దృష్టి సారించే సంస్థగా పనిచేస్తోంది. ఫ్యూచర్‌సిటీ వంటి భారీ పట్టణాభివృద్ధి ప్రాజెక్టులో ప్రణాళికాబద్ధమైన నిర్మాణం, రవాణా సదుపాయాలు, నీటి నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ, డిజిటల్ సేవలు, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన కీలకమైనవి. ఇలాంటి అంశాల్లో నిపుణుల సహకారం, సమర్థమైన పట్టణ నిర్వహణ వ్యవస్థలు అవసరమవుతాయి. ఈ నేపథ్యంలో ఎన్ఐయూఎం క్యాంపస్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం పట్టణాభివృద్ధి రంగానికి సంబంధించిన మౌలిక సదుపాయాల విస్తరణలో ఒక ముఖ్యమైన అడుగుగా నిలవనుంది. క్యాంపస్ నిర్మాణ వ్యయం, విస్తీర్ణం, పూర్తయ్యే గడువు, అందించే కోర్సులు లేదా శిక్షణా కార్యక్రమాల వివరాలు అధికారికంగా వెల్లడైతే ఈ ప్రాజెక్టు పరిధిపై మరింత స్పష్టత లభించనుంది.

## టామ్‌కామ్ వ్యవహారంపై సీఐడీ విచారణ జరిపించాలి

-మొదటిపేజీ తరువాయి

ఈ వ్యవహారంలో వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడానికి సీఐడీతో లేదా న్యాయ విచారణతో దర్యాప్తు జరిపించాలని, బాధ్యులుగా తేలిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విదేశీ ఉద్యోగాల కల్పనకు సంబంధించి ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేసి, నియామక ప్రక్రియ, వసూళ్లు, ఉద్యోగాల పురోగతిపై పూర్తి వివరాలు వెల్లడించాలని కోరారు.

**నిరుద్యోగులకు అండగా ఉంటాం**

విదేశాల్లో ఉద్యోగాలు సాధించాలనే ఆశతో యువత అప్పులు చేసి, కుటుంబ ఆస్తులు తాకట్టు పెట్టి డబ్బులు చెల్లించడం ఆందోళనకరమని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బాధితులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. బాధితుల సమస్యలను పరిష్కరించే వరకు బీఆర్ఎస్ వారి పక్షాన నిలబడి పోరాడుతుందని స్పష్టం చేశారు. అయితే, ఈ ఆరోపణలపై ప్రభుత్వం లేదా టామ్‌కామ్ సంస్థ అధికారికంగా స్పందించిన వివరాలు అందుబాటులో ఉన్న సమాచారంలో లేవు. ఆరోపణలపై అధికారిక విచారణ జరిగితేనే వసూళ్లు, ఉద్యోగ నియామకాల పరిస్థితి, బాధ్యత వహించాల్సిన వ్యక్తుల వివరాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

**అసలేంటి టామ్‌కామ్?**

తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) విదేశాల్లో ఉద్యోగాలు కోరుకునే రాష్ట్ర యువతకు అవకాశాలు కల్పించేందుకు పనిచేసే సంస్థ. విదేశీ ఉద్యోగాల నియామక ప్రక్రియలో మధ్యవర్తుల మోసాలను తగ్గించడం, అభ్యర్థులకు సరైన మార్గదర్శకత్వం అందించడం దీని ప్రధాన ఉద్దేశం. అధికారిక ప్రక్రియ ద్వారా అభ్యర్థుల వివరాలను నమోదు చేసుకుని, వారి అర్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా విదేశీ ఉద్యోగావకాశాల గురించి సమాచారం అందించడం, నియామక ప్రక్రియలో సహకరించడం వంటి సేవలను ఈ సంస్థ అందిస్తుంది. అయితే, ప్రతి ఉద్యోగానికి సంబంధించిన అర్హతలు, ఎంపిక విధానం, ఫీజులు, నియామక గడువులు వేర్వేరుగా ఉండవచ్చు. అభ్యర్థులు అధికారిక ప్రకటనలను పరిశీలించి, చెల్లింపులకు సంబంధించిన రసీదులు, ఒప్పందాలు భద్రపరచుకోవడం ముఖ్యం.

**టామ్‌కామ్ ద్వారా ఏయే దేశాల్లో ఉద్యోగావకాశాలు?**

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియా, ఒమన్, బహ్రెయిన్, ఖతర్, కువైట్ వంటి గల్ఫ్ దేశాలతో పాటు జర్మనీ, జపాన్, పోర్చుగల్, ఇజ్రాయెల్ తదితర దేశాల్లోనూ నైపుణ్యం కలిగిన అభ్యర్థులకు ఉద్యోగావకాశాలు కల్పించే దిశగా టామ్‌కామ్ పనిచేస్తోంది. ఆయా దేశాల్లోని సంస్థలు అవసరమైన ఉద్యోగుల నియామకం కోసం టామ్‌కామ్‌ను సంప్రదించే అవకాశం ఉంది. విదేశీ ఉద్యోగాల కోసం ప్రయత్నించే యువత నియామక సంస్థ విశ్వసనీయతను, ఉద్యోగ ఒప్పందంలోని నిబంధనలను, వీసా వివరాలను, వసూలు చేసే మొత్తానికి సంబంధించిన అధికారిక ఆధారాలను తప్పనిసరిగా పరిశీలించాలి. ముఖ్యంగా ప్రభుత్వ సంస్థ పేరు మీద డబ్బులు చెల్లించే ముందు సంబంధిత అధికారిక వెబ్‌సైట్ లేదా కార్యాలయం ద్వారా వివరాలను నిర్ధారించుకోవాలి. మొత్తంగా, టామ్‌కామ్ ద్వారా జర్మనీ ఉద్యోగాల కోసం డబ్బులు చెల్లించిన యువతకు న్యాయం చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఆరోపణలపై విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించడం, బాధితుల సమస్యలను పరిష్కరించడం ఇప్పుడు కీలకంగా మారింది.

## ముంచుకొస్తున్న ఎల్‌నినో ముప్పు



ఎల్‌నినో తెలంగాణ రాష్ట్రంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. ఇటీవల కాలంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జలాశయాల్లోని భూగర్భ జలాలు క్రమంగా అడుగంటుతున్నాయి. సాధారణంగా వేసవిలో తలెత్తే నీటి సమస్య ఇప్పుడే ముంచుకొస్తోంది. రాబోయే రోజుల్లో ఈ సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందనే అంచనాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉన్న పరిమితమైన నీటి వనరులను అవసరం మేరకు మాత్రమే వాడుకుని, నీటి వృథాను అరికట్టడం ద్వారా మాత్రమే ఈ గడ్డు పరిస్థితి నుంచి బయట పడగలం. ప్రభుత్వం సరఫరా చేస్తున్న తాగునీటిని ఇతర అవసరాలకు వాడొద్దని నిపుణులు సూచిస్తున్నారు.

**ఇతర పనులకు శుద్ధిచేసిన మురుగు జలాలు**

తాగునీటేతర అవసరాల కోసం శుద్ధిచేసిన మురుగు జలాలను వినియోగించాలని నిపుణులు సూచిస్తున్నారు. హైదరాబాద్ నగరం సహా ఇతర ప్రధాన నగరాల్లో అత్యాధునిక విధానాలతో మురుగునీటిని శుద్ధి చేస్తున్నారు. వాహనాలు, ఇంటి పరిసరాల శుభ్రత, గార్డెనింగ్ తదితర అవసరాల కోసం శుద్ధిచేసిన మురుగు జలాలను ఉపయోగించాలి.

**ఇలా చేయకండి!**

ొంతమంది కార్లు, బైక్?లు శుభ్రం చేసేందుకు కుళాయి నుంచి వచ్చే పైపులను వాడుతుంటారు. దీనివల్ల అధికంగా నీరు వృథా అవుతుంది. అందువల్ల తడివస్త్రంతో కారు శుభ్రం చేసుకోవడం మంచిది. బకెట్‌లో నీటిని వినియోగించి తడిగుడ్డతో శుభ్రంచేస్తే 20 లీటర్లు, అంతకంటే తక్కువ నీటితోనే సరిపెట్టేందుకు అవకాశం ఉంటుంది. వాహనాలను పైపుతో కడగటం కారణంగా వాటి మూలల్లో నీరు నిలిచిపోయి తుప్పుపట్టే అవకాశం ఉంది. ఫలితంగా వాటి జీవితకాలం కూడా తగ్గిపోతుంది. నేరుగా నీటితో శుభ్రం చేయాల్సివస్తే ప్రెషర్ (పవర్) వాషర్ లేదా వాటర్ స్ప్రే ఉన్న హోస్ పైపును వాడాలి.

**షవర్ స్నానాలు వద్దు**

షవర్‌తో స్నానం చేయడం వల్ల కూడా అధికంగా నీరు వృథా అవుతుంది. అందువల్ల బక్?ట్?నే ఉపయోగించి స్నానం చేయడం మంచిది. షవర్‌తో స్నానం చేస్తే 100 లీటర్ల నీరు వృథా అవుతుంది.అదే బకెట్ అయితే కొంచెం నీరు సరిపోతాయి.

స్నానం చేసేందుకు టబ్‌లు వాడటం వల్ల కూడా అధికంగా నీరు వినియోగం అవుతాయి. దీనివల్ల నీరు ఎక్కువగా వృథా అవుతాయి.

నడకబాటలు, ఇంటి ఆవరణను శుభ్రం చేసేందుకు పైపులతో నీళ్లు కొట్టడం కంటే, మగ్?లు వాడి చిలకరించడం మంచిది. కుళాయి నీరు పట్టేటప్పుడు ఇంట్లోని బిందులు, పాత్రల్లో ఉన్న పాత నీరును వృథాగా పారవేయొద్దు. వాటిని మొక్కలకు పోయడం లేదా తాగునీటేతర అవసరాలకు వాడుకోవడం మంచిది. షేవింగ్ చేసుకునేటప్పుడు, బ్రష్, చేతులు శుభ్రపరుచుకునేందుకు ట్యాప్?ను తెరిచి అలానే వదిలేయకుండా మగ్?ను వినియోగించండి. తద్వారా వృథాను ఆపండి.

**నీటి వృథా వద్దు**

కూరగాయలు, పళ్లు కుళాయి కింద శుభ్రం చేయడం కంటే గిన్నెలో నీరు పోసి కడగండి. మొక్కలకు ఉదయం పూట లేదా సాయంత్రం వేళల్లో మాత్రమే నీటిని పెట్టడం ఉత్తమం. ఎక్కువ విస్తీర్ణంలో ఉండే మొక్కలకు మల్చింగ్ చేసినట్లయితే తక్కువ నీటి వినియోగం ఉంటుంది. వాషింగ్ మెషిన్లతో దుస్తులు ఉతకడం మేలు. వీటిని ఉపయోగించడం వల్ల నీరు వృథా కాదు. డిష్ వాషర్లు తక్కువ నీటిని వినియోగించుకుంటాయి. చేతితో శుభ్రంచేసినట్లయితే 90 లీటర్లకుపైగా నీరు వినియోగం అయితే, డిష్‌వాషర్ 11 లీటర్ల నీటితో శుభ్రం చేస్తుంది. కొన్నిసార్లు కుళాయిలు, ఫ్లష్ ట్యాంకుల్లో లీకేజీ అవుతుంటాయి. లీకయ్యే కుళాయి ద్వారా రోజుకు సుమారు 100 లీటర్ల వరకు నీరు వృథా అవుతుంది.

printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS.
published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512